నేత కాదు... నీతి అవసరం

- బిజెపి బలం దిగజారుతోంది
- ఇండియా వేదికకు ఆదరణ పెరుగుతోంది
- మత సమీకరణకు కాషాయ పార్టీ ప్రయత్నిస్తోంది
- 'ది హిందూ' ఇంటర్వ్యూలో సిపిఎం ప్రధాన కార్యదర్శి ఏచూరి

7

PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 283 | విజయవాడ, శనివారం 18 మే 2024 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Saturday 18 May 2024 | Rs

రాహుల్, పూరన్ ధనా ధన్..

- ముంబయిపై 18పరుగుల తేడాతో లక్నో గెలుపు

8



ఎన్నికల హింసపై సిట్

ఐజి వినీత్ బ్రిజ్‌లాల్ నేతృత్వంలో 13 మందితో కమిటీ • దర్యాప్తు ప్రారంభం • నేటి సాయంత్రానికి నివేదిక • నిర్లక్ష్యపు అధికారులపై కేసు నమోదు • కీలక నేతలను అరెస్టుచేసే అవకాశం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎన్నికల సందర్భంగా చోటు చేసుకున్న హింసపై దర్యాప్తు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (సిట్)ను ఏర్పాటు చేసింది. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన ఈ ప్రత్యేక దర్యాప్తు బృందానికి ఐజి వినీత్ బ్రిజ్‌లాల్ నేతృత్వం వహించనున్నారు. మరో 13 మంది పోలీస్ అధికారులను ఈ కమిటీలో సభ్యులుగా ప్రభుత్వం నియమించింది. పోలింగ్ రోజు, ఆ తరువాత రోజుల్లోనూ రాష్ట్రంలో చోటుచేసుకున్న హింసపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన కేంద్ర ఎన్నికల సంఘం, కొందరు అధికారులపై చర్యలు తీసుకోవడంతో పాటు, సిట్‌ను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో కసరత్తు చేసిన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి శుక్రవారం సాయంత్రానికి సిట్‌ను ఏర్పాటు చేశారు. రెండు రోజుల్లోనే నివేదిక ఇవ్వాలని ఆదేశించడం, సిట్ ఏర్పాటు సమయానికే దాదాపుగా ఒక రోజు గడిచిపోవడంతో, ఏర్పాటు ప్రకటన వెలువడిన వెంటనే సిట్ సభ్యులు దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిసింది. శనివారం



ఐజి వినీత్ బ్రిజ్‌లాల్

సాయంత్రానికి సాధ్యమైనంత మేరకు నివేదిక ఇవ్వడం లక్ష్యంగా సిట్ పని చేస్తోంది. దానికి వీలుగానే ఘర్షణలు జరిగిన ప్రాంతాలకు చెందిన పోలీస్ అధికారులకు సైతం సిట్‌లో స్థానం కల్పించారు. పల్నాడు, మాచర్ల, నరసరావుపేట, తిరుపతి, తాడిపత్రి ఘటనలపై సిట్ విచారణ జరపనుంది. తాజాగా విశాఖలో జరిగిన ఘటననూ సిట్ పరిధిలోకి తెచ్చే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు సమాచారం. సిట్ ఇచ్చే వివరాల ఆధారంగా నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోనున్నారు. అవసరమైతే ఉద్యోగాల నుండి తొలగించే అవకాశమూ ఉందని సీనియర్ అధికారులు తెలిపారు. ముఖ్యంగా. తాడిపత్రి ఘటనలో డిఎస్‌పి చైతన్య తన పరిధి దాటి వ్యవహరించారన్న అభిప్రాయం పోలీస్ ఉన్నతాధికారుల్లో వ్యక్తమవుతోంది. దీనిపై సిట్ ఎలా స్పందిస్తుందో చూడాల్సిఉంది. హింసకు కారణమైన ముఖ్య నాయకులను అరెస్ట్ చేసే అవకాశం ఉందని సమాచారం. సిట్‌కు విచారణ సమయంలో పూర్తిస్థాయి అధికారాలు కల్పించారు. గుర్తించిన అంశాల అధారంగా అవసరమైతే కొత్తగా ఎఫ్ఐఆర్ నమోదు చేసేందుకు అధికారం ఇచ్చారు.

కౌంటింగ్ తరువాత కూడా..!

కౌంటింగ్ తర్వాత కూడా రాష్ట్రంలో హింసాత్మక ఘటనలు చెలరేగే అవకాశం ఉందని కేంద్ర నిఘా సంస్థలు హెచ్చరించాయి. ఈ మేరకు తగు భద్రతా ఏర్పాట్లను చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించాయి. ఎన్నికల ఫలితాల తర్వాత ప్రతీకార దాడులు పెద్దఎత్తున జరిగే అవకాశం ఉందని తెలిపింది. పల్నాడు, అనంతపురం, చిత్తూరు, తిరుపతి, కడప, కర్నూలు, ప్రకాశం జిల్లాల్లో అప్రమత్తంగా ఉండాలని నిఘా సంస్థలు సూచించాయి.

సిట్ వీరితో...

నేతృత్వం : ఐజి వినీత్ బ్రిజ్‌లాల్

సభ్యులు

రమాదేవి	ఎస్‌పి, ఎసిబి
సౌమ్యలత	అదనపు ఎస్‌పి. ఎసిబి
రమణమూర్తి	డిఎస్‌పి, ఎసిబి శ్రీకాకుళం
పి.శ్రీనివాసులు	డిఎస్‌పి, సిఐడి
పల్లూరి శ్రీనివాసరావు	డిఎస్‌పి, ఎసిబి ఒంగోలు
రవి మనోహర ఆచారి	డిఎస్‌పి, ఎసిబి తిరుపతి
వి. భూషణం	ఇన్‌స్పెక్టర్ , గుంటూరు రేంజ్
కె. వెంకటరావు	ఇన్‌స్పెక్టర్ ఇంటెలిజెన్స్,విశాఖ
రామకృష్ణ	ఇన్‌స్పెక్టర్, ఎసిబి
జిఐ శ్రీనివాస్	ఇన్‌స్పెక్టర్, ఎసిబి
మోయిన్	ఇన్‌స్పెక్టర్ ఒంగోలు
ఎన్. ప్రభాకర్	ఇన్‌స్పెక్టర్, ఎసిబి, అనంతపురం
శివప్రసాద్	ఇన్‌స్పెక్టర్, ఎసిబి



దేవరాజన్, సీతారాం ఏచూరి

ఏచూరి, దేవరాజన్ ప్రసంగాలు సెన్సార్

- దూరదర్శన్, ఆకాశవాణి 'అధికార నియంతృత్వం'

న్యూఢిల్లీ : సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ నాయకుడు జి.దేవరాజన్ ప్రసంగాల్లోని కొన్ని పదాలను దూరదర్శన్, ఆకాశవాణి తొలగించాయి. 'మత నియంతృత్వ ప్రభుత్వం, క్రూరమైన చట్టాలు, ముస్లింలు' వంటి పదాలను వారి ప్రసంగాల నుండి తీసివేశారు. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా రాజకీయ పార్టీలు ప్రచారం చేసుకోవడానికి దూరదర్శన్, ఆకాశవాణి అవకాశం కల్పిస్తాయి. ప్రతి రాజకీయ పార్టీకి కొంత సమయాన్ని ఇస్తాయి. ఈ నేపథ్యంలో ఢిల్లీలోని దూరదర్శన్ స్టూడియోలో సీతారాం ఏచూరి ఇచ్చిన టెలివిజన్ ప్రసంగం నుండి రెండు పదాలను తొలగించగా, 'దివాలా' ప్రభుత్వం పదాన్ని 'వైఫల్య' ప్రభుత్వంగా మార్చారు. అలాగే, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ నాయకుడు జి.దేవరాజన్ కోల్‌కత్తాలో చేసిన ప్రసంగంలో నుండి 'ముస్లింలు' అనే పదాన్ని తొలగించారు. ఏచూరి ప్రసంగంలో ఎలక్టోరల్ బాండ్ల సూచనలు తొలగించాలని కూడా అధికారులు కోరారు. తన ప్రసంగంలో తొలగింపులను, సవరణలను పున:పరిశీలించాలని దూరదర్శన్ డిజికి ఏచూరి లేఖ రాసారు. ఏచూరి అభ్యర్థనను అధికారులు ఆమోదించలేదు. ఎన్నికల సంఘం ప్రవర్తనా నియమావళి ప్రకారం చర్యలు తీసుకున్నామని, ఇంతకుముందు కూడా ఇలాంటి చర్యలు చేపట్టామని అధికారులు వివరించారు. అయితే అధికారుల తీరుపై దేశవ్యాప్తంగా తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దూరదర్శన్, ఆకాశవాణిలది అధికార నియంతృత్వంగా విశ్లేషకులు విమర్శిస్తున్నారు.

ఎన్నికల చిహ్నాలు (రిజర్వేషన్, కేటాయింపు) ఉత్తర్వులు, నిబంధనలు 1968 ప్రకారం ఆరు జాతీయ పార్టీలు, 59 రాష్ట్ర పార్టీలకు దూరదర్శన్, ఆకాశవాణిలో ప్రచార అవకాశం కల్పిస్తున్నారు. జాతీయ పార్టీలకు దూరదర్శన్ జాతీయ ఛానెల్‌లో కనీసం 10 గంటల సమయం, ప్రాంతీయ దూరదర్శన్, ఆకాశవాణి కేంద్రాల్లో కనీసం 15 గంటల సమయం కేటాయిస్తారు. రాష్ట్ర పార్టీలకు ప్రాంతీయ దూరదర్శన్, ఆకాశవాణి కేంద్రాల్లో మొత్తంగా 30 గంటల సమయం కేటాయిస్తారు. రాజకీయ నాయకులు తమ ప్రసంగాలను రికార్డింగ్ చేయడానికి కనీసం 4 రోజుల ముందే రాత పూర్వకంగా సమర్పించాల్సి ఉంటుంది. ఈ ప్రసంగాలను అధికారులు ఆమోదించాల్సి ఉంటుంది.

విజయవాడ సిటీ

'ఇ-ఆఫీస్'పై వెనుకంజ

- ఆధునీకరణ వాయిదా

విదేశీ ఇన్వెస్టర్లకు 'ఎన్‌డిఎ' భయాలు

- ఒక్క నెలలోనే రూ.30వేల కోట్లు వెనక్కి..

బంధం మరింత బలోపేతం

- చైనా, రష్యా అంగీకారం
- ఉక్రెయిన్ సమస్య పరిష్కారానికి ప్రణాళిక
- పాలస్తీనా సమస్యకు రెండు దేశాల ఏర్పాటే పరిష్కారం
- సంయుక్త ప్రకటన విడుదల



బస్సుల్లో మాచర్ల చేరుకున్న కేంద్ర బలగాలు

అజ్ఞాతంలోకి పిన్నెల్లి సోదరులు!

- మాచర్లలో గన్‌మెన్‌లను వదిలి హైదరాబాద్ పయనం

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

గృహనిర్బంధంలో ఉన్న మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన సోదరుడు వెంకట్రామిరెడ్డి శుక్రవారం అజ్ఞాతంలోకి వెళ్లారని తెలిసింది. పల్నాడు జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఎన్నికల పోలింగ్ రోజున, ఆ తర్వాత వరుసగా రెండు రోజులపాటు జరిగిన ఘర్షణలను కేంద్ర ఎన్నికల సంఘం తీవ్రంగా పరిగణించిన నేపథ్యంలో తమను కూడా అరెస్టు చేస్తారోమోనన్న భయంతో వీరు మాచర్ల నుంచి హైదరాబాద్ వెళ్లిపోయినట్టు సమాచారం. వెళ్లే ముందు ఎమ్మెల్యే తన గన్‌మెన్లను ఎస్‌పి కార్యాలయంలో రిపోర్టు చేయాలని సూచించారు. ఘర్షణలకు కారణమైన వారిలో పలువురు టిడిపి, వైసిపి అభ్యర్థులు కూడా ఉన్నారని ఉన్నతాధికారులు ప్రభుత్వానికి నివేదించడంతో పిన్నెల్లి సోదరులతోపాటు పలువురిని పోలీసులు గృహనిర్బంధంలోనే ఉంచారు. అయినా, వీరు అజ్ఞాతంలోకి వెళ్లిపోవడం చర్చనీయాంశమైంది. దీనిపై ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి మీడియాకు వాట్సప్‌లో ఒక మెసేజ్ పంపారు. తాము వ్యక్తిగత పనుల మీద హైదరాబాద్ వచ్చామని, తాము ఎక్కడికీ పారిపోవాల్సిన అవసరం లేదని ఇందులో పేర్కొన్నారు. టిడిపి వారు తనపై లేనిపోని అభాండాలు వేస్తున్నారని విమర్శించారు. కాగా, పల్నాడు జిల్లాలో 144 సెక్షన్ కొనసాగుతోంది. శుక్రవారం నాడు కేంద్ర బలగాలు మాచర్లకు చేరుకున్నాయి.


'జిందాల్' అక్రమ లాకౌట్

ఒడిశాకు కార్మికుల బదిలీ • నిరసనగా ఉద్యోగుల ధర్నా

ప్రజాశక్తి- కొత్తవలస (విజయనగరం)

విజయనగరం జిల్లా కొత్తవలస మండలం అప్పన్నపాలెం పంచాయతీ పరిధిలోని జిందాల్ స్టెయిన్‌లెస్ స్టీల్ పరిశ్రమకు శుక్రవారం ఉదయం నుంచి యాజమాన్యం లాకౌట్ ప్రకటించింది. అంతర్జాతీయ మార్కెట్లో ముడిసరుకుకు డిమాండ్ ఎక్కువగా ఉండడం, ఇతర కారణాల వల్ల పరిశ్రమను మూసివేస్తున్నట్లు జిందాల్ పరిశ్రమ జిఎం దినేష్ శర్మ, హెచ్‌ఆర్ జిఎం గోపాల్‌కృష్ణ తెలిపారు. కార్మికులందరినీ ఒడిశా రాష్ట్రం జాజ్‌పూర్‌లోని జిందాల్ పరిశ్రమకు బదిలీ చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు పరిశ్రమ గేటు వద్ద నోటీసు బోర్డు పెట్టారు.

మళ్లీ పరిశ్రమను తెరిచినప్పుడు కార్మికులందరినీ ఇక్కడే పనిలో పెట్టుకుంటామని, పరిశ్రమను శాశ్వతంగా మూసివేయడం లేదని, ముడిసరుకు ధరలు తగ్గేంత వరకు మాత్రమే మూసివేస్తున్నామని యాజమాన్యం పేర్కొంది. ఈ కంపెనీలో రెగ్యులర్ ఉద్యోగులతో పాటు కాంట్రాక్టు కార్మికులు 450 మంది పనిచేస్తున్నారు. లాకౌట్ నేపథ్యంలో జిందాల్ పరిశ్రమ వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.



లాకౌట్‌ను నిరసిస్తూ ధర్నా చేస్తున్న కార్మికులు

ఇక్కడే ఉపాధి కల్పించాలి

యాజమాన్యం నిర్ణయాన్ని నిరసిస్తూ కార్మికులు పరిశ్రమ గేటు ఎదుట ధర్నా చేశారు. ఈ ధర్నాలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, వైఎస్‌ఆర్‌టియుసి నాయకులు నెక్కల నాయుడుబాబు మాట్లాడుతూ లాకౌట్‌ను ఎత్తివేసి కార్మికులకు, ఉద్యోగులకు ఇక్కడే పని కల్పించాలని డిమాండ్ చేశారు. ముందస్తు ప్రకటన చేయకుండా లాకౌట్ విధించడం అన్యాయమన్నారు. అనంతరం కంపెనీ ప్రతినిధులతో చర్చించారు. కార్మికుల జీతభత్యాలు ఈ నెలాఖరు వరకు చెల్లించాలని కోరారు. కార్మికులను, ఉద్యోగులను జాజ్‌పూర్ పంపిస్తే రవాణా సదుపాయంతో పాటు హాస్టల్, భోజన సదుపాయం, అదనపు వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. యాజమాన్యంతో మాట్లాడి లే ఆఫ్ వేతనంపై నిర్ణయం వెల్లడిస్తామని పరిశ్రమ జిఎం తెలిపారు. కార్యక్రమంలో లక్కవరపుకోట ఎంపిపి గేదెల శ్రీనివాస్, సిఐటియు నాయకులు గాడి అప్పారావు, ఉత్తరాపల్లి, అప్పలపాలెం, నిమ్మలపాలెం సర్పంచులు సింగంపల్లి గణేష్, కోన దేముడు, కొట్యాడ శ్రీను, కార్మికులు పాల్గొన్నారు.

ఓట్ల వివరాల వెల్లడిలో జాప్యంపై

ఇసి వివరణ కోరిన సుప్రీం

న్యూఢిల్లీ : పోలింగ్ ముగిసిన 48 గంటల్లోగా పోలింగ్ కేంద్రాలవారీగా ఎన్ని ఓట్లు పోలైనదీ సంఖ్యా వివరాలు తెలపాలని కోరుతూ దాఖలైన పిటీషన్‌పై వివరణ ఇవ్వాలని ఎన్నికల సంఘాన్ని సుప్రీంకోర్టు శుక్రవారం ఆదేశించింది. ఈ పిటీషన్‌పై స్పందించాలని ఎన్నికల కమిషన్‌ను సుప్రీంకోర్టు ఆదేశించింది. పోలింగ్ ముగిసిన 48 గంటల్లోనే పోలింగ్ వివరాలను ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో ప్రచురించేలా చూడాలని సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైన విషయం తెలిసిందే. అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఎడిఆర్) సంస్థ దాఖలు చేసిన ఈ పిటిషన్‌ను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం శుక్రవారం విచారించింది. దీనిపై వారం రోజుల్లోగా స్పందనను తెలియజేయాలని ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. ఈ నెల 24న దీనిపై విచారణ జరుపుతామని తెలిపింది. ఎడిఆర్ తరుపున ప్రశాంత్ భూషణ్ వాదనలు వినిపించారు. ప్రతీ పోలింగ్ కేంద్రంలో పోల్ అయిన ఓట్ల సంఖ్యను విడివిడిగా ఫారం-17 సి పార్ట్ 1 స్కాన్డ్ ప్రతుల రూపంలో పొందుపరిచేలా మిగతా 2లో



లండన్‌కు సిఎం జగన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి లండన్ పర్యటనకు బయలుదేరారు. విదేశీ పర్యటనకు సిబిఐ కోర్టు అనుమతి ఇవ్వడంతో కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం రాత్రి వెళ్లారు. గన్నవరం విమానాశ్రయం నుంచి ప్రత్యేక విమానంలో హైదరాబాద్ చేరుకున్నారు. అక్కడ నుంచి ప్రత్యేక విమానంలో లండన్ వెళ్లనున్నారు. గన్నవరం విమానాశ్రయంలో మంత్రులు జోగి రమేష్, కొట్టు సత్యనారాయణ, ఎంపి నందిగం సురేష్, ఎమ్మెల్సీలు తలశిల రఘురాం, మొండితోక అరుణ్‌కుమార్, ఎమ్మెల్యేలు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, సామినేని ఉదయభాను, మల్లాది విష్ణు తదితరులు సిఎంకు వీడ్కోలు పలికారు. జూన్ 1వ తేది వరకు జగన్ విదేశీ పర్యటన సాగనుంది. ఎన్నికల ఫలితాలకు రెండు రోజులు ముందు రాష్ట్రానికి ఆయన చేరుకోనున్నారు.

5న రాష్ట్రానికి 'నైరుతి'

- ద్రోణి ప్రభావంతో నేటి నుండి వర్షాలు
- రెండు మూడు రోజులు ఉండొచ్చు



ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

నైరుతి రుతుపవనాలు జూన్ తొలి వారంలోనే రాష్ట్రాన్ని పలకరించనున్నాయి. వాతావరణ శాఖ అంచనా ప్రకారం జూన్ ఐదవ తేదిన రాష్ట్రంలోకి ప్రవేశించనున్నాయి. ఈ నెల 31వ తేదిన కేరళను నైరుతి రుతపవనాలు తాకుతాయని భారత వాతావరణ శాఖ (ఐఎండి) ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే. అన్నీ అనుకూలిస్తే ఆ తరువాత నాలుగైదు రోజుల్లోనే రాష్ట్రంలోకి రుతుపవనాలు ప్రవేశించే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. మరోవైపు దక్షిణ తమిళనాడు నుండి లక్షద్వీప్ వరకు వ్యాపించి ఉన్న ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో శుక్రవారం వర్షాలు కురిశాయి. దీని ప్రభావం మరో మరో రెండు, మూడు రోజులు కొనసాగనుంది. శనివారం నుండి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఒక మోస్తరు నుండి భారీ వర్షాలు కురవనున్నాయి. తమిళనాడు సహా రాష్ట్రంలోని దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాల్లో రాబోయే రెండు రోజులూ పలుచోట్ల తేలికపాటి వర్షాలు, ఒకటి, రెండు చోట్ల భారీ వర్షాలు కురియనున్నాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఈ ఏడాది నైరుతి రుతుపవన కాలంలో దేశమంతటా మంచి వర్షాలు కురవనున్నాయని విశాఖపట్నం వాతావరణ కేంద్రం శాస్త్రవేత్త సునంద 'ప్రజాశక్తి'కి తెలిపారు. రుతుపవనాలకు ముందు ఈ ఏడాది తుపాన్లకు అవకాశం లేదని, అందువల్లే రుతుపవనాలు సకాలంలో వస్తున్నాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ద్రోణి ప్రభావంతో రానున్న రెండు, మూడు రోజులు రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టనున్నాయి. ఆ తరువాత 20 నుంచి పొడి వాతావరణం నెలకొంటుంది. ఉష్ణోగ్రతలు కూడా కొంత మేర పెరగనున్నాయి. అయితే, ఎండలు పెరిగినా మధ్యాహ్నం మూడు గంటలు దాటాక ఉరుములు, మెరుపులతో వర్షాలు పలుచోట్ల కురిసే అవకాశాలు ఉన్నాయి. ఈ సందర్భంగా వీచే ఈదురు గాలులు గంటకు 50 కిలోమీటర్ల వేగంతో ఉంటాయి. ఈ నెల 25 వరకూ ఈ వాతావరణం కొనసాగుతుందని అంచనా!

అందని ఓటరు నాడితో

ఎవరి ధీమా వారిదే

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సార్వత్రిక ఎన్నికల్లో విజయావకాశాలపై నేతలు ఎవరి ధీమా వారు వ్యక్తం చేస్తున్నారు. తెలుగుదేశం, బిజెపి, జనసేన కూటమి గెలుస్తుందని ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు చెబుతుండగా, వైసిపి గెలిచి మళ్లీ అధికారంలోకి వస్తుందని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించారు. ఓటరునాడి అర్థం గాక, గందరగోళానికి, నిస్తేజానికి గురవుతున్న క్యాడర్లో ధైర్యం నింపడమే లక్ష్యంగా నేతలు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. 13వ తేదీన జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో పోలింగు 81.86 శాతం నమోదైన విషయం తెలిసిందే. ప్రభుత్వం అనుసరించిన విధానాలతో విసిగిపోయిన ప్రజలు వ్యతిరేకంగా ఓటు వేశారని, గెలుపు తమదేనని ప్రతిపక్షం చెప్పుకుంటోంది. సంక్షేమ పథకాలు అమలు చేయడం వల్ల ప్రజలు నమ్మకంతో మరోసారి తమకు ఓటు వేశారని అధికారపక్షమూ ప్రకటించుకుంటోంది. పెరిగిన ఓటింగు దేనికి సంకేతమో అర్థంకాని పరిస్థితుల్లో అధికార, ప్రతిపక్ష పార్టీల కార్యకర్తల్లో అయోమయం నెలకొంది. పార్టీల కేంద్ర కార్యాలయాలకు వచ్చేవారి సంఖ్య పూర్తిగా తగ్గిపోయింది. తప్పనిసరి పరిస్థితుల్లో ప్రెస్‌మీట్లు పెట్టే కొందరు నేతలు, ఎన్నికల సంఘానికి వినతులు సమర్పించే బృందాలు తప్ప మిగిలిన వారెవరూ కార్యాలయాల్లో కనిపించడం లేదు. సర్వే సంస్థలు ఇస్తున్న నివేదికలను నమ్మలేని పరిస్థితుల్లో పార్టీల కార్యాలయాల్లో వాతావరణం స్తబ్ధుగా మారింది. రెండు పార్టీల నాయకులు ఈసారి ప్రజాసమస్యల ప్రస్తావన కంటే వ్యక్తిగత అంశాలపైనే దృష్టి సారించారు. ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నా కొద్దికాలం క్రితం జరిగిన శాసనమండలి ఎన్నికల్లో తెలుగుదేశం అభ్యర్థులు విజయం సాధించారు. ఎన్ని సంక్షేమ పథకాలు పెట్టినా టిడిపికి ఓటేయడంపై ఆసక్తికరమైన చర్చ జరిగింది. సంక్షేమ పథకాలపై జగన్ ధీమా పెట్టుకుంటే, ప్రభుత్వ భారాలు, వ్యతిరేకతపై తెలుగుదేశం ధీమా పెట్టుకుంది. దీంతో రెండు పార్టీల నాయకులు కూడా ఓట్లు ఎటు పడతాయనే అంశంపై స్పష్టమైన అంచనాకు రాలేకపోతున్న నేపథ్యంలో ఆయా పార్టీల కార్యకర్తల్లోనూ కనబడని ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో వారిలో ధైర్యం నింపేందుకు అధినేతలు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. ఎన్నికలరోజు, అనంతరం వరుసగా జరుగుతున్న దాడులు, పెట్రేగిన హింస పార్టీల్లో ఉన్న అసహనానికి నిదర్శనమని రాజకీయ పరిశీలకులు అంచనా వేస్తున్నారు.





బారక్‌పూర్‌లో ఏచూరి ప్రచారం

కొల్‌కతా : పశ్చిమ బెంగాల్‌లో లెఫ్ట్‌ఫ్రంట్ అభ్యర్థులకు మద్దతుగా జరిగిన ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో సిపిఎం ప్రధానకార్యదర్శి సీతారాం ఏచూరి పాల్గొన్నారు. బారక్‌పూర్ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేస్తున్న సిపిఎం అభ్యర్థి దేవదత్ ఘోష్‌కు మద్దతుగా శుక్రవారం జరిగిన బహిరంగసభలో ఏచూరి ప్రసంగించారు. మతోన్మాద బిజెపిని, నిరంకుశ తృణమూల్ కాంగ్రెస్‌ను ఓడించి వామపక్ష, ప్రగతిశీల అభ్యర్థులను గెలిపించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సభలో దేవదత్ ఘోష్‌తో పాటు పశ్చిమ బెంగాల్ సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు గార్గి ఛటర్జీ, సోమనాథ్ భట్టాచార్య తదితరులు ప్రసంగించారు.

విజయవాడ డివిజన్ పరిధిలో 14 రైళ్లు రద్దు

ప్రజాశక్తి-అమరావతి

విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ నిర్వహణ కోసం 14 రైళ్లు రద్దు చేసినట్టు దక్షిణ మధ్య రైల్వే తెలిపింది. ఈ నెల 17 నుంచి జూన్ 4 వరకు వివిధ రోజుల్లో కొన్ని రైళ్లు రద్దు చేస్తున్నట్టు అధికారులు తెలిపారు. రాజమహేంద్రవరం - విశాఖపట్నం, మచిలీపట్నం - విశాఖ, తిరుపతి - కాకినాడ, గుంటూరు - విశాఖపట్నం, గుంటూరు- రాయగడ, విశాఖపట్నం- మహబూబ్‌నగర్, గుంటూరు- విశాఖపట్నం తదితర ప్రాంతాలకు వెళ్లే 14 రైళ్లను రద్దు చేసినట్టు తెలిపారు. రద్దైన రైళ్ల వివరాలను రైల్వేశాఖ వెబ్‌సైట్‌లో పొందుపర్చినట్టు పేర్కొన్నారు.

ఎవరెస్ట్ మసాలాలపై నేపాల్‌లో నిషేధం

నేపాల్ : భారత్‌కు చెందిన మసాలాల కంపెనీలు ఎవరెస్ట్, ఎండిహెచ్ లను నేపాల ప్రభుత్వం బ్యాన్ చేసింది. వీటిలో హానికరమైన రసాయనాలు ఉన్నాయని ఇటీవలే వార్తలు వచ్చిన సంగతి విదితమే. ఈ నేపథ్యంలో ఇటీవల సింగపూర్, హాంకాంగ్‌లలో ఎండిహెచ్-ఎవరెస్ట్ మసాలాలను బ్యాన్ చేశారు. ఇప్పుడు తాజాగా ... ఎవరెస్ట్, ఎండిహెచ్ మసాలా దినుసుల దిగుమతులపై నిషేధం విధించినట్లు నేపాల్ ఫుడ్ టెక్నాలజీ విభాగం ప్రతినిధి మోహన్ కృష్ణ మహారాజన్ ప్రకటించారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..
స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

ప్లాన్ బి అవసరం లేదు

- మెజారిటీ మార్కును బిజెపి దాటుతుంది : అమిత్ షా

న్యూఢిల్లీ : లోక్‌సభలో బిజెపి సగం మార్కును దాటలేదన్న మీడియా ప్రశ్నకు కేంద్ర హెూంమంత్రి అమిత్ షా సమాధానమిస్తూ.. అలా జరిగే అవకాశం తనకు కనిపించడం లేదన్నారు. బిజెపికి ప్లాన్-బీ అవసరం లేదని చెప్పారు. లోక్‌సభ ఎన్నికల్లో 272 కంటే తక్కువ సీట్లు గెలిస్తే బిజెపి ప్లాన్ ఏమిటని అడిగిన ప్రశ్నకు అమిత్ షా ఇలా అన్నారు. “నాకు అలాంటి అవకాశాలు కనిపించడం లేదు. 60 కోట్ల మంది లబ్ధిదారుల సైన్యం ప్రధాని మోడీకి అండగా నిలుస్తుంది. వారికి కులం, వయస్సు లేదు. మెజారిటీ మార్కును చేరుకోని పక్షంలో బిజెపి ప్లాన్-బి గురించి మీడియా అడిగినప్పుడు, పార్టీ ప్లాన్ ఎ విజయవంతమవుతుందని అమిత్ షా అన్నారు. ప్లాన్-ఏ (విజయవంతం కావడానికి) 60 శాతం కంటే తక్కువ అవకాశమున్నప్పుడే ప్లాన్-బి రూపొందించాలి. ప్రధాని మోడీ అఖండ మెజారిటీతో అధికారంలోకి వస్తారని నేను ఖచ్చితంగా అనుకుంటున్నాను” అని అమిత్ షా చెప్పారు.

వేతనాల కోసం రోడ్డెక్కిన ఉక్కు ఉద్యోగులు

స్టీల్‌ప్లాంట్ ఇడి కార్యాలయం వద్ద ధర్నా

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

బకాయి వేతనాల కోసం స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు రోడ్డెక్కారు. మూడు నెలల బకాయిలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేస్తూ స్టీల్‌ప్లాంట్ ఇడి (వర్క్స్) కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నాకు దిగారు. స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయిూస్ యూనియన్ (సిఐటియు), మిత్రపక్ష యూనియన్ల ఆధ్వర్యాన నిర్వహించిన ఈ ధర్నా చేశారు. అనంతరం స్టీల్ ఇడి (వర్క్స్) అధికారి సోబ్తికి వినతిపత్రం అందజేశారు. ధర్నాలో స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయిూస్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు జె.అయోధ్యరామ్ మాట్లాడుతూ.. ఉద్యోగులకు ప్రతి నెలా ఏడవ తేదీలోపు వేతనాలు చెల్లించాలని చట్టం చెబుతుండగా, స్టీల్ యాజమాన్యం అందుకు విరుద్ధంగా గడిచిన మూడు మాసాలుగా సకాలంలో వేతనాలు చెల్లించకుండా ఇబ్బందులకు గురిచేస్తోందని తెలిపారు. కావాలనే యాజమాన్యం కుంటి సాకులు చెబుతోందన్నారు. వేతనాల విషయమై స్టీల్ సిఎండి అతుల్‌భట్ ఇచ్చిన ఏ మాటనూ నిలబెట్టుకోలేదని తెలిపారు. తక్షణమే వేతనాలు చెల్లించకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు. సంఘం ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి మాట్లాడుతూ.. యాజమాన్యం వైఖరిని అడ్డుకోవాల్సిన గుర్తింపు యూనియన్ తన బాధ్యతను మరిచి వ్యవహరిస్తోందని విమర్శించారు. తన అసమర్ధతను అన్ని సంఘాలపై నెడుతోందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వానికి బాహాటంగా మద్దతునిచ్చిన ఐఎన్‌టియుసి నోరుమెదపడం లేదన్నారు. ఈ పరిస్థితిని అధిగమించే క్రమంలో భవిష్యత్తులో ఆందోళనలను తీవ్రతరం చేయడానికి కార్మికులు సిద్ధం కావాలని కోరారు. సంఘం అధ్యక్షులు వైటి.దాస్ మాట్లాడుతూ.. ఉక్కు భూములు రాష్ట్రపతి పేరుతో ఉన్నాయని, వాటిని కర్మాగారం పేరున మార్చితే, దీని విలువ పెరుగుతుందని, తద్వారా బ్యాంకులు రుణాలు ఇవ్వడానికి ముందుకు వస్తాయని వివరించారు. సెయిల్‌లో విలీనం చేయడం ద్వారానూ ప్లాంట్‌ను రక్షించుకోవచ్చాన్నారు. ఈ కార్యక్రమంలో స్టీల్ సిఐటియు, దాని మిత్రపక్షాల నాయకులు డివి.రమణారెడ్డి, డి.సురేష్ బాబు, సిహెచ్.సన్యాసిరావు, బి.అప్పారావు, గంగాధర్, నీలకంఠం, మరిడయ్య, పుల్లారావు, టివికె.రాజు, బి.మహేష్, వి.మురళి, రాజు పాల్గొన్నారు.



స్టీల్ ఇడి (వర్క్స్) కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఉక్కు ఉద్యోగులు

హింసాత్మక ఘటనలపై ఇసి ఆదేశాలను పాటించాలి

- డిజిపికి టిడిపి లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఎన్నికల అనంతరం చోటుచేసుకున్న హింసాత్మక ఘటనలపై ప్రత్యేక దర్యాప్తు బృందాలు ఏర్పాటుచేసి చర్యలు తీసుకోవాలన్న కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాలను పాటించాలని టిడిపి కోరింది. ఈ మేరకు డిజిపి హరీష్ కుమార్ గుప్తాకు టిడిపి ప్రధాన కార్యదర్శి వర్ల రామయ్య శుక్రవారం లేఖ రాశారు. హింసకు పాల్పడిన వారిపై ఐపిసి, ఇతర చట్టబద్ధమైన కేసులతో ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కోరారు. కొందరు అధికారులు ఎన్నికల సంఘం ఆదేశాలను పాటించడం లేదన్నారు. ఈ లేఖను డిజిపితోపాటు కేంద్ర ఎన్నికల సంఘానికి, రాష్ట్ర ఎన్నికల ఇన్‌ఛార్జి అవినాష్, పరిశీలకులు, జిల్లా ఎన్నికల అధికారులు, రిటర్నింగ్ అధికారులకు పంపారు.

స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద భద్రతా ప్రమాణాలు పాటించాలి : దేవినేని

స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించేలా రిటర్నింగ్ అధికారులకు దిశానిర్దేశం చేయాలని కోరుతూ రాష్ట్ర ఎన్నికల సంఘానికి మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు లేఖ రాశారు. ఎన్నికల కమిషన్ సూచించిన నియమాలను ఉల్లంఘించారని, భద్రతకు సంబంధించి తమ ఫిర్యాదులను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. కౌంటింగ్ రోజు ప్రజలు, కార్యకర్తల ఆస్తులను కాపాడేందుకు రాజకీయ హింసను అదుపులో పెట్టాలని విజ్ఞప్తి చేశారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్, సుప్రీంకోర్టు ఆదేశాలను లెక్క చేయకుండా రాష్ట్రంలో అక్రమంగా ఇసుక తవ్వకాలు సాగిస్తున్నారని మాజీ మంత్రి నక్కా ఆనంద్‌బాబు ఆరోపించారు.

అఖిలప్రియ అనుచరుడిపై హత్యాయత్నం కేసులో నిందితుల అరెస్టు

రాజకీయ ప్రేరేపిత చర్యలేదు : డిఎస్‌పి

ప్రజాశక్తి-ఆళ్లగడ్డ

నంద్యాల జిల్లాలో సంచలనం సృష్టించిన మాజీ మంత్రి భూమా అఖిలప్రియ అనుచరుడు నిఖిల్‌పై హత్యాయత్నం కేసుకు సంబంధించి ఇద్దరు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను శుక్రవారం సాయంత్రం ఆళ్లగడ్డ పట్టణ పోలీస్ స్టేషన్‌లో డిఎస్‌పి షర్ఫుద్దీన్ విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. ఈ నెల 14న రాత్రి 12 గంటల సమయంలో అఖిలప్రియ నివాసం ఇంటి బయట నిఖిల్ అలియాస్ పెద్ద సుబ్బరాయుడు ఉండగా దుండగులు మారుతి కారులో వచ్చి నిఖిల్‌ను చంపాలన్న ఉద్దేశంతో కారుతో ఢీకొట్టారు. కింద పడ్డ నిఖిల్‌పై ముగ్గురు వ్యక్తులు కత్తులతో దాడి చేశారు. దుండగుల నుంచి నిఖిల్ తప్పించుకున్నారు. అఖిలప్రియ అనుచరుడు చాకలి మనోజ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పివిఎస్ఆర్ గోడౌన్ సమీపంలో పట్టణానికి చెందిన నిందితులు నూలి అశోక్, రవిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పరారీలో ఉన్న మిగిలిన నిందితులు నంద్యాలకు చెందిన మరాటి చిందే చంద్రకుమార్, అట్ల వెంకట సుబ్బారెడ్డి, మాలిక్ భాష, రుద్రవరం మండలం చిత్రేణిపల్లెకు చెందిన తప్పెట నరసింహ, చంటిని త్వరలో పట్టుకుంటామని డిఎస్‌పి తెలిపారు. 2023 మే 16న జరిగిన నారా లోకేష్ యువగళం పాదయాత్రలో ఎవి సుబ్బారెడ్డిపై నిఖిల్ దాడి చేశారని, ఈ విషయంలో కక్ష పెంచుకొని ఎవి.సుబ్బారెడ్డి ప్రోద్బలంతో నిఖిల్‌ను చంపడానికి నిందితులు ప్రయత్నించారని తెలిపారు. ఇది ఎలాంటి రాజకీయ ప్రేరేపిత చర్యల వల్ల జరగలేదని స్పష్టం చేశారు.



నిందితులను విలేకరుల ఎదుట ప్రవేశపెట్టిన డిఎస్‌పి

వేట లేక..కుటుంబం గడవక

- నెల దాటినా అందని పరిహారం
- కుటుంబ పోషణ కోసం వలసబాట
- మత్స్యకారుల అవస్థలు పట్టని ప్రభుత్వం

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

వేటసాగక.. పూట గడవక ఆకలితో మత్స్యకారులు అలమటిస్తున్నారు. వేట నిషేధ సమయంలో ప్రతి ఏటా ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటూనే ఉన్నారు. నెల రోజులు దాటినా పరిహారం అందడం లేదు. వేటను నమ్ముకుని జీవనం సాగిస్తున్న మత్స్యకారులు కుటుంబపోషణ కోసం కొందరు వలసబాట పట్టగా మరికొందరు అప్పులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఎమ్యూనరేషన్ విషయంలో అధికారులు తీవ్ర నిర్లక్ష్యం వహించడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ప్రతి సంవత్సరం ఏప్రిల్ 14 అర్ధరాత్రి నుంచి జూన్ 14 అర్ధరాత్రి వరకూ 60 రోజుల పాటు సముద్రంలో చేపలవేటపై నిషేధం అమల్లో ఉంటుంది. కాకినాడ, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాల్లో తొండంగి, యు.కొత్తపల్లి, కాకినాడ రూరల్, కాకినాడ అర్బన్, తాళ్లరేవు, ఐ.పోలవరం, ఉప్పలగుప్తం, కాట్రేనికోన, అల్లవరం, సఖినేటిపల్లి తదితర 13 మండలాల్లో 144 కిలోమీటర్ల మేర సముద్ర తీర ప్రాంతం విస్తరించి ఉంది. కోస్తా తీర ప్రాంతం వెంబడి 3.55 లక్షల మంది నివసిస్తుండగా చేపల వేటపై సుమారు 70 వేల కుటుంబాలు ఆధారపడి ఉన్నాయి. 600 మెకనైజ్డ్, మూడువేలకు పైబడి మోటరైజ్డ్ బోట్లపై చేపలవేటను సాగిస్తున్నారు. వేట నిషేధ సమయంలో ఒక్కో మత్స్యకార కుటుంబానికి రూ. పదివేల చొప్పున ప్రభుత్వం నష్టపరిహారం అందజేస్తుంది. ఈ ఏడాది 25 వేల కుటుంబాలకు పరిహారం అందించనున్నట్టు అధికారులు తెలిపారు.

వేట నిషేధ సమయంలో ఇవ్వాల్సిన పరిహారం విషయంలో సర్కారు నిర్లక్ష్యంగా వ్యవహరించడం పట్ల పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది పరిహారం ఎప్పటికి ఇస్తారో అధికారులే చెప్పలేకపోతున్నారు. పదేళ్లుగా నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. పెట్రోల్, డీజిల్ ఆయిల్, పప్పులు, బియ్యం ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో రూ.నాలుగు వేలు పరిహారం ఇవ్వగా ప్రస్తుత ప్రభుత్వం దానిని రూ. రూ.పది వేలకు పెంచింది. అయితే నిబంధనలు కఠినతరం చేయడంతో లబ్ధిదారుల సంఖ్య తగ్గిపోయింది. పెరిగిన ధరలతో పోల్చితే ఈ పరిహారంతో రెండు నెలలు గడపడం అసాధ్యమని లబ్ధిదారులు వాపోతున్నారు. ఆర్థిక ఇబ్బందులు తాళలేక కొంతమంది మత్స్యకారులు వలస బాట పడుతున్నారు. మరికొందరు రోజువారీ కూలి పనులకు వెళ్తున్నారు. కుటుంబపోషణ కోసం మరికొందరు అప్పులు చేస్తున్నారు.



ఉప్పాడ తీరంలో నిలిచిన బోట్లు

ఇబ్బందులు తట్టుకోలేకపోతున్నాం



చేపల వేటతోనే కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. నెల రోజులుగా వేట సాగక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాం. వేరే పని తెలియదు. ప్రభుత్వం ఇచ్చే పరిహారం విషయంలో నిర్లక్షాన్ని వీడి సక్రమంగా పంపిణీ చేయాలి. నేటికీ పరిహారం అందకపోవడంతో అప్పులు చేశాం.

- బెనుక ప్రసాద్, మత్స్యకారుడు, కోనపాపపేట ,యు.కొత్తపల్లి మండలం

వెంటనే పరిహారం అందించాలి



వేట నిషేధ సమయంలో ఆర్థిక ఇబ్బందులు ఎక్కువ అవుతున్నాయి. అప్పులు కూడా పుట్టే పరిస్థితి లేదు. వేరే పని మాకు చేత కాదు. నెల రోజులు దాటుతున్నా ఇంకా పరిహారం అందలేదు. ఎప్పటికి అందుతుందో తెలియదని అధికారులు అంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే పరిహారం అందించాలి.

- చోడిపల్లి ఏసు,మత్స్యకారుడు, ఉప్పాడ, యు.కొత్తపల్లి మండలం

త్వరలోనే పరిహారం జమ

ఈ ఏడాది సుమారు 25 వేల మందికి పరిహారం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాము. ఎన్నికల కోడ్ కారణంగా ఎమ్యూనరేషన్‌లో కొంత ఆలస్యం అయ్యింది. ఈనెలాఖరు నాటికి మత్స్యకారుల ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయి. గతేడాది మే ఐదున జమ చేశాం.

- కె.కరుణాకరరావు, జిల్లా మత్స్యశాఖ అధికారి, కాకినాడ



సంస్మరణ సభలో మాట్లాడుతున్న తులసీదాస్

పోరాట స్ఫూర్తికి ప్రతీక శ్రీరాములు

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు తులసీదాస్

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు (శ్రీకాకుళం జిల్లా)

నమ్మిన సిద్ధాంతాల కోసం సిపిఎం సీనియర్ నాయకులు బమ్మిడి శ్రీరాములు చివరి వరకు నిలిచారని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి తులసీదాస్ అన్నారు. శ్రీకాకుళం జిల్లా వజ్రపుకొత్తూరు మండలం నగరంపల్లిలో శ్రీరాములు సంస్మరణ సభ శుక్రవారం జరిగింది. శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తులసీదాస్ మాట్లాడుతూ శ్రీరాములు మృతి కమ్యూనిస్టు ఉద్యమానికి తీరనిలోటన్నారు. నిర్బంధాలను సైతం లెక్క చేయకుండా తన జీవితాన్ని ప్రజలకు అంకితం చేసిన నాయకుడని కొనియాడారు. నగరంపల్లి కేంద్రంగా పలాస ప్రాంతంలో ప్రజాసంఘాలను ఏర్పాటు చేసి, ప్రజాతంత్ర ఉద్యమాన్ని బలోపేతం చేశారని గుర్తు చేశారు. 1968 నుంచి 1975 వరకు అజ్ఞాతంలో ఉన్నారని, 1975లో పార్వతీపురం కుట్ర కేసులు మోపడంతో అరెస్టయి రెండేళ్లపాటు జైల్లో ఉన్నారని తెలిపారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులుగా, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఉపాధ్యక్షునిగా సుదీర్ఘ కాలం ప్రజా ఉద్యమాల్లో పనిచేశారని వివరించారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు మాట్లాడుతూ శ్రీరాములు చూపిన బాటలో పయనించి ప్రజా సమస్యలపై సమరశీల పోరాటాలు చేయడమే ఆయనకు అర్పించే నిజమైన నివాళని అన్నారు. సిపిఎం మండల కమిటీ కన్వీనర్ నెయ్యిల మోహనరావు అధ్యక్షతన జరిగిన ఈ సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి డి గోవిందరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భవిరి కృష్ణమూర్తి, రైతు సంఘం నాయకులు కె మోహనరావు, శ్రీరాములు కుటుంబసభ్యులు బమ్మిడి ఆనందరావు, అరుణ్ కుమార్, రామకృష్ణ, పలు ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఆర్‌టిసి ఉద్యోగ సంఘాల నాయకుల అక్రమ సస్పెన్షన్‌ను రద్దు చేయండి

- సిఐటియు, ఎఐఆర్‌టిడబ్ల్యుఎఫ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉద్యోగ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యాన ఏలూరులో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొన్నారనే కారణంతో ఎపిఎస్ఆర్‌టిసి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ సుందరరావు, బహుజన వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్యామ్‌సన్, ఎన్ఎంయు తణుకు డిపో కార్యదర్శి సుబ్బారావుపై విధించిన అక్రమ సస్పెన్షన్‌ను తక్షణం ఎత్తివేయాలని సిఐటియు, ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ డిమాండ్ చేశాయి. ఈ మేరకు సిఐటియు రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎవి నాగేశ్వరరావు, సిహెచ్ నర్సింగరావు, ఎఐఆర్‌టిడబ్ల్యుఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్ లక్ష్మయ్య శుక్రవారం వేర్వేరుగా ప్రకటనలు విడుదల చేశారు. ఈ నెల 4న ఉద్యోగ సంఘాల ఐక్యవేదిక నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నందుకు చర్యలు తీసుకోవడం సరైందికాదని వినతిలో పేర్కొన్నారు. మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ పరిధిలోకి రాకున్నా, ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఫిర్యాదు లేకున్నా, కక్షపూరితంగా చర్యలు తీసుకున్నారని పేర్కొన్నారు. తక్షణం సిహెచ్ సుందరరావుపై వున్న సస్పెన్షన్‌ను తొలగించాలని వారు డిమాండ్ చేశారు. ఆర్‌టిసి ఉద్యోగులపై యాజమాన్యం పెద్దయెత్తున కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందన్నారు. ఇటీవల కాలంలో 146 మందిని ఇలా అక్రమంగా సస్పెండ్ చేయడంతోపాటు మరో 26 మందికి ఇంక్రిమెంట్లను నిలిపేసిందన్నారు. ఈ మేరకు ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ సుందరరావు సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని ఆర్‌టిసి ఎమ్‌డి ద్వారకా తిరుమలరావుకు ఎఐఆర్‌టిడబ్ల్యుఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్ లక్ష్మయ్య లేఖ రాశారు.

వైద్యులపై క్రమశిక్షణా చర్యలు

- ప్రజారోగ్య కుటుంబ సంక్షేమశాఖ డైరెక్టరు పద్మావతి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వ వైద్యులు ఐదేళ్లపాటు ప్రభుత్వాస్పత్రుల్లో సేవలు అందించాల్సి ఉండగా, కొంతమంది ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులను ఉల్లంఘించారని ప్రజారోగ్య కుటుంబ సంక్షేమశాఖ డైరెక్టరు పద్మావతి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇన్‌సర్వీస్ వైద్యులు పిజి కోర్సుల్లో చేరే సమయంలో ప్రభుత్వంతో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం ఐదేళ్లపాటు ప్రభుత్వానికి సేవలందించాల్సి ఉందని వివరించారు. ఈ షరతులను అమలు చేయడంలో విఫలమైతే రూ.20 లక్షలతోపాటు ప్రభుత్వం చెల్లించిన జీతభత్యాలను తిరిగి చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.

ఈ నిబంధనలను ఉల్లంఘించిన వైద్యులకు పలుమార్లు నోటీసులు జారీ చేసినప్పటికీ వారి నుంచి ఎటువంటి స్పందనా లేదని పేర్కొన్నారు. నోటీసులందుకున్న సివిల్ అసిస్టెంట్ సర్జన్లు జూన్ 15వ తేదీలోపు స్పందించకపోతే చట్టపరమైన, శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. షోకాజ్ నోటీసులు జారీ చేసిన వారి వివరాలను dme.ap.nic.in, cfw.ap.nic.in, hmfw.ap.gov.in వెబ్‌సైట్లలో పొందుపరిచామని వివరించారు.

ఆరోగ్యకరమైన అలవాట్లతో హైపవర్ టెన్షన్‌కు చెక్ : ఎమ్‌టి కృష్ణబాబు

ఆరోగ్యకరమైన అలవాట్లపై ప్రజల్లో అవగాహన పెంపొందించి, వారిలో హైపవర్ టెన్షన్ (రక్తపోటు) నివారణకు కృషి చేస్తామని వైద్యారోగ్య సంక్షేమశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎమ్‌టి కృష్ణబాబు ఆ శాఖ అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. మంగళగిరిలోని వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో శుక్రవారం ఈ కార్యక్రమం జరిగింది.

పండ్లు, కూరగాయలు, ముడిధాన్యాలు, ఉప్పు తక్కువగా ఉండే ఆహార పదార్థాల వినియోగంతోపాటు క్రమం తప్పని శారీరక వ్యాయామాలు కొనసాగించేలా అవగాహన కల్పించాలని తెలిపారు. అసాంక్రమిక వ్యాధులపై రూపొందించిన ఫ్లిప్‌చార్టులను అనంతరం ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ ఎస్ వెంకటేశ్వర్, డిఎంఇ నరసింహం, డిహెచ్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

షుగర్ మందుల ధరలు తగ్గింపు

- కేంద్రం కీలక నిర్ణయం

న్యూఢిల్లీ : లోక్‌సభ ఎన్నికల సమయంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సాధారణంగా వినియోగించే 41 ఔషధాలతోపాటు మధుమేహం, హృద్రోగ, కాలేయ వ్యాధుల చికిత్సలో వినియోగించే ఆరు మందుల ధరలను తగ్గించింది. ఈమేరకు డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్స్, నేషనల్ ఫార్మాస్యూటికల్ ప్రైసింగ్ అథారిటీ (ఎన్‌పిపిఎ) నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నోటిఫికేషన్ ప్రకారం.. యాంటాసిడ్‌లు, మల్టీవిటమిన్‌లు, యాంటీబయాటిక్ ఔషధాల ధరలు భారీగా తగ్గనున్నాయి. ప్రపంచంలో అత్యధిక మధుమేహవ్యాధిగ్రస్తులు ఉన్న దేశాలలో భారత్ కూడా ఒకటి. ప్రస్తుతం భారత్‌లో 10 కోట్ల మందికి పైగా షుగర్ పేషెంట్లు ఉన్నట్లు అంచనా. కాగా, వివిధ ఔషధాల ధరల తగ్గింపునకు సంబంధించిన సమాచారాన్ని డీలర్లు, స్టాకిస్టులకు తక్షణమే తెలియజేయాలని ఫార్మా కంపెనీలను ఎన్‌పిపిఎ ఆదేశించింది. నిత్యావసర ఔషధాల ధరలు ప్రజలకు అందుబాటులో ఉండేలా చూసేందుకు ఎన్‌పిపిఎ 143వ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు.

ఇసి వివరణ కోరిన సుప్రీం

మొదటిపేజీ తరువాయి

చేయాలని, ఈమేరకు ఇసి ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ ఎడిఆర్ సుప్రీంలో పిటిషన్ దాఖలు చేసింది. ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో మొదటి దశ పోలింగ్ ఏప్రిల్ 19న ముగిసినా, పోలైన ఓట్ల సంఖ్యను 11 రోజుల తరవాత ఏప్రిల్ 30న ప్రచురించారు. ఏప్రిల్ 26న జరిగిన రెండో దశ పోలింగ్ శాతాన్ని నాలుగు రోజుల తరవాత అందుబాటులో ఉంచారు.

పోలింగ్ రోజున ఎన్నికల సంఘం వెల్లడించిన ఓటింగ్ శాతం కన్నా అయిదారు శాతం ఎక్కువగా ఏప్రిల్ 30న గణాంకాలు కనిపించాయి. దీనిపై అనుమానాలు తలెత్తుతున్నాయని ఎడిఆర్ తమ పిటిషన్‌లో పేర్కొంది. పోలింగ్ శాతం ప్రకటించడంలో జాప్యాన్ని కాంగ్రెస్, సిపిఎం వంటి పార్టీలు కూడా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ఎన్నికల ప్రధాన కమిషనర్‌కు ఇప్పటికే ఈ విషయంపై లేఖలు కూడా రాసాయి.

మోడీ పర్యటనకు ముందు అదుపులోకి ఉల్లి రైతులు

- నిరసనలకు సిద్ధమవుతున్న తరుణంలో నిర్బంధంలోకి
- తమ కోసం ఎవరూ మాట్లాడలేదని అన్నదాతల ఆందోళన

ముంబయి : ఉల్లి ఎగుమతి ధరలపై కేంద్రంలోని మోడీ ప్రభుత్వం తీసుకున్న నాసిరకం నిర్ణయాలకు వ్యతిరేకంగా నిరసన చేపట్టాలని భావించిన 50 మంది రైతులు, ప్రతిపక్ష నాయకులను నాసిక్‌లో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇటీవల ప్రధాని మోడీ నాసిక్ పర్యటనకు ముందు ఈ ఘటన జరగడం గమనార్హం. “గతేడాది ఆగస్టు 19న, కేంద్రం ఉల్లిపాయల ఎగుమతిపై 40 శాతం సుంకాన్ని విధించింది. అదే ఏడాది అక్టోబర్ 28న ఎగుమతిదారు ప్రతి టన్ను ఉల్లిపాయకు ప్రభుత్వానికి రూ.66,647 చెల్లించాలని బదులుగా కొత్త నిర్ణయం తీసుకున్నది. ఆ తర్వాత డిసెంబర్ 7న డైరక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్(డిజిఎఫ్‌టి) ఉల్లి ఎగుమతి విధానాన్ని మార్చి 31, 2024 వరకు నిషేధం లేకుండా చేసేందుకు సవరిస్తున్నట్టు ప్రకటించింది” అని మహారాష్ట్ర రాజ్య కాండ ఉత్పాదక్ షెత్కారీ సంఘటనా (మహారాష్ట్ర రాష్ట్ర ఉల్లి ఉత్పత్తిదారుల సంఘం) వ్యవస్థాపకుడు భరత్ డిఘోలే తెలిపారు.

“అయితే, మార్చి నాటికి ఎన్నికల ప్రవర్తనా నియమావళి(ఎంసిసి) అమల్లోకి వచ్చింది. తదుపరి నోటీసు వచ్చే వరకు ఎగుమతి నిషేధం కొనసాగుతుందని డిజిఎఫ్‌టి మరో ప్రకటన విడుదల చేసింది. మే 4న ఎంపిక చేయబడిన నిబంధనలు, షరతులపై నిషేధం ఎత్తివేయబడింది. ఎగుమతిదారు ఇప్పుడు మెట్రిక్ టన్నుకు రూ.45,820 ప్రభుత్వానికి చెల్లించాలి” అని ఆయన చెప్పారు.

‘మా కోసం ఎవరూ మాట్లాడలేదు’

రాష్ట్రం 50కి పైగా దేశాలకు ఉల్లిని సరఫరా చేస్తుందని చెప్పిన డిఘోలే.. మహా వికాస్ అఘాడి తమకు మద్దతు ఇవ్వాలనుకుంటే వారు కేంద్రంతో తమ ఆందోళనను ఉధృతం చేయగలరనీ కానీ అది ఎప్పుడూ జరగలేదన్నారు.

“ఎన్సీపీ నాయకుడు శరద్ పవార్‌కు నిజంగా రైతుల పట్ల శ్రద్ధ ఉంటే మా సమస్యలను వాణిజ్య మంత్రి లేదా హెూం మంత్రి వద్దకు సులభంగా తీసుకెళ్లవచ్చు. ఈ విషయం మీడియా పెద్దగా పట్టించుకోలేదు. అంతేకాకుండా, ప్రధాని మోడీ నుంచి శరద్ పవార్, ఉద్ధవ్ ఠాక్రే వరకు ఇక్కడ ఉన్నారు, కానీ ఎవరూ మా కోసం మాట్లాడలేదు” అని ఆవేదన వ్యక్తం చేశారు.





ఇఎపిసెట్‌కు రెండో రోజు 91.62 శాతం హాజరు

- నేటి నుంచి ఎంపిసి విభాగం పరీక్ష

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ ఉమ్మడి ప్రవేశ పరీక్ష (ఇఎపిసెట్)-2024 రెండో రోజు పరీక్షకు 91.62 శాతం విద్యార్థులు శుక్రవారం పరీక్షకు హాజరయ్యారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు జరిగిన పరీక్షకు 22,221 మంది హాజరు కావాల్సి ఉండగా, 20,226 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం 2:30 నుంచి 5:30 గంటల వరకు జరిగిన పరీక్షకు 22,400 మందికి 20,654 మంది హాజరయ్యారు.

మొత్తంగా 44,621 మంది పరీక్షకు దరఖాస్తు చేసుకోగా, వీరిలో 40,880 మంది హాజరయ్యారు. శనివారం నుంచి ఎంపిసి విభాగం పరీక్ష జరగనుంది. 23వ తేదీ వరకు ఈ పరీక్ష ఉంటుంది. రానున్న 4-5 రోజుల్లో భారీ వర్షాలు ఉంటాయని వాతావరణశాఖ వెల్లడించిందని, అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు ముందుగానే చేరుకోవాలని ఉన్నత విద్యామండలి కార్యదర్శి నజీర్ అహ్మద్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పరీక్ష కేంద్రానికి ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించబోమన్నారు.

చంద్రబాబు సిఎం కావాలని కోరుకున్నా

- కూటమికి 125-150 సీట్లు : రఘురామకృష్ణంరాజు

ప్రజాశక్తి - తిరుమల

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు రావాలని కోరుకున్నానని, కూటమికి 125-150 సీట్లు తప్పకుండా వస్తాయని ఎంపి రఘురామకృష్ణంరాజు వ్యాఖ్యానించారు. గురువారం చంద్రగిరి టిడిపి అభ్యర్థి పులివర్తి నానిని పరామర్శించిన ఆయన, శుక్రవారం తెల్లవారుజామున శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయం వెలుపల రఘురామకృష్ణం రాజు మీడియాతో మాట్లాడుతూ వైసిపి 25-40 సీట్లకే పరిమితమవుతుందన్నారు. తన మాట నిజం అవుతుందో, జగన్ మాట నిజమవుతుందో జూన్ 4న తెలుస్తుందన్నారు.

ఒఎన్‌జిసి పైపులైన్ పనుల అడ్డగింత

- రైతులు, గ్రామస్తులను కలెక్టరేట్‌కు తరలించిన పోలీసులు
- కలెక్టర్ ఆదేశాలతో నిలిచిన పనులు

ప్రజాశక్తి - నరసాపురం (పశ్చిమగోదావరి)

తమ పంట పొలాలకు వెళ్లే మార్గంలో గ్యాస్ పైపులైన్ వేయొద్దంటూ ఆయా పనులను పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం మండలంలోని రైతులు, గ్రామస్తులు శుక్రవారం అడ్డుకున్నారు. పోలీసులు బలవంతంగా వారిని అదుపులోకి తీసుకుని భీమవరంలోని జిల్లా కలెక్టరేట్‌కు తరలించారు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. నరసాపురంలోని రుస్తుంబాదలో టెంపుల్‌ల్యాండ్ నెంబర్. 4వ గేటుకు సీతారామపురంలోని రిగ్ నుంచి యర్రంశెట్టివారి పాలెం మీదుగా సుమారు రెండు కిలోమీటర్ల మేర ఒఎన్‌జిసి పైపులైన్ నిర్మాణం అధికారులు చేపట్టారు. రుస్తుంబాద-యర్రంశెట్టివారిపాలెం మధ్య పొలాల్లోంచి ఈ పైపులైన్ల ఏర్పాటుకు రైతులు వ్యతిరేకించారు. ఇదిలా ఉండగా శుక్రవారం ఉదయం ఒఎన్‌జిసి అధికారులు పోలీసు బందోబస్తు నడుమ పొలాల్లోంచి కాకుండా రైతులు రాకపోకలు సాగించే ప్రభుత్వ పుంత భూముల్లోంచి పైపులైన్ ఏర్పాటు పనులు ప్రారంభించారు. దీంతో రైతులు ఆందోళనకు దిగారు. నరసాపురం డిఎస్‌పి శ్రీనివాసులు ఆధ్వర్యాన పోలీసులు బలవంతంగా వారిని అదుపులోకి తీసుకుని భీమవరంలోని కలెక్టరేట్‌కు తరలించారు. కలెక్టర్ సుమిత్ కుమార్‌కు తమ ఇబ్బందులు, ఆందోళనను రైతులు వివరించారు. కలెక్టర్ స్పందించి రైతుల సందేహాలను నివృత్తి చేసేవరకూ పైపులైన్ పనులు ఆపాలని అక్కడికక్కడే ఆదేశించడంతో ఒఎన్‌జిసి సిబ్బంది పనులు నిలిపివేసి వెనుదిరిగారు. అనంతరం గ్రామానికి రైతులు చేరుకోవడంతో గ్రామస్తులు శాంతించారు. ఈ నేపథ్యంలో రైతులు యర్రంశెట్టి హరి తదితరులు మాట్లాడుతూ ఈ పైప్‌లైన్ వల్ల భవిష్యత్తులో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయన్నారు. గతంలో పైప్‌లైన్ వేస్తామని పనులు ప్రారంభించినప్పుడు ఆందోళనతో మారుబోయిన సత్యనారాయణ మృతి చెందాడని గుర్తు చేశారు. ప్రభుత్వ భూమి కాబట్టి ఎటువంటి నష్టపరిహారమూ ఇవ్వబోమని ఒఎన్‌జిసి అధికారులు చెప్పారని తెలిపారు. గతంలో రైతులకు నష్టపరిహారం ఇస్తామని వారే చెప్పి ఇప్పుడు ఇలా పనులు ప్రారంభించారని ఆందోళన వ్యక్తం చేశారు. తమను బలవంతంగా కలెక్టరేట్‌కు తీసుకెళ్లిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



రైతులను బస్సులో ఎక్కిస్తున్న పోలీసులు

గందరగోళంలో ఆర్థికశాఖ

- వాస్తవ పరిస్థితిపై గవర్నర్‌కు నివేదిక

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

ఇటీవల చోటు చేసుకున్న పరిణామాలతో ఆర్థికశాఖ గందరగోళంలో చిక్కుకుంది. అన్ని వైపుల నుండి వస్తున్న విమర్శలతో ఏమిచేయాలో పాలుపోని పరిస్థితుల్లో ఆ శాఖ అధికారులు చిక్కుకున్నారు. మరోవైపు ఆర్థిక పరిస్థితికి సంబంధించి పలు అంశాలపై రాష్ట్ర గవర్నర్ కూడా ఆరా తీసినట్లు సమాచారం. దీంతో ఆర్థిక స్థితిపై గవర్నర్‌కు రాష్ట్ర ప్రభుత్వం నివేదిక పంపినట్లు తెలిసింది. ఈ నివేదికలోని అంశాలు బయటకు రాకపోయినప్పటికీ ఉన్నతస్థాయి అధికారులు ఈ విషయాన్ని ధృవీకరిస్తున్నారు. పోలింగ్‌కు కొద్దిరోజుల ముందు డిబిటి పథకాలకు నగదు బదిలీ చేయాలన్న నిర్ణయం తీవ్రస్థాయిలో వివాదాస్పదమైన విషయం తెలిసిందే. దీనిపై హైకోర్టులో వ్యాజ్యాలు నడవగా, ఎన్నికల కమిషన్ కూడా జోక్యం చేసుకుంది. పోలింగ్ తరువాత నగదును పంపిణీ చేయాలన్న ఇసి ఆదేశించినప్పటికీ, ఇప్పటికీ పూర్తి స్థాయిలో ఆ ప్రక్రియ పూర్తి కాకపోవడం మరో వివాదంగా మారింది. మరోవైపు కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపు అంశం కూడా వివాదాస్పదంగా మారింది. డిబిటి చెల్లింపులు నిలిపివేసి, కాంట్రాక్టర్లకు బకాయిలు చెల్లిస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. దీనిపై కూడా రాష్ట్ర గవర్నర్‌కు ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో గవర్నర్ పలు అంశాలపై ప్రభుత్వాన్ని వివరణ కోరినట్లు సమాచారం. పెండింగ్ బిల్లులు ఎన్ని ఉన్నాయి, ఎంత మొత్తంలో చెల్లించాల్సి ఉంది, ఆ బకాయిలు ఎప్పటినుంచి ఉన్నాయి అన్న వివరాలు కోరినట్లు తెలిసింది. దీంతో పూర్తిస్థాయి నివేదికను ప్రభుత్వం గవర్నర్‌కు పంపినట్లు సమాచారం.

హింసాత్మక ఘటనలకు టిడిపియే కారణం

- పోలీస్ అబ్జర్వర్ దీపక్ మిశ్రాను తొలగించాలి
- సజ్జల రామకృష్ణారెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సిఎం జగన్ అమలు చేసిన సంక్షేమ పథకాలతో తమకు విజయం దక్కడం లేదనే అక్కసుతోనే టిడిపి ఎన్నికలకు ముందు, ఆ తర్వాత హింసాత్మక ఘటనలకు పాల్పడిందని వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి విమర్శించారు. ఈ ఎన్నికల్లో చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పంలోనూ తాము గెలవబోతున్నామని ధీమా వ్యక్తం చేశారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ల్యాండ్ టైట్లింగ్ యాక్టు మంచి చట్టమని అసెంబ్లీలో మద్దతు ఇచ్చిన టిడిపి ఆ తర్వాత ఎన్నికలకు ముందు దుష్ప్రచారానికి దిగడం వారి రెండు నాలుకల ధోరణికి నిదర్శనమని విమర్శించారు. చివరకు నీతి ఆయోగ్ ల్యాండ్ టైట్లింగ్ యాక్టుతో ఎలాంటి ప్రమాదం లేదని చెప్పిందని అన్నారు. గత ఎన్నికల్లో గెలిచిన సీట్ల కంటే ఈసారి ఎక్కువే గెలుస్తామన్నారు. చంద్రబాబు కుట్రపూరితంగా కేంద్రం సహాయంతో కొందరు అధికారులను తప్పించారని విమర్శించారు. అధికారులను తప్పించిన చోటే హింస జరుగుతోందన్నారు. కేంద్ర ఎన్నికల అబ్జర్వర్ దీపక్ మిశ్రా జోక్యం వల్లే హింస జరిగిందని, కౌంటింగ్ సజావుగా సాగేందుకు తక్షణం ఆయన్ను తొలగించాలని డిమాండ్ చేశారు. ఇ-ఆఫీస్‌ను అప్‌గ్రేడ్ చేస్తుంటే గవర్నరుకు చంద్రబాబు లేఖలు రాయడం ఏమిటని ప్రశ్నించారు.

ఏకపక్షంగా పనిచేసిన వారిపై చర్యలు తప్పవు : ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి

చంద్రబాబు, పురందేశ్వరి తమ రాజకీయ ప్రయోజనాల కోసం హింసను రెచ్చగొట్టడమే కాకుండా ఐపిఎస్, ఐఎఎస్ అధికారులను ఇబ్బందులు పెడుతున్నారని వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి విమర్శించారు. పోలింగ్‌కు ముందు ఎస్‌పిలుగా ఎవరుండాలి, ఎవరిని తప్పించాలో ఎన్నికల సంఘానికి పురందేశ్వరి లేఖ రాసిన ఫలితమే ఈ హింసకు కారణమని అన్నారు. ఏకపక్షంగా పనిచేసిన అధికారులపై కొత్త ప్రభుత్వంలో విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని అన్నారు. వైసిపి మరోసారి అధికారంలోకి రానుందని మాజీ మంత్రి రావెల కిశోర్‌బాబు అన్నారు.

కడప కోర్టు ఉత్తర్వులపై 'సుప్రీం' స్టే

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

షర్మిల వాక్ స్వాతంత్ర్యాన్ని, భావప్రకటన స్వేచ్ఛను హరించేలా కడప జిల్లా కోర్టు ఉత్తర్వులిచ్చిందని సుప్రీంకోర్టు పేర్కొంది. వివేకానందరెడ్డి హత్య కేసు గురించి ఎవరూ మాట్లాడొద్దన్న కడప కోర్టు ఉత్తర్వులపై స్టే ఇచ్చింది. షర్మిలతో పాటు ఇతరులపై దాఖలైన కోర్టు ధిక్కరణ కేసులపైనా సుప్రీంకోర్టు స్టే విధించింది. కడప కోర్టు ఉత్తర్వులను సవాల్ చేస్తూ ఎపిసిసి అధ్యక్షులు షర్మిల దాఖలు చేసిన పిటిషన్‌ను శుక్రవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బిఆర్ గవాయ్, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. కడప కోర్టు ఉత్తర్వులు గతంలో సుప్రీంకోర్టు జారీచేసిన తీర్పులకు విరుద్ధంగా ఉన్నాయని ధర్మాసనం పేర్కొంది. కనీసం ప్రతివాదులకు నోటీసులు కూడా ఇవ్వకుండా ఏకపక్షంగా కడప ప్రిన్సిపల్ జడ్జి ఉత్తర్వులివ్వడంపై అసహనం వ్యక్తం చేసింది. ఒక పార్టీ దాఖలు చేసిన పిటిషన్‌పై కడప ప్రిన్సిపల్ జడ్జి 'ఎక్స్‌పార్టీ' ఉత్తర్వులివ్వడం అభ్యంతరమని తెలిపింది. ప్రతివాదుల వాదన వినకుండా ఎక్స్‌పార్టీ ఉత్తర్వులివ్వడం తీవ్ర పరిణామమని వ్యాఖ్యానించింది. కడప జిల్లా ప్రిన్సిపల్ కోర్టు ఉత్తర్వులు ప్రతివాదుల భావ ప్రకటనా స్వేచ్ఛను కట్టడి చేసే విధంగా ఉన్నాయని, వారి స్వేచ్ఛకు విఘాతంగా ఉన్నాయని మధ్యంతర ఉత్తర్వుల్లో పేర్కొంది. ఏప్రిల్ 16న ఇచ్చిన ఉత్తర్వులు, అనంతరం ఇచ్చిన కోర్టు ధిక్కరణ ఉత్తర్వులపై ధర్మాసనం స్టే విధించింది. వివేకా హత్యను ఎన్నికల ప్రచారాస్త్రంగా షర్మిల, సునీత ఉపయోగిస్తున్నారని కడప ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టును వైసిపి ఆశ్రయించింది. వివేకా హత్య కేసుపై ఎవరూ మాట్లాడొద్దని ఒక రాజకీయ పార్టీ కోర్టులో పిటిషన్ దాఖలు చేయడం, దానికి అనుగుణంగా ఉత్తర్వులు ఇవ్వడం మిగిలిన పార్టీలు, నాయకుల స్వేచ్ఛను హరించడమే అని వాదనలు వినిపించిన షర్మిల తరపున సీనియర్ న్యాయవాది గౌరవ్ అగర్వాల్ పేర్కొన్నారు. ఎన్నికలు పూర్తయ్యాయి కదా... ఇప్పుడు విచారణ అవసరమా? అని తొలుత ధర్మాసనం ప్రశ్నించింది. ఎన్నికలు ముగిసిన తరువాత కూడా వివేకా హత్య కేసుపై మాట్లాడొద్దని ఆదేశాలు కొనసాగుతున్నాయని, ప్రచారంలో మాట్లాడారని కోర్టు ధిక్కరణ పిటిషన్‌లు దాఖలు చేస్తే... అందుకు నోటీసులు కూడా ఇచ్చారని ధర్మాసనం దృష్టికి షర్మిల న్యాయవాది తెచ్చారు. హైకోర్టు కనీసం తాము లేవనెత్తిన విషయాలు, చెప్పిన అంశాలను వినకుండానే పిటిషన్ కొట్టివేసిందని, ప్రస్తుతం కడప కోర్టు తదుపరి చర్యలకు సిద్ధమైందని తెలిపారు. షర్మిల న్యాయవాది వాదనల అనంతరం జస్టిస్ బిఆర్ గవాయ్, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన ధర్మాసనం మధ్యంతర ఉత్తర్వులిచ్చింది. కడప ప్రిన్సిపల్ కోర్టు ఏప్రిల్ 16, మే 8, ఇతర సంబంధిత అంశాలపై ఇచ్చిన ఆదేశాలపై స్టే విధిస్తూ... ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. ప్రతివాదుల్లో వైసిపి, టిడిపి అధినేత చంద్రబాబు, ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్, జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పురందేశ్వరి, పులివెందుల టిడిపి అభ్యర్థి బిటెక్ రవి, వైఎస్ వివేకా కుమార్తె సునీత నర్రెడ్డి, కె సురేష్‌బాబు ఉన్నారు.

మొదటి ఘాట్ రోడ్డు వద్ద రెండు ప్రమాదాలు

- స్వల్ప గాయాలతో బయట పడ్డ సందర్శకులు

ప్రజాశక్తి -తిరుమల

తిరుమల మొదటి ఘాట్ రోడ్డు మాల్వాడి గుండం వద్ద శుక్రవారం రెండు ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. ఈ ఘటనలో సందర్శకులకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మినీ వ్యాను బోల్తా పడింది. ఈ ప్రమాదంలో తమిళనాడుకు చెందిన సందర్శకులకు స్వల్ప గాయాలయ్యాయి. వారిని తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. రోడ్డుపై పడ్డ మినీ వ్యాన్ నుండి డీజిల్ లీక్ అయ్యింది. దీంతో అటుగా వస్తున్న టిటిడి వాటర్ ట్యాంకర్ జారి రోడ్డుకు అడ్డంగా నిలబడిపోయింది. దీంతో ఘాట్ రోడ్డులో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సమాచారం తెలిసిన అధికారులు రంగంలోకి దిగారు. అదే ప్రాంతంలో శుక్రవారం సాయంత్రమూ వెర్నా కారు అదుపుతప్పి డివైడర్ దాటి రాతి గుట్టపైకి చొచ్చుకుపోయింది. ఈ ప్రమాదంలోనూ సందర్శకులు స్వల్పంగా గాయపడ్డారు.

కొండెక్కిన గుడ్డు!



- రిటైల్ ధర రూ.7 • రైతుకు లభిస్తున్నది ధర రూ.5
- కొత్త బ్యాచ్‌లు వేయకపోవడంతో పెరిగిన డిమాండ్

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

గుడ్డు ధర కొండెక్కింది. ప్రస్తుతం రిటైల్ మార్కెట్లో రూ.7కు విక్రయం జరుగుతోంది. ప్రస్తుతం ధర పెరిగినప్పటికీ రైతుల నుంచి ఐదు రూపాయలకే మాత్రమే వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. రెండేళ్లుగా పౌల్ట్రీ పరిశ్రమ నష్టాల్లో ఉండడంతో రైతులు కొత్త బ్యాచ్‌లు వేయలేదు. దీంతో, ఉత్పత్తి తగ్గిపోయింది. డిమాండ్ పెరగడంతో ధర పెరిగిందని వ్యాపారులు చెబుతున్నారు. గతేడాది ఇదే సీజన్‌లో కోడిగుడ్డు ధర రూ.6 ఉండేది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వ్యవసాయం తర్వాత పెద్ద పరిశ్రమగా పౌల్ట్రీ ఉంది. సుమారు 300 పౌల్ట్రీలు ఉన్నాయి. దాదాపు 1.40 కోట్ల కోళ్ల పెంపకం జరుగుతుంది. రోజుకు 1.10 కోట్ల గుడ్లు ఉత్పత్తి అవుతున్నాయి. 40 శాతం మేర గుడ్లు స్థానిక మార్కెట్లలో వినియోగిస్తుండగా 60 శాతం గుడ్లు ఒడిశా, బీహార్ బెంగాల్ తదితర రాష్ట్రాలకు ఎగుమతి అవుతుంటాయి. కోళ్లకు వినియోగించే మేత, దాణా ఖర్చులు ఇటీవల కాలంలో గణనీయంగా పెరిగాయి. మొక్కజొన్న, సోయా దాణాను అధికంగా వాడుతుంటారు. మొక్కజొన్న దాణా టన్నుకు ఏడాదిలో రూ.18 వేల నుంచి రూ.25 వేలు, సోయా రూ.50 వేల నుంచి రూ.80 వేలకు పెరిగింది. గుడ్లు పెట్టే కోళ్లు ఆరు నెలల పెంపకం అనంతరం గుడ్లు పెట్టడం ప్రారంభిస్తాయి. ఆ తర్వాత ఆరు నెలల అనంతరం ఆ కోళ్లను విక్రయిస్తుంటారు.

ఏడాది అనంతరం కొత్త బ్యాచ్‌లు వేయడం పరిపాటి. నష్టాలు వస్తుండడంతో ఈ ఏడాది జనవరిలో కొత్త బ్యాచ్‌లు వేయకపోవటం, గతేడాది వేసిన బ్యాచ్‌లను మే నెలలో కోతకు తరలించడంతో గుడ్లు పెట్టే కోళ్ల కొరత నెలకొంది. నల్లజర్ల మండలంలో గతంలో సుమారు పది లక్షల కోళ్లు ఉండేవి. ప్రస్తుతం ఆరు లక్షలకు మించి లేవు. మిగిలిన ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి ఉంది. దీంతో, కోడిగుడ్ల ఉత్పత్తి ఒక్కసారిగా తగ్గడంతో ధరలు పెరిగాయి. కొత్త బ్యాచ్‌లు వేయకపోవడానికి నష్టాలే కారణమని రైతులు చెబుతున్నారు. 2019కి పూర్వం దాణా రేటు తక్కువగా ఉండడంతో ఖర్చు తగ్గి రైతులు లాభాలు పొందారు. గడిచిన నాలుగేళ్లలో దాణా, ఇతర ఖర్చులు రెండింతలు పెరగడంతో నష్టాలు చవిచూస్తున్నారు. మరోవైపు ఇక్కడి నుంచి గుడ్లు ఎగుమతులు జరిగే పశ్చిమ బెంగాల్, యుపి, కోల్‌కత్తా వంటి రాష్ట్రాల్లో అక్కడి ప్రభుత్వాలు పౌల్ట్రీ పరిశ్రమలను ప్రోత్సహిస్తున్నాయి. సబ్సిడీలు, రాయితీలు కల్పిస్తుండడంతో ఆయా ప్రాంతాల్లో ఉత్పత్తి పెరిగింది. దీంతో, కొన్నిసార్లు ఎగుమతులు తగ్గి స్థానిక మార్కెట్‌పైనే ఆధార పడాల్సి వస్తోంది.

రూ.6 చెల్లిస్తేనే గిట్టుబాటు

మేలో ఎండలు ఎక్కువగా ఉండడంతో కొత్త బ్యాచ్‌లు వేయలేదు, పాత బ్యాచ్‌లు తీసేయడంతో డిమాండ్ నెలకొంది. వ్యాపారులు గుడ్డు రూ.5 చొప్పున కొనుగోలు చేస్తున్నారు. మేత ధరలు, విద్యుత్ బిల్లుల పెట్టుబడి ఖర్చు కారణంగా ఉత్పత్తి ఖర్చు రూ.5కు చేరింది. కోడిగుడ్డుకు నికరంగా రూ.6 చెల్లిస్తేనే గిట్టుబాటు అవుతుంది. లేకపోతే నష్టపోవాల్సి వస్తోంది.

- జె.వెంకటరత్నం పౌల్ట్రీ రైతు, నల్లజర్ల

విద్యుత్ సబ్సిడీ కల్పించాలి

రాష్ట్ర ప్రభుత్వం ఆక్వా రంగానికి ఇచ్చినట్లుగానే పౌల్ట్రీ రంగానికీ విద్యుత్ సబ్సిడీ కల్పించాలి. కోళ్ల పరిశ్రమ పెద్ద తరహా పరిశ్రమ కిందకు రాదు. వ్యవసాయ అనుబంధ పరిశ్రమగా గుర్తించాలి. విద్యుత్ సంస్థ నుంచి రాయితీ అమలు చేస్తే రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు ఆదా అయి రైతులకు కొంతమేర ఊరట లభిస్తుంది. మేత, దాణా సబ్సిడీ అందించి పౌల్ట్రీ రైతులను ఆదుకోవాలి.

-కెవి.ముకుందరెడ్డి,
పౌల్ట్రీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు

నిరుద్యోగ సమస్య తీవ్రతరం

- మార్చి త్రైమాసికంలో 6.7 శాతానికి చేరిక
- యువతలో ఏకంగా 17 శాతం పిఎల్ఎఫ్ఎస్ డేటా వెల్లడి



న్యూఢిల్లీ : దేశంలో నిరుద్యోగం తాండవం చేస్తోంది. నేషనల్ స్టాటిస్టికల్ ఆఫీస్ (ఎన్ఎస్ఒ) విడుదల చేసిన పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే (పిఎల్ఎఫ్ఎస్) గణంకాల ప్రకారం.. ఆర్థిక సంవత్సరం 2023-24 మార్చితో ముగిసిన నాలుగో త్రైమాసికం (క్యూ4)లో దేశంలో నిరుద్యోగ రేటు 6.7 శాతానికి ఎగిసింది. ఇంతక్రితం డిసెంబర్ ముగింపు నాటికి ఇది 6.5 శాతంగా నమోదయ్యింది. మోడీ సర్కార్ హయంలో ఉపాధి కల్పన తగ్గిందనడానికి ఈ ప్రభుత్వ గణంకాలే నిదర్శనం. సాధారణంగా ఆర్థిక వ్యవస్థ పెరిగినప్పుడూ.. ఉద్యోగాల సృష్టి జరగాలి. కానీ ఎన్ఎస్ఒ గణంకాలు ఆందోళన కలిగించేలా నిరుద్యోగం ఉంది.

ప్రభుత్వంలోని కీలక శాఖ ఎన్ఎస్ఒ మే 17న విడుదల చేసిన గణంకాల ప్రకారం.. గడిచిన జనవరి - మార్చి త్రైమాసికంలో కరెంట్ వీక్లీ స్టేటస్ (సిడబ్ల్యుఎస్) ప్రకారం.. 15 ఏళ్లు పైబడిన వారిలో నిరుద్యోగం 6.8 శాతంగా చోటు చేసుకుంది. ఇదే త్రైమాసికంలో మహిళల్లో నిరుద్యోగం రేటు స్వల్పంగా 8.5 శాతానికి తగ్గింది. పురుషులలో నిరుద్యోగిత రేటు గడిచిన త్రైమాసికంలో 5.8 శాతం నుండి 6.1 శాతానికి పెరిగిందని పిఎల్ఎఫ్ఎస్ డేటా వెల్లడించింది. 15-29 ఏళ్ల యువత నిరుద్యోగిత రేటు 17 శాతానికి చేరింది. డిసెంబర్ త్రైమాసికంలో ఇది 16.5 శాతంగా ఉంది. 2024 మార్చి త్రైమాసికంలో పట్టణ జనాభాలో పని చేసే లేదా ఉపాధిని కోరుకునే వ్యక్తుల వాటా 50.2 శాతానికి చేరింది. ఇంతక్రితం ఇది 49.9 శాతంగా ఉంది. కాగా.. పట్టణ జనాభాలో స్వయం ఉపాధి కూడా 40.6 శాతానికి తగ్గింది. అంతక్రితం డిసెంబర్ త్రైమాసికంలో ఇది 40.5 శాతంగా ఉంది. పిఎల్ఎఫ్ఎస్ ప్రకారం.. 2024 జనవరి - మార్చి కాలంలో పట్టణ ప్రాంతాల్లో 15 ఏళ్లు పైబడిన వారిలో నిరుద్యోగం స్వల్పంగా 6.8 శాతానికి తగ్గింది. 2023 మార్చి-జనవరిలో ఇది 6.7 శాతంగా ఉంది.

దేశంలో ముఖ్యంగా యువతలో నిరుద్యోగం అమాంతం పెరుగుతోందని ముంబయి కేంద్రంగా పని చేస్తోన్న సెంటర్ ఫర్ మానిటరీంగ్ ఇండియన్ ఎకనామీ (సిఎంఐఇ) ఈ ఏడాది జనవరిలో ఓ రిపోర్ట్‌లో పేర్కొంది. 2023 అక్టోబర్ నుంచి డిసెంబర్ త్రైమాసికంలో 20-24 ఏళ్ల మధ్య యువతలో నిరుద్యోగం 44.49 శాతానికి ఎగిసినట్లు వెల్లడించింది. ఇదే సమయంలో 25-29 ఏళ్ల యువతలో 13.35 శాతంగా ఉన్న నిరుద్యోగ రేటు.. 2024 డిసెంబర్ త్రైమాసికంలో 14.33 శాతానికి ఎగిసి.. మూడున్నరేళ్ల గరిష్ట స్థాయికి.. అంటే కోవిడ్ నాటి స్థాయికి ఎగిసినట్లు విశ్లేషించింది. 30-34 మధ్య యువతలో నిరుద్యోగం 2.06 శాతం నుంచి 2.49 శాతానికి పెరిగి.. రెండున్నరేళ్ల గరిష్ట స్థాయికి ఎగిసింది.

విదేశీ ఇన్వెస్టర్లకు 'ఎన్‌డిఎ' భయాలు

ఒక్క నెలలోనే రూ.30వేల కోట్లు వెనక్కి..

ముంబయి : భారత్‌లో ఎన్‌డిఎ ఆశించిన స్థాయిలో సీట్లు రాకపోవచ్చనే అంచనాలు విదేశీ ఇన్వెస్టర్లలో ఆందోళనలు పెరిగాయి. దీంతో ఇక్కడి స్టాక్ మార్కెట్లలోని ఈక్విటీల్లోని పెట్టుబడులను పెద్ద సంఖ్యలో ఉపసంహరించుకుంటున్నారు. ఎన్నికల రిస్కుల ఆందోళనతో కేవలం ఒక్క నెలలోనే అంటే మేలో ఇప్పటి వరకు 3.5 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.30వేల కోట్ల) పెట్టుబడులను గ్లోబల్ ఇన్వెస్టర్లు వెనక్కి తీసుకున్నారని బ్లూమ్‌బర్గ్ ఓ రిపోర్ట్‌లో పేర్కొంది. జూన్ 2023 తర్వాత ఇవే అత్యధిక ఉపసంహరణలు అని వెల్లడించింది. ఇక్కడి పెట్టుబడులను చైనాకు తరలించుకుపోతున్నారని తెలిపింది. ప్రధాని నరేంద్ర మోడీ తక్కువ ప్రగతి, కీలకమైన ఆర్థిక సంస్కరణలను చేపట్టే అతని సామర్థ్యం పరిమితి తగ్గుతుందనే అంచనాల్లో భారత ఈక్విటీ మార్కెట్లు అనిశ్చిత్తిని ఎదుర్కొంటున్నాయని బ్లూమ్‌బర్గ్ పేర్కొంది. "భారత్‌లో ప్రస్తుత ఎన్నికల చుట్టూ ఉన్న రిస్కులు పెరిగాయి. అయితే చైనాలో ప్రతికూలత భయపడినంత ఏమి లేదనే సంకేతాలు ఉన్నాయి." అని న్యూయార్క్‌లోని ఏరియల్ ఇన్వెస్ట్‌మెంట్స్ ఎల్ఎల్‌సిలో పోర్ట్‌ఫోలియో మేనేజర్ క్రిస్టీన్ ఫిల్‌పాట్స్ పేర్కొన్నారు. భారత్‌లో జూన్ 1న పోలింగ్ ముగియనుంది. జూన్ 4న ఓట్లను లెక్కించనున్న విషయం తెలిసిందే.

eOffice
A DIGITAL WORKPLACE SOLUTION

'ఇ-ఆఫీస్'పై వెనుకంజ

- ఆధునీకరణ వాయిదా

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

ఆధునీకరణ పేరుతో ఇ-ఆఫీస్‌ను కొద్దిరోజులు మూసివేయాలన్న నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం వాయిదా వేసింది. ఇదే విషయాన్ని శుక్రవారం వెబ్‌సైట్‌లో కూడా ప్రకటించింది. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై పెద్దఎత్తున విమర్శలు వచ్చిన సంగతి తెలిసిందే. కీలకమైన ఫైళ్లను మాయం చేయడానికే ఈ నిర్ణయం తీసుకున్నారని తెలుగుదేశం పార్టీ ఆరోపించింది. ఇదే విషయాన్ని ఎన్నికల కమిషన్‌కు, రాష్ట్ర గవర్నర్‌కు ఆ పార్టీ ఫిర్యాదు చేసింది. దీంతో ఇసితోపాటు రాష్ట్ర గవర్నర్ కూడా ఈ విషయంలో జోక్యం చేసుకున్నట్లు సమాచారం. వారి నుండి వచ్చిన సూచనలతో ప్రస్తుతానికి అప్‌గ్రేడేషన్ నిర్ణయాన్ని వాయిదా వేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుతం ఉన్న సైట్‌ను 7.ఎక్స్‌కు అభివృద్ధి చేయాలని నిర్ణయించిన ప్రభుత్వం, శుక్రవారం నుంచి 25వ తేదీ వరకు సైట్‌ను నిలుపు చేస్తున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నిర్ణయంపై ఫిర్యాదులు అందిన నేపథ్యంలో ఎన్నికల నియమావళి ఉన్న సమయంలో అభివృద్ధి పేరిట ఎందుకు నిలిపివేయాలని నిర్ణయించారని గవర్నర్ ప్రశ్నించినట్లు సమాచారం. అయితే కొన్ని సాంకేతిక కారణాలవల్ల నిలుపుదల నిర్ణయాన్ని వాయిదా వేస్తున్నట్లు ప్రభుత్వం తెలిపింది.

తాగునీటి కోసం సచివాలయం ముట్టడి

- ఖాళీ బిందెలతో ఆందోళనకు దిగిన మహిళలు

ప్రజాశక్తి - పుట్లూరు (అనంతపురం)

అనంతపురం జిల్లా పుట్లూరు మండల పరిధిలోని కంది కాపుల గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించడంలో అధికారుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ఆ గ్రామ సచివాలయాన్ని మహిళలు శుక్రవారం ముట్టడించారు. ఖాళీబిందెలతో సచివాలయం ముందు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నికల ముందు నుంచి పోలింగ్ రోజు వరకు రోజు విడిచి రోజు ట్యాంకర్ల ద్వారా గ్రామానికి తాగునీరు సరఫరా చేశారని, పోలింగ్ ముగిసిన తర్వాత నుంచి నీటి సరఫరా చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నఫలంగా తాగునీటి సరఫరా ఎందుకు నిలిపివేశారో చెప్పాలని పంచాయతీ కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డిని నిలదీశారు. ట్యాంకర్ ద్వారా నీటి సరఫరా చేస్తామని వారికి కార్యదర్శి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ట్యాంకర్ ద్వారా ఎప్పటినుంచి నీరు సరఫరా చేస్తారని మహిళలు ప్రశ్నించారు. ఈ రోజు నుంచే నీరు సరఫరా చేయాలని లేకపోతే సచివాలయాన్ని దిగ్బంధిస్తామని హెచ్చరించారు. అందుకు పంచాయతీ కార్యదర్శి అంగీకరించడంతో మహిళలు అక్కడి నుంచి వెనుదిరిగారు.



ఖాళీబిందెలతో సచివాయం ముందు బైటాయించిన మహిళలు

గుంటూరు ఐజి, అనంతపురం ఎస్‌పిపై చర్యలు తీసుకోండి : వైసిపి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎన్నికల్లో ఏకపక్షంగా వ్యవహరిస్తూ హింసకు కారకులైన గుంటూరు రేంజ్ ఐజి త్రిపాఠిని బదిలీ చేసి, అనంతపురం ఎస్‌పి రామకృష్ణను సస్పెండ్ చేయాలని వైసిపి డిమాండ్ చేసింది. ఈ మేరకు సిఇఒ ఎంకె మీనాకు వైసిపి ఎమ్మెల్యే మల్లాది విష్ణు, మాజీ మంత్రి రావెల కిశోర్‌బాబు, గ్రీవెన్స్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు అంకంరెడ్డి నారాయణమూర్తి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. పల్నాడు జిల్లాలో తమ పార్టీ నాయకులు ఫిర్యాదు చేసినా ఐజి త్రిపాఠి సకాలంలో స్పందించ లేదన్నారు. అలాగే తాడిపత్రిలో అల్లర్లకు రామకృష్ణనే కారణమని అన్నారు. తమ పార్టీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి ఇంటిపై పోలీసులతో దాడులు చేయించారని ఆరోపించారు.

డిష్ టివి స్మార్ట్ ప్లస్ ఆవిష్కరణ

- రూ.279కే టివి, ఒటిటి కంటెంట్స్
- మార్కెట్ వాటా పెంపు లక్ష్యం
- సిఇఒ మనోజ్ దోభాల్ వెల్లడి

హైదరాబాద్ : ప్రముఖ డిటిహెచ్ సేవల సంస్థ డిష్ టివి కొత్తగా 'డిష్ టివి స్మార్ట్ ప్లస్' సర్వీసులను ప్రారంభించినట్లు ప్రకటించింది. శుక్రవారం హైదరాబాద్‌లో దీనిని నటీ శ్రద్ధ దాస్‌తో కలిసి ఆ కంపెనీ సిఇఒ మనోజ్ దోభాల్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మనోజ్ మాట్లాడుతూ.. రూ.279కే టివి సహా ఒటిటి కంటెంట్స్‌ను అందిస్తున్నామన్నారు. తమ వేదికపై 21 ఒటిటి యాప్స్ అందుబాటులో ఉన్నాయన్నారు. మూడు రోజులకు ఒక్క ఒటిటిని మార్చుకోవడానికి వీలుందన్నారు. ఈ సేవలను ఎక్కడి నుంచైనా ఏ తెరపైనా అయినా వీక్షించవచ్చన్నారు. డిటిహెచ్ మార్కెట్‌లో తమకు 21 శాతం వాటా ఉందన్నారు. తెలుగు రాష్ట్రాల్లోనూ ప్రధానంగా ఉన్నామన్నారు. కొత్తగా అందుబాటులోకి తెచ్చిన డిష్ టివి స్మార్ట్ ప్లస్ సేవలతో మార్కెట్ వాటాను 2-3శాతం పైగా పెంచుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. డిటిహెచ్ సేవలకు ప్రతీ నెల రుసుం చెల్లించలేని వారి కోసం ప్రత్యేకంగా జింగ్ సూపర్ ప్లాన్‌ను అందిస్తున్నామన్నారు. ఒక్క సారి రూ.1500 చెల్లించి బాక్స్ తీసుకోవడం ద్వారా 230 చానల్స్‌ను ఉచితంగా వీక్షించవచ్చని.. కావాలనుకుంటే చెల్లింపు చానల్స్‌ను జోడించుకోవచ్చన్నారు.



సంపాదకీయం

సుప్రీం ఆదేశాలతోనైనా..


రాష్ట్రంలో బరితెగించి సాగిస్తున్న ఇసుక అక్రమ తవ్వకాలపై సర్వోన్నత న్యాయస్థానం స్పందన స్వాగతించదగినది. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్‌జిటి), సుప్రీం ఆదేశాలకు వ్యతిరేకంగా జరుగుతున్న చట్ట విరుద్ధ ఇసుక అక్రమ మైనింగ్ నిరోధానికి జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో వివిధ సర్కారీ విభాగాల అధికారులు సభ్యులుగా కమిటీలు ఏర్పాటు కావాలని, అవి సుప్రీం వేసిన కమిటీల్లా పని చేయాలని, నిర్లక్ష్యం వహిస్తే కోర్టు ధిక్కరణతో పాటు క్రిమినల్ చర్యలూ ఎదుర్కోవాల్సి ఉంటుందని న్యాయస్థానం గురువారం మధ్యంతర ఉత్తర్వులివ్వడం మంచిదే. కమిటీలు నాలుగు రోజుల్లో అన్ని ఇసుక రీచ్‌లనూ సందర్శించి అక్రమ తవ్వకాలను ఆపించాలని ఆదేశించింది.

కాగా కేసు విచారణ సందర్భంగా ఇసుక అక్రమాలపై వెలుగులోకి వచ్చిన విషయాలు కోర్టులపైనా, చట్టాలపైనా, వ్యవస్థలపైనా రాష్ట్ర ప్రభుత్వానికి ఎంతమాత్రం గౌరవం లేదని తెలియజేస్తున్నాయి. నిషేధిత ప్రాంతాల్లో భారీ యంత్రాలతో మైనింగ్ వద్దని గతేడాది మార్చి 23న ఎన్‌జిటి ఇచ్చిన తీర్పును రాష్ట్ర సర్కార్ నేలకేసి కొట్టి తన పని తాను చేసుకుపోయిందని సాక్ష్యాధారాలతో సహా సుప్రీం దృష్టికొచ్చింది. కేంద్ర పర్యావరణ, అటవీ శాఖల ప్రత్యక్ష తనిఖీల్లోనూ ఉల్లంఘనలు బయట పడ్డాయని ఆ విభాగాలు కోర్టుకు నివేదిక సమర్పించాయి. ఇసుక అక్రమాలు ప్రభుత్వ అండతోనే జరిగాయనడానికి ఇంతకంటే ఏం కావాలి? అందుకే సుప్రీం అంతలా రాష్ట్ర ప్రభుత్వంపై ఆగ్రహం చెందాల్సి వచ్చింది.

ఎ.పి.లో అక్రమ ఇసుక దందా కొంత మంది రాజకీయ నాయకులకు, ప్రజాప్రతినిధులకు, కాంట్రాక్టర్లకు, అధికారులకు కాసులు కురిపిస్తోందన్నది పచ్చి నిజం. వైసిపి సర్కారు వచ్చీరాగానే ఇసుక మైనింగ్‌ను కొన్ని నెలలపాటు నిలిపేసింది. టిడిపి హయాంలో ఇసుక అక్రమాలు జరిగాయని, తాము వాటిని సరిచేసి ప్రభుత్వానికి పెద్ద ఎత్తున ఆదాయం తెస్తామని తొలుత ఆన్‌లైన్ సిస్టం ప్రవేశపెట్టింది. తదుపరి అక్రమాలు ఆగలేదన్న పేరిట రాష్ట్ర వ్యాప్తంగా ఒకటి రెండు ప్రైవేటు కంపెనీలకు మైనింగ్ కాంట్రాక్టులిచ్చింది. ఈ చర్యతో గుత్తాధిపత్యం నెలకొంది. ఇసుక ధరలు అమాంతం పెరిగిపోయాయి. ఒకప్పుడు ట్రాక్టర్ ఇసుక ఇంటికి చేర రూ.1,500-2,000 ఉన్నది కాస్తా ఐదారు వేలు దాటింది. సామాన్యులు ఇసుక కొనలేని పరిస్థితి నెలకొంది. ఇసుకను కొన్ని నెలలు ఆపడం వలన సుమారు కోటి మందికిపైగా ఉన్న భవన నిర్మాణ కార్మికులకు, నిర్మాణరంగంపై ఆధారపడ్డ ఇతర కార్మికులకు పనుల్లేక పస్తులుండాల్సిన దుర్గతి పట్టింది. కొన్ని చోట్ల కార్మికులు ఆత్మహత్యలకు సైతం పాల్పడ్డ హృదయవిదారక సంఘటనలు చోటు చేసుకున్నాయి. ఇప్పటికీ సక్రమంగా ఇసుక అందుబాటులో లేక ప్రజలు నానా ఇబ్బందులూ పడుతున్నారు.

ఈ కాలంలో అనుమతుల్లేని అక్రమ ఇసుక తవ్వకాలకు హద్దూ పద్దూ లేదు. సుప్రీంకు గనుల శాఖ ఇచ్చిన నివేదిక ప్రకారం చూసినా.. 30 వేలకుపైన ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయంటే పరిస్థితి ఎంత భయానకమో అర్థమవుతుంది. ఎఫ్ఐఆర్‌లపై తీసుకున్న చర్యలు శూన్యం. గతంలో ఎన్‌జిటి ఆదేశాలపై కలెక్టర్లు ఇసుక రీచ్‌లను పరిశీలించి అక్రమాలేవీ లేవని అబద్ధపు రిపోర్టులిచ్చారు. కళ్లముందు విచ్చలవిడి ఇసుక దోపిడీ జరుగుతున్నా వ్యవస్థలు కళ్లు మూసుకున్నాయి. ఇక ఇసుక మాఫియా దాష్టీకాలకు, దౌర్జన్యాలకు, దాడులకు లెక్కే లేదు. ప్రశ్నించిన వారిని హతమార్చిన దారుణాలూ ఉన్నాయి. ప్రభుత్వంలోని పెద్దల అండదండలు లేకుండా ఇటువంటి అరాచకాలు జరగవు. రాజ్యం మద్దతుతో సాగుతున్న అక్రమ ఇసుక మైనింగ్ ఆగాలంటే న్యాయస్థానాల జోక్యం తప్ప మరో గత్యంతరం లేదు. సుప్రీం ఆదేశాలను అమలు చేయాల్సింది రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగమే. కోర్టు నిరంతర పర్యవేక్షణ ఉంటే తప్ప అక్రమాలకు ముకుతాడు పడదు. ఇసుకాసురులపై కఠిన చర్యలు తీసుకుంటేనే వ్యవస్థలపై ప్రజల్లో విశ్వాసం కలుగుతుంది. సహజ వనరులు ప్రకృతి మానవాళికి ఇచ్చిన వరం. అవసరాలకనుగుణంగా పరిమితంగా వాడుకోవాలి. లాభాపేక్ష, కార్పొరేటీకరణలతో విచ్చలవిడిగా తోడేస్తే నీటి వనరుల గమనానికి, పర్యావరణానికి హానికరం. ఈ విధ్వంసాన్ని కట్టడి చేసి భావి తరాల కోసం సహజ వనరులను రక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత. సుప్రీం ఉత్తర్వులతోనైనా ప్రభుత్వం, అందరూ ఆ వైపు కదలాలి.

మంచి మాట



వ్యక్తి ప్రయోజనాల కన్నా
సమాజ ప్రయోజనాలు అతి ముఖ్యం.
ఈ రెంటికీ మధ్య న్యాయమైన,
సమతుల్యమైన సంబంధాలు ఏర్పరచాలి.

- లెవిస్ హెన్రీ మోర్గాన్
సామాజిక సిద్ధాంతకర్త.

Lewis H. Morgan

మోడీ ఆఖరి ఉక్రోషాల అర్థమేంటి?



ప్రస్తుతం



తెలకపల్లి రవి

"జానపద కథల్లో శక్తులన్నీ కలసి ఎవరికో పట్టం కట్టాలని చూసినట్టు భారత దేశంలో, పాలక వ్యవస్థలన్నీ కలసి నరేంద్ర మోడీ బిజెపి ప్రభుత్వాన్ని మూడోసారి ప్రతిష్టించడానికి పథకాలు వేస్తున్నాయి. ఎన్నికలలో ఓటు వేసి గెలిపించవలసిన ప్రజలను మానసికంగా సిద్ధం చేయాలనుకుంటున్నాయి. ఇప్పుడు ఆయన మూడవసారి అధికారంలోకి రావడం అసాధ్యమని తెలిసినా అదే మోత సాగించడంలో పరమార్థం అదే. ఎలాగూ గెలిచే మోడీని ఎదుర్కోవడం వృథా అని నీరిపోయడం అందులో భాగమే. తెలుగు నాట సీనియర్ మాజీ ముఖ్యమంత్రి అయిన చంద్రబాబు నాయుడు కూడా అదే తరహాలో మోడీని మోయడం అనివార్యమని నమ్ముతూ ఆ ప్రచారానికి ఊతమిస్తున్నారు. గత పదేళ్ల నుంచి మోడీకే వత్తాసునిస్తున్న ముఖ్యమంత్రి జగన్ కూడా బిజెపి జోలికి పోకుండా తన వంతు సహాయం అందిస్తున్నారు. జాతీయ మీడియా దాదాపుగా మోడియాగా మారిపోగా తెలుగు మీడియా కూడా ప్రాంతీయంగా తమకు నచ్చిన వారికి మద్దతిస్తూ జాతీయ స్థాయిలో బిజెపికి అనుకూలమైన రాగాలే వినిపిస్తున్నది. ఏతావాతా బిజెపి హ్యాట్రిక్ విజయం గురించి వారికన్నా ఎక్కువగా ఈ శక్తులు ప్రచారం చేస్తున్నాయి. వామపక్షాలు గానీ, బిజెపి ఎన్‌డిఎకు వ్యతిరేకంగా ఏర్పాటైన 'ఇండియా' దండగమారి ప్రయత్నమనీ, వామపక్షాలు ఏదో సైద్ధాంతికంగా వ్యతిరేకించడం తప్ప చేయగలిగింది లేదనీ అహోరాత్రులు అపహాస్యం చేస్తున్నాయి. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షాలుగా పోరాడటం సహజంగా జరుగుతుందనే కనీస ప్రజాస్వామిక సంప్రదాయాన్ని కూడా భరించలేకపోతున్నాయి. నిజంగానే ఇది చాలా విడ్డూరమైన పరిస్థితి. 'మోడీ బిల్డప్‌నే మోయడం అవసరమా?' శీర్షికతో ఇదే కాలమ్‌లో మొన్న ఏప్రిల్ 5న వ్యాసం ఇదీ. ఇప్పుడొక్కసారి వెనక్కు తిరిగి చూస్తే ఎవరో ఏదో అనడం కాదు. ఆ మోడీనే తనను తాను సమర్థించుకోలేక సతమతమవుతున్న స్థితి. ఎ.పి, తెలంగాణలలో పోలింగ్ ముగిసిపోయింది గనక ప్రజల తీర్పు లెక్కింపు జరిగేలోగా కళ్ల ముందు నడుస్తున్న చరిత్ర సూటిగానే చెప్పుకోవచ్చు.

ఎవరైనా అనుకున్నారా?

హిందూ ముస్లిం మధ్య తేడా చూపితే నేను ప్రజా జీవితానికి అనర్హుణ్ణవుతానని మోడీ మీడియా ముందు వాపోతారనీ అటూ ఇటూ తిప్పి మాట్లాడతారనీ ఎవరైనా అనుకున్నారా? బహుశా చెప్పినా చాలా మంది నమ్మి వుండేవారు కారేమో! 2002 గుజరాత్ మారణహోమంపై మీడియా ప్రశ్నలు దాటేయడమేగాక చర్చ నుంచి లేచిపోయిన మోడీ ఇప్పుడు తనే ఆ ప్రస్తావన తెచ్చి మరీ మాట్లాడుతున్నారు. గోద్రా అల్లర్లకు తనను బాధ్యుడుగా చిత్రించడం చాలా బాధ కలిగించినందువల్లనే అలా చేశానని ప్రకటిస్తున్నారు. నిజానికి వాటిని గోద్రా అల్లర్లు అనడం సంఘ పరివార్, బడా మీడియా కలసి చేసిన కుట్ర. గోద్రాలో రైలు బోగీ దగ్ధం, కొంతమంది భక్తులు మరణించడం అందరినీ కలచివేసింది. తర్వాత అంతకు కొన్ని వేల రెట్లు భయానకమైన హత్యాకాండ, మహిళలపై, పిల్లలపై హింస కొనసాగింది. మోడీ ముఖ్యమంత్రి కాగా ఆయన సహాయకుడుగా హోంశాఖ చూసిన వ్యక్తి అమిత్ షా. ఆ పరిస్థితి చక్కదిద్దక పోగా ఆ మారణకాండ మంటలు చల్లారక ముందే ముందస్తు ఎన్నికల కోసం వెంటబడి మళ్లీ గద్దెక్కి కూర్చున్న నేపథ్యం మోడీది. నేరుగా అంబానీలే ఆయనను గుజరాత్‌లో పుట్టిన అపర గాంధీగా ఆకాశానికెత్తారు. గుజరాత్‌లో గాంధీ, ధీరూభాయ్ అంబానీ, మోడీ పుట్టారని అనిల్ అంబానీ కీర్తించినప్పుడే ఆయన కార్పొరేట్ ముద్దుబిడ్డ అని తేలిపోయింది. భారత ప్రధాని కాలేకపోయినా భారతరత్నతో సరిపెట్టుకోవలసి వచ్చిన అద్వానీ ఎన్నికలలో దేశాన్ని ఆకర్షించలేకపోతున్నారని అప్పటికే అర్థమైపోయింది. 2004లో యుపిఎ అధికారంలోకి వచ్చిన కొద్ది కాలానికే ఆయన పాకిస్తాన్‌లో జిన్నాను పొగిడారనే పేరిట అద్వానీపై చర్య తీసుకుని పక్కన పెట్టారు. అయినా ఆ తర్వాత ఎలాగూ నెగ్గలేని 2009 ఎన్నికల్లో తనను ప్రధాని అభ్యర్థిగా ప్రకటించి ఒక తంతు ముగించారు. ఇక రామ రథయాత్రీకుని రాజకీయ పాత్ర చాలదని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ గుర్తించిన పిదపనే మోడీని రంగంలోకి దింపారు. నాగపూర్-ముంబాయి లింకుతో జరిగిన పని ఇది.

చంద్రబాబు గతం, జగన్ ప్రస్తుతం

ఇక్కడ చంద్రబాబు లింకు కూడా చెప్పుకోవలసి వుంటుంది. బలం లేకున్నా మాయాజాలంతో మొదటిసారి ఈ దేశ ప్రధాని పదవి చేపట్టి 13 రోజులకే దిగిపోయిన వాజ్‌పేయి 1998లో 13 నెలలు కొనసాగి మళ్లీ తిరిగి రాగలిగారంటే చంద్రబాబు, టిడిపి ఇచ్చిన మద్దతే తొలి కారణం. ఎందుకంటే 1990లో అద్వానీ రథయాత్ర తర్వాత ఎన్టీఆర్ బిజెపితో తెగతెంపులు చేసుకున్నారు. అంతకు ముందు వారికి కేటాయించిన సీట్లు కూడా వామపక్షాలతోనే పంచుకున్నారు. 1994 ఎన్నికల్లో ఉభయ కమ్యూనిస్టులకు కలసి 34 స్థానాలు వచ్చాయి. తను నిలదొక్కుకోవడానికి మొదట్లో వామపక్షాల మద్దతుపైనే ఆధారపడిన చంద్రబాబు 1998 ఎన్నికల తర్వాత హఠాత్తుగా ప్లేటు మార్చి అటు దూకారు. ప్రాంతీయ పార్టీలు బిజెపితో చేతులు కలపడం అప్పుడే మొదలైంది. 2004లో ఘోర పరాజయం పాలైన తర్వాత 2009లో మారానని ప్రకటించి మళ్లీ 2014లో అటే అడుగులు వేశారు. మోడీకి సారీలు చెప్పి మరీ పొత్తు కుదుర్చుకున్నారు. ఇదేదో జగన్ దుర్మార్గాలను ఎదుర్కొనడం కోసమే చంద్రబాబు బిజెపితో కలిశారని సమర్థించే కొందరు మిత్రులు తెలుసుకోవలసిన ఇటీవలి చరిత్ర ఇది. ఖచ్చితంగా చెప్పాలంటే 1999-2024 మధ్య ఆరుసార్లు జరిగిన వివిధ ఎన్నికలలో కేవలం 2009 ప్రత్యేక పరిస్థితులలో మాత్రమే వామపక్షాలు టిడిపితో కలసి పోటీ చేశాయి. ఇక జగన్ వైసిపి విషయానికి వస్తే కాంగ్రెస్‌తో విడగొట్టుకుని ప్రాంతీయ పార్టీగా ఏర్పడిన తర్వాత ఆయన బిజెపికే దగ్గరగా వున్నారు. పాలక పార్టీల ఎన్నికల రాజకీయాలలో తన ఓటు బ్యాంకు బిజెపితో నేరుగా పొత్తు పెట్టుకుంటే నిలవదని ఆయనకు తెలుసు. అలాగే హిందూత్వ రాజకీయాలతో దేశాన్ని పాలించే బిజెపికి కూడా అది కుదిరే పని కాదు. అందుకే ఎన్నికలలో మాత్రం వేరుగా పోటీ చేస్తూ ముందూ వెనకా కలిసే వ్యవహరిస్తుంటారు. కనుక చంద్రబాబు, జగన్ ఇద్దరికీ కామన్ పాయింట్ ఇదే. పొత్తు పార్టీలు తొత్తు పార్టీలూ అని సిపిఎం అంటున్న మాట ఇదే. దేశంలో ఎక్కడికన్నా ఎ.పి లోనే బిజెపికి ఎక్కువ సీట్లు వుంటాయని మాజీ ఎం.పి ఉండవల్లి అరుణ్‌కుమార్ ఎప్పుడూ అంటుంటారందుకే.

ఎ.పి, తెలంగాణలకు అన్యాయం

చంద్రబాబు వెంటబడి బిజెపితో పొత్తు పెట్టుకున్నా తర్వాత ఉమ్మడి ప్రణాళిక కూడా లేకుండా ప్రచారంలో ఎన్ని పిల్లిమొగ్గలు వేశారో, జెండాలు వద్దంటూ స్థానికంగా టిడిపి కార్యకర్తలు పక్కన పెట్టించారో చూశాం. ముస్లిం రిజర్వేషన్ల విషయంలో ఈ తేడా మరీ బాహాటంగా కనిపించింది. ఆ రిజర్వేషన్లు తొలగిస్తామని మోడీ, అమిత్ షాలు పదేపదే ప్రకటించడమే గాక సవాళ్లు విసురుతుంటే నేను కాపాడతానని జగన్ గట్టిగా చెప్పవలసి వచ్చింది. చంద్రబాబు కూడా అదే చెప్పినా బిజెపితో కలవడం వల్ల మైనార్టీ వర్గాలలో కొంత సందేహం తప్పలేదు. పైగా అది ఆయన పార్టీ అభిప్రాయమే గానీ మాకు సంబంధం లేదని అమిత్ షా ఒకటికి రెండుసార్లు స్పష్టం చేశారు. న్యూస్‌లాండ్రీ శ్రీనివాసన్ మోడీపై, బిజెపి మత రాజకీయాలపై, చంద్రబాబు పిల్లిమొగ్గల గురించి నిరంకుశ పోకడల గురించి ప్రశ్నలు వేస్తే జవాబు ఇవ్వలేక తంటాలు పడ్డారు. ఇక జగన్ కూడా 'ఆ ఒక్కటి దక్క...' అన్నట్టే మాట్లాడారు. ఆగర్భ శత్రువుల్లా పోట్లాడుకునే ఈ ఇద్దరూ రాహుల్ గాంధీ మోడీ కన్నా మెరుగని తామెప్పుడూ చెప్పలేదని ఒకటికి రెండుసార్లు వివరణ ఇచ్చుకున్నారు. చంద్రబాబు అయితే మోడీ క్రియాశీల నాయకత్వం కింద ఎన్‌డిఎ ఏర్పడినట్టు ఉమ్మడి ప్రకటనలో పదేపదే ప్రకటించారు. తన విజన్ 2020 పక్కన పెట్టిన మోడీని విజనరీ నాయకుడని కీర్తించారు. మోడీ ఇద్దరు నేతలతోనూ ఆడాల్సిన రాజకీయ క్రీడే ఆడారు. జగన్ పేరు ప్రస్తావించకుండా వైసిపిని, రాష్ట్ర ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం ద్వారా టిడిపికి కాస్త ఊరట కలిగించారు. వాస్తవానికి వారిద్దరి మీద, తద్వారా ఏపి మీద కూడా పెత్తనం చేయడమే మోడీ విధానం లక్ష్యం. ఉత్తరాదిన వచ్చే స్థానాలు తగ్గుతూ దక్షిణాన అసలే ఠికాణా లేదు గనక వీరిని ముందుంచుకుని పబ్బం గడుపుకోవాలన్న ప్రయాస మాత్రమే. ఇంత బాహాటంగా కనిపించకపోయినా తెలంగాణలోనూ కాంగ్రెస్, బిఆర్‌ఎస్‌ల మధ్య బిజెపి రాజకీయం సాగిస్తున్నది. బిఆర్‌ఎస్ కాంగ్రెస్‌లో కలిసిపోతుందని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తమ పార్టీలోకి వచ్చేస్తాడని. ఆగష్టు సంక్షోభం తప్పదనీ రకరకాల మాటలతో రాజకీయ టక్కుటమార విద్యలు ప్రదర్శిస్తున్నారు బిజెపి నేతలు. జూన్ 2న విభజన చట్టం గడువు ముగిసిపోతుంటే ఇప్పటికీ ఏదీ ఒక కొలిక్కి రాని పరిస్థితి. తాజాగా రేవంత్ రెడ్డి ఎ.పి భవనాలు వంటివి స్వాధీనం చేసుకోవాలని, అన్ని అంశాలు పరిష్కరించాలని అన్నట్టు వార్తలొచ్చాయి. కానీ ఓట్ల లెక్కింపు జూన్ నాలుగు గనక ఎ.పిలోనూ కేంద్రంలోనూ ఏం జరిగేది ఆ తర్వాతనే చూడగలం.

> **"తాత్కాలిక మనుగడ కోసం కోరి ధృతరాష్ట్ర కౌగిలి ఆశ్రయించిన తెలుగు రాష్ట్రాల నేతలు, వారి పనుపున బిజెపి భజన గీతాలు పాడిన తెలుగు మీడియాధిపతులు ఇప్పుడైనా కళ్లు తెరుస్తారా? జాతీయ మీడియాలో కొందరైనా దీన్ని గుర్తిస్తుంటే అంతర్జాతీయ మీడియా మోడీ, బిజెపిల సర్కస్‌లను సూటిగానే బహిర్గత పరుస్తున్నది. మోడీపై విదేశీ మీడియా కుట్రలంటూ గగ్గోలు కూడా మొదలైంది. ప్రగతిశీల శిబిరానికి దగ్గరగా వున్నా మోడీ మోతలో ఊగిసలాడిన మీడియా వర్గాలు కూడా కొంత సవరించుకుంటున్నాయి. ఆఖరుకు మోడీనే ముస్లింల విషయంలో సంజాయిషీ ఇచ్చినట్టు నటించాల్సి వచ్చింది. అదానీ పేరు కూడా ప్రస్తావించాల్సి వచ్చింది. కొంతమంది తొందరపాటుతో దీనిపై సూత్రీకరణలు మొదలెట్టారు గానీ అదీ తొందరపాటే. మోడీ మాటల్లో నిజాయితీ ఎంత మాత్రం లేదు."**

సడలిన విశ్వాసం సంకేతాలు

తాత్కాలిక మనుగడ కోసం కోరి ధృతరాష్ట్ర కౌగిలి ఆశ్రయించిన తెలుగు రాష్ట్రాల నేతలు, వారి పనుపున బిజెపి భజనగీతాలు పాడిన తెలుగు మీడియాధిపతులు ఇప్పుడైనా కళ్లు తెరుస్తారా? జాతీయ మీడియాలో కొందరైనా దీన్ని గుర్తిస్తుంటే అంతర్జాతీయ మీడియా మోడీ బిజెపిల సర్కస్‌లను సూటిగానే బహిర్గత పరుస్తున్నది. మోడీపై విదేశీ మీడియా కుట్రలంటూ గగ్గోలు కూడా మొదలైంది. ప్రగతిశీల శిబిరానికి దగ్గరగా వున్నా మోడీ మోతలో ఊగిసలాడిన మీడియా వర్గాలు కూడా కొంత సవరించుకుంటున్నాయి. ఆఖరుకు మోడీనే ముస్లింల విషయంలో సంజాయిషీ ఇచ్చినట్టు నటించాల్సి వచ్చింది. అదానీ పేరు కూడా ప్రస్తావించాల్సి వచ్చింది. కొంతమంది తొందరపాటుతో దీనిపై సూత్రీకరణలు మొదలెట్టారు గానీ అదీ తొందరపాటే. మోడీ మాటల్లో నిజాయితీ ఎంత మాత్రం లేదు. అయినా వారణాసిలో నామినేషన్ సందర్భంగా రాజ్యాంగంపై ఆయన చేసిన ప్రమాణ స్వీకారానికి అటూ ఇటు పవన్ కళ్యాణ్, చంద్రబాబు హాజరు వేయించుకుని రావడం ఇందుకు నిదర్శనం. ఎవరికీ మెజార్టీ రాకూడదనేది తమ ఆకాంక్ష అని వైసిపి అంటున్నా మొగ్గు మోడీ వైపేనన్నది నిస్సందేహం. ఇప్పటికే 70 శాతం భారతీయులు ఓటేసే ప్రక్రియ పూర్తయింది. మిగిలిన చోట్లనైనా బిజెపి ఆధిక్యత నిలుస్తుందా అనేది సందేహాస్పదంగా వుంది. అయినా మోడీనే మోయడానికి వీరు సిద్ధం కావడం ఆశ్చర్యకరం. తెలుగు రాష్ట్రాల కీలక నేతల అవకాశవాదాలు ఎలా వున్నా దేశ ప్రజలూ రాష్ట్ర ప్రజలూ కూడా మత రాజకీయాలను, నిరంకుశ పోకడలనూ ఆమోదించడం లేదనేది స్పష్టం. జూన్ నాలుగున గానీ దీని పూర్తి సన్నివేశం అర్థం కాదు. అది కూడా అనిశ్చితినే తెస్తుందా అనే ప్రశ్న కూడా వుండనే వుంటుంది.

వ్యవసాయ విద్యుత్-కొత్త డిస్కాం-పర్యవసానాలు

విశ్లేషణ



ఎం.వేణుగోపాలరావు

/ నిన్నటి తరువాయి /

కమిషన్ ఇచ్చిన చార్జీల ఉత్తర్వు ప్రకారం 2024-25లో రాష్ట్రంలో వ్యవసాయానికి ఉచిత విద్యుత్‌కు 11299 మి.యూ అవసరం. ఎల్.టి, హెచ్.టి కేటగిరీలలో వ్యవసాయానికి, అనుబంధ కేటగిరీలకు కలిపి మొత్తం 18279 మి.యూ అవసరం. కమిషన్ నిర్ధారణ ప్రకారం డిస్కాంలకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో లభించే సంప్రదాయేతర, ఆర్.ఇ 17578 మి.యూ. ఇందులో సెప్టెంబరు నుండి వచ్చే ఏడాది మార్చి వరకు 'సెకి' నుండి లభించే సౌర విద్యుత్ 3204 మి.యూ. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో లభించే జల విద్యుత్ కలిపి ఇది 21452 మి.యూ అని కమిషన్ నిర్ధారించింది. 'సెకి' సరఫరా చేసే విద్యుత్‌తోనే వ్యవసాయానికి ఉచిత విద్యుత్ అవసరాన్ని తీర్చాలంటే కొత్త డిస్కాంకు 2026-27 నుండే సాధ్యమవుతుంది. రాష్ట్రంలో మొత్తం వ్యవసాయ, దాని అనుబంధ కేటగిరీలను కొత్త డిస్కాం పరిధిలోకి తెస్తే, దానికి ఇంకా అదనంగా విద్యుత్ అవసరమవుతుంది. కొత్త డిస్కాం కింద చేయబోయే ఏర్పాటును బట్టి ప్రస్తుత డిస్కాంలపై దాని ప్రభావం ఎలా ఉంటుందనేది పరిశీలించాల్సి వస్తుంది. ప్రస్తుత డిస్కాంల కిందనున్న కేటగిరీలను కొత్త డిస్కాం పరిధిలోకి తీసుకు వచ్చిన మేరకు ప్రస్తుత డిస్కాంల డిమాండు తగ్గుతుంది. ఆ మేరకు పంపిణీ నష్టాలు కూడా తగ్గి, అవి కొనుగోలు చేసే ఆర్.ఇ శాతంగా పెరుగుతుంది. 2027-28 నుండి ప్రస్తుత మూడు డిస్కాంలు కనీసం ఏ మేరకు ఆర్.ఇ కొనుగోలు చేసి తీరాల్సి వస్తుందనేది ఆ సంవత్సరం నుండి అమలులోకి వచ్చే విధంగా భవిష్యత్‌లో కమిషన్ జారీ చేసే ఆర్‌పిపిఓపై ఆధారపడి ఉంటుంది.

కొత్త డిస్కాం పరిధిలోకి తెచ్చే కేటగిరీల డిమాండు మేరకు ప్రస్తుత డిస్కాంల డిమాండు తగ్గుతుంది. ఆ విధంగా మిగులు విద్యుత్ పెరిగిన మేరకు థర్మల్ విద్యుత్ ఉత్పత్తిని తగ్గించి, ఆ మేరకు కొనుగోలు చేయని విద్యుత్‌కు స్థిర చార్జీల భారాన్ని మూడు డిస్కాంల వినియోగదారులపై మోపాల్సి వస్తుంది. 17000 మి.యూ సౌర విద్యుత్‌ను కొత్త డిస్కాంకు బదిలీ చేశాక, ప్రస్తుత మూడు డిస్కాంల పరిధిలో అమలులో ఉన్న పిపిఎల ప్రకారం సగటున యూనిట్ విద్యుత్ కొనుగోలు వ్యయం పెరుగుతుంది. దానితో పాటు మూడు విద్యుత్ పంపిణీ కంపెనీల పరిధిలోని కేటగిరీల వినియోగదారులకు యూనిట్‌కు కాస్ట్ ఆఫ్ సర్వీస్ (సిఓఎస్) పెరుగుతుంది. తత్ఫలితంగా ప్రభుత్వం ఇవ్వాల్సిన సబ్సిడీగాని, చార్జీలుగాని, రెండూగాని పెరుగుతాయి.



వ్యవసాయానికి ఉచిత విద్యుత్ పొందుతున్న వినియోగదారులకు ఏ ప్రాజెక్టుల నుండి ఎంత విద్యుత్‌ను ఏ ధరలకు కొంటున్నారు? ఏ డిస్కాం ద్వారా విద్యుత్ సరఫరా చేస్తున్నారనే వాటి వల్ల ఉచిత విద్యుత్ విధానం కొనసాగినంత కాలం తేడా ఏమీ ఉండదు. అయితే, విద్యుత్ పంపిణీ ప్రైవేటీకరణ, నేరుగా ప్రయోజనం బదిలీ (డిబిటి) అమలు జరిగితే పర్యవసానాలు ఎలా ఉంటాయనేది చూడాలి. ప్రైవేటు డిస్కాంలను మోడీ ప్రభుత్వ విధానం ప్రకారం అనుమతిస్తే, వాటి పరిధిలో వ్యవసాయ వినియోగదారులకు విద్యుత్ పంపిణీ చేయాల్సిన బాధ్యత కొత్త డిస్కాం ఏర్పాటు వల్ల వాటికి ఉండదు. అధిక లాభాలు వచ్చే ప్రాంతాల, కేటగిరీల వినియోగదారులు ప్రైవేటు డిస్కాంల పరిధిలోకి వచ్చే మేరకు ప్రస్తుత మూడు డిస్కాంల డిమాండు ఆ మేరకు తగ్గి, మిగులు విద్యుత్, దానితో ముడిపడిన భారాలు వినియోగదారులకు పెరుగుతాయి. క్రాస్ సబ్సిడీ ఆదాయం, లాభాలు తగ్గుతాయి. మెరిట్ ఆర్డర్ డిస్పాచ్ సూత్రం ప్రకారం ప్రధానంగా ఎ.పి జెన్కో థర్మల్ ప్రాజెక్టుల విద్యుత్ ఉత్పత్తి తగ్గించాల్సి వస్తుంది. జెన్కో, డిస్కాంలకు సిబ్బంది అవసరం తగ్గి, వారి ఉద్యోగ భద్రతకు ముప్పు ఏర్పడుతుంది. అవి ఆర్థిక సంక్షోభంలో పడే ముప్పు ఏర్పడుతుంది.

కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ 2005 జూన్ 8న జారీ చేసిన విద్యుత్ నిబంధనల ప్రకారం, సిఇఆర్‌సి నిర్ణయించిన చార్జీలను రాష్ట్ర కమిషన్ మార్చగూడదు. సిఇఆర్‌సి నిర్ణయించిన చార్జీలను పరిగణించి సంబంధిత ప్రాజెక్టు నుండి డిస్కాంలు విద్యుత్ కొనుగోలు చేయవచ్చా అనేది రాష్ట్ర కమిషన్ నిర్ణయించవచ్చు. అయితే 'సెకి' విషయంలో సిఇఆర్‌సి చార్జీలను నిర్ణయించక ముందే ఎపిఇఆర్‌సి డిస్కాంలు ఆ విద్యుత్ కొనుగోలుకు ఒప్పందం చేసుకునేందుకు అనుమతి ఇచ్చింది. సెయిల్ పి1 నుండి 625 మె.వా విద్యుత్ కొనుగోలుకు కమిషన్ షరతులతో కూడిన అనుమతి ఇచ్చిన తీరును గత జనవరి 29న జరిగిన బహిరంగ విచారణలో మేము ప్రశ్నించగా, కొత్తగా విద్యుత్ కొనుగోలు ఒప్పందం చేసుకునే ముందు తమ అనుమతి పొందాలని గత కమిషన్ ఆదేశం జారీ చేసిందని, ఆ ఆదేశం చట్ట విరుద్ధమైనదని కమిషన్ చైర్మన్ జస్టిస్ సి.వి.నాగార్జున రెడ్డి పేర్కొన్నారు. అయితే, ఆ ఆదేశం ఉన్నది గనుక దాని ప్రకారం 'సెయిల్' నుండి విద్యుత్ కొనుగోలుకు షరతులతో కూడిన అనుమతి ఇచ్చామని ఆయన చెప్పారు. గత కమిషన్ ఇచ్చిన ఆదేశం చట విరుద్ధమైనపుడు, ప్రస్తుత కమిషన్ దానిని పాటించకుండా, విద్యుత్ కొనుగోలు ఒప్పందం చేసుకునేందుకు కమిషన్‌లో ముందస్తు అనుమతి డిస్కాంలకు అవసరం లేదని ఆదేశం ఇచ్చేందుకు అడ్డంకి ఏమీ లేదు. డిస్కాంలు కమిషన్‌లో పిపిఎ, సంబంధిత ప్రాజెక్టు పెట్టుబడి వ్యయం, చార్జీలు, ఆ విద్యుత్ అవసరాన్ని వివరిస్తూ, సంబంధిత పత్రాలతో పిటిషన్ దాఖలు చేసినపుడే, కమిషన్ వాటిని తన వెబ్‌సైట్లో ఉంచి, ఆసక్తిగల వారి నుండి నివేదనలను ఆహ్వానించి, వాటిపై బహిరంగ విచారణ జరిపి, ఉత్తర్వులు ఇచ్చే విధానం 25 ఏళ్ళుగా అమలు జరుగుతున్నది. సెయిల్, సెకి వ్యవహారాలు దానికి విరుద్ధంగా ఉన్నాయి. 'సెకి' వ్యవహారానికి సంబంధించిన పత్రాలను, ఒప్పందాలను బహిర్గతం చేయకుండా, బహిరంగ విచారణలు జరపకుండా కమిషన్ పారదర్శకత, జవాబుదారీతనం, ప్రజల భాగస్వామ్యం సూత్రాలకు తిలోదకాలిచ్చింది. చార్జీలు, ట్రూఅప్ క్లెయిములపై తప్ప మిగిలిన అంశాలపై బహిరంగ విచారణలు అవసరమని చట్టంలో లేదని తన పత్రికా పకటనలో పేర్కొన్న కమిషన్ 25 ఏళ్ళుగా ఎపిఇఆర్‌సి అనుసరిస్తున్న విధానాలను విస్మరిస్తున్నది. విద్యుత్ చట్టం-2003 ప్రకారం తన అధికారాలను వినియోగించేటపుడు, విధులను నిర్వర్తించేటపుడు, రాష్ట్ర కమిషన్ పారదర్శకత ఉండేటట్లు చూడాలి (సెక్షన్ 86(3)). కేంద్రంలో మోడీ ప్రభుత్వం, రాష్ట్రంలో జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం అనుసరిస్తున్న ఆశ్రిత పెట్టుబడిదారీ విధానంలో అదానీ గ్రూపుకు ఎడాపెడా ప్రయోజనాలు చేకూరుస్తున్న, వాస్తవాలను మరుగు పరుస్తున్న, అక్రమాలపై వస్తున్న ఆరోపణలపై విచారణకు చర్యలు తీసుకోకుండా దాటవేస్తున్న నేపథ్యంలో 'సెకి' వ్యవహారంలో ఎపిఇఆర్‌సి వ్యవహరించిన తీరును చూడాలి.

/వ్యాసకర్త విద్యుత్ రంగ నిపుణులు/

సందర్భం

ఏయూ తెలుగు శాఖకు వన్నె తెచ్చిన ప్రొ॥ జర్రా



ఆంధ్రా యూనివర్శిటీకి ఇటు ఆంధ్రా-ఒరిస్సా సరిహద్దుల నుంచి నిత్యం జనం వస్తుంటారు. అటు గోదావరి పరీవాహక అటవీ ప్రాంతాల నుంచి ఆదివాసీ విద్యార్థి సందర్శకుల తాకిడి కూడా వుంటుంది. వీరందరికీ ఆచార్య జర్రా అప్పారావు అందుబాటులో వుంటారు. పరిశోధనా పరంపరలో భాగంగా కొందరు, జనజీవన సమస్యల పరిష్కారాల కోసం మరికొందరు ప్రొ॥ జర్రా మార్గదర్శనం కోసం వస్తుంటారు. ఎందుకింత స్పష్టంగా చెప్పాల్సి వస్తుందంటే, ఆదివాసీలను తీర్చిదిద్ది ప్రధాన స్రవంతిలో ప్రతిభావంతులుగా నిలబెట్టాలనే పట్టుదల ఈయనది.

దండకారణ్యంలో పలకాబలపం పట్టి కొండలు, లోయలు దాటి ఆంధ్రా యూనివర్శిటీలో పీజీ పూర్తి చేశారు. ఆ తర్వాత యుజిసి ఫెలోషిప్‌తో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీలో పిహెచ్‌డి పట్టా పొందారు. అనంతరం జీవిక కోసం చాలా ఉద్యోగాలు చేసి చివరిగా ఆంధ్రా యూనివర్శిటీలో ప్రొఫెసర్‌గా స్థిరపడ్డారు. ఇప్పటికి ఈయన సుమారు 72 పిహెచ్‌డి పరిశోధనలకు పర్యవేక్షకులుగా వ్యవహరించారు. ఆదివాసీ విజ్ఞానం, ఢిల్లీ మజిలీలు, వచనవాఙ్మయ వీచిక తదితర గ్రంథాలను వెలువరించారు. వివిధ పత్రికల్లో సుమారు 500 పరిశోధనా వ్యాసాలు ప్రచురితమయ్యాయి. ఆదివాసీ విజ్ఞానం మీద మేజర్ రిసెర్చ్ ప్రాజెక్టు పూర్తి చేశారు. వీటన్నింటి కంటే ముఖ్యమైనది సెంట్రల్ యూనివర్శిటీల తెలుగు శాఖ పాఠ్య ప్రణాళికను తీసుకొని దానిని యుజిసి, యుపిపిఎస్‌సి వంటి జాతీయ పరీక్షలకు అనుగుణంగా మార్చి అమలు చేశారు. ఆయన సాహిత్య సేవ కూడా ప్రత్యేకంగా ప్రశంసించదగినది. ప్రొ॥జర్రా ఆంధ్రా యూనివర్శిటీ తెలుగు విభాగంలో ఆచార్యునిగా అడుగు పెట్టిన తర్వాత యుజిసి ఫెలోషిప్పులు సాధించే విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగింది. యుజిసి పరీక్షలకు వెళ్ళే విద్యార్థులకు ఆయన సంబంధిత పుస్తకాలు సమకూర్చారు. నిపుణులతో శిక్షణ ఇప్పించారు.

ప్రొ॥ జర్రా అప్పారావు తెలుగు విభాగాన్ని వికసింపజేయడంలో వైవిధ్యం ప్రదర్శించారు. ఆయన విభాగాధిపతిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి పాఠ్యాంశాల బోధన, పరిశోధనలు మాత్రమే కాకుండా అనేక ప్రత్యేక సాహిత్య కార్యక్రమాలు నిర్వహించారు. కవిత్రయం నుంచి విశ్వనాథ వరకు, గురజాడ నుంచి ఉద్యమ కవులు, భాషావేత్తల వరకు వున్న ప్రముఖుల సేవలను సమాజానికి తెలియజేస్తున్నారు. అనుబంధ కళాశాలల అధ్యాపకుల్ని, విద్యార్థుల్ని, పరిశోధకుల్ని అందరినీ కలుపుకొని ఈయన ఆంధ్ర విశ్వవిద్యాలయానికి సాహిత్య పరిమళాల్ని అద్దుతున్నారు.

- డా॥ జికెడి ప్రసాద్
9393111740

(నేడు ఆచార్య చందు సుబ్బారావు సాహితీ సాంస్కృతిక సంస్థ 2024 పురస్కారాన్ని ప్రొ॥అప్పారావుకి అందిస్తున్న సందర్భంగా)

కాల్ సెంటర్ల లొల్లి

● ఐవిఆర్ఎస్ ద్వారా సర్వే
● ఫోన్ కాల్స్‌తో విసిగిపోతున్న ప్రజలు

ప్రజాశక్తి- విజయనగరం కోట

'నమస్కారం! ఇటీవల జరిగిన ఎన్నికలపై ప్రజాభిప్రాయ సేకరణ చేపడుతున్నాం. ఇందులో ఏ రాజకీయ పార్టీ ప్రమేయం లేదు. ఎన్నికల్లో మీరు ఏ పార్టీకి ఓటు వేశారు? సైకిల్ గుర్తుకు ఓటు వేస్తే ఒకటి నొక్కండి. ఫ్యాను గుర్తుకు ఓటు వేస్తే రెండు నొక్కండి. హస్తం గుర్తుకు ఓటు వేస్తే మూడు నొక్కండి. మరెవరికైనా ఓటు వేస్తే నాలుగు నొక్కండి' నాలుగు రోజులుగా ఇదీ వరుస. వరుసపెట్టి ఫోన్లు దంచుతున్నాయి. ఉదయం లేచినప్పటి నుంచి సాయంత్రం వరకు ఓటరుకు కనీసం రోజులో నాలుగుసార్లు కాల్‌సెంటర్ల నుంచి ఫోన్లు వస్తున్నాయి. ఎవరికి ఓటు వేశారో చెప్పాలని ఐవిఆర్ఎస్ సర్వేను చేపడుతున్నాయి. ఈ ఫోన్ కాల్స్‌తో జనం విసిగిపోతున్నారు. రాష్ట్రంలో ఈ నెల 13న సార్వత్రిక ఎన్నికలు ముగిశాయి. అభ్యర్థుల భవితవ్యం ఇవిఎంలలో నిక్షిప్తమై ఉంది. ఎన్నికల ముందు ఆయా రాజకీయ పార్టీలు అభ్యర్థులు, ప్రభుత్వ పథకం అమలు తీరు, ఆయా పార్టీల నాయకులు పనితీరు గురించి ఫోన్లకు ఐవిఆర్ఎస్ సర్వే ద్వారా వివరాలు అడిగి తెలుసుకునే వారు. ఎన్నికలు పూర్తయిన తర్వాత కూడా వదలడం లేదు. ఎవరికి ఓటు వేశారో? సర్వే ద్వారా వివరాలను సేకరిస్తున్నారు. ఇప్పటికే ఎన్నికలు ముగియడంతో ఎవరి గెలుపు ధీమాతో వారు ఉన్నారు. అయితే, జిల్లాలో కొన్ని నియోజకవర్గాల్లో గట్టి పోటీ ఉండడంతో ఎవరు గెలుస్తారో తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో, గెలుపు అంచనాల్లో ఇరుపార్టీల నాయకులూ తలమునకలై ఉన్నారు. జిల్లాలో దాదాపు అన్ని నియోజకవర్గాల్లోనూ వైసిపి, టిడిపి, జనసేన కూటమి మధ్య పోటాపోటీ ఉంది. దీంతోపాటు ఇండియా వేదిక అభ్యర్థులు గట్టి పోటీ ఇచ్చేలా ప్రచారం చేశారు. దీంతో, ఎవరి ఓట్లు చీలిపోతాయేనని భయం ప్రధానంగా అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య నెలకొంది. బయటకు 'మేమే గెలుస్తాం' అంటూ మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నా, గట్టి పోటీ నెలకొందనే భావన వచ్చింది. దీంతోపాటు కొన్ని నియోజకవర్గాల్లో క్రాస్ ఓటింగ్ బెడద అభ్యర్థులను తీవ్రంగా ఆలోచించేలా చేస్తోంది. ఈ నేపథ్యంలో నియోజకవర్గంలోని ప్రజలు ఎటువైపు ఓటు వేశారో తెలుసుకునే ప్రయత్నం ఐవిఆర్ఎస్ సర్వే ద్వారా చేస్తున్నారు.



కాల్ సెంటర్‌లో ఉద్యోగులు

మనకెందుకులే!

సర్వే ఫోన్లు రావడంతో పార్టీ కార్యకర్తలు, నాయకులైతే వారు ఏ పార్టీకి ఓటు వేశారో చెప్పగలుగుతున్నారు. అంతే తప్ప మధ్యతరగతి, సామాన్య ప్రజలు, రాజకీయ పార్టీలకు దూరంగా ఉంటున్న వారు మాత్రం వాటిని రిజెక్ట్ చేస్తున్నారు. వారు, వీరు అని కాకుండా ప్రతి ఒక్కరికీ ఫోన్ చేసి అభిప్రాయాలు సేకరించే పనిలో ఉండడం వల్ల సాధారణ ప్రజలెవరూ దానికి సమాధానం చెప్పకుండా కాల్ కట్ చేస్తున్నారు. ఎవరికి ఓటు వేశామో చెప్పడం వల్ల మనం ఓటు వేసిన వారు అధికారంలోకి రాకుంటే, ఫోన్ ద్వారా సమాచారం సేకరించిన వారు రానున్న కాలంలో నష్టం చేసే అవకాశముంటుందని భావించి సర్వే ఫోన్ నంబర్లను రిజెక్ట్ చేస్తున్నారు.

ఓటింగ్ జరిగిన తర్వాత కూడా ఫోన్ల ద్వారా సర్వే చేస్తున్నారంటే పోటీ తీవ్రత ఏ విధంగా ఉందో అర్థమవుతోంది. ఫోన్ల ద్వారా విసిగించేలా సర్వే చేయడమనేది వ్యక్తి స్వేచ్ఛకు భంగం కలిగించడం తప్ప మరొకటి కాదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇటువంటి ఫోన్ కాల్స్‌ను ఎన్నికల సంఘం నియంత్రించాలని పలువురు కోరుతున్నారు.

సిబిఐ కోర్టుకు హాజరైన అవినాష్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు నిందితులు శుక్రవారం నాంపల్లిలోని సిబిఐ కోర్టులో విచారణకు హాజరయ్యారు. కడప ఎంపి వైఎస్ అవినాష్‌రెడ్డి, ఆయన తండ్రి వైఎస్ భాస్కర్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి కోర్టుకు స్వయంగా వచ్చారు. చంచల్‌గూడ జైలులో ఉన్న నలుగురు నిందితులను అధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు. తదుపరి విచారణను న్యాయస్థానం జూన్ 11కి వాయిదా వేసింది.



డోలీలో గర్భిణీని మోసుకెళ్లున్న గ్రామస్తులు

గిరిజనులకు రహదారి కష్టాలు

● డోలీలో గర్భిణిని ఆస్పత్రికి తరలింపు

ప్రజాశక్తి- కుక్కునూరు (ఏలూరు జిల్లా)

ఏలూరు జిల్లా కుక్కునూరు మండలం గొమ్ముగూడెం పంచాయతీ లచ్చిపేట గ్రామస్తులకు డోలీ మోతలు తప్పట్లేదు. ఈ గ్రామానికి చెందిన దూది కోసికి పురిటి నొప్పులు వచ్చాయి. ఆమెను ఐదు కిలోమీటర్లు డోలీపై మోసుకుంటూ గుండుగూడెం ప్రధాన రహదారి వద్దకు తీసుకొచ్చారు. అక్కడి నుంచి అంబులెన్స్‌లో కుక్కునూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కోసి ఆడబిడ్డకు జన్మనిచ్చారు. మెరుగైన వైద్యం కోసం తల్లిని, బిడ్డను భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు పిహెచ్‌సి వైద్యులు శ్రీనివాసరావు తెలిపారు. సకాలంలో ఎఎన్ఎం రజిత స్పందించడంతో తల్లీ బిడ్డా క్షేమంగా ఉన్నారని చెప్పారు. రహదారి సౌకర్యం కల్పించి డోలీ మోత కష్టాలు తప్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఖరీఫ్ సాగుకు కసరత్తు

● 1.85 లక్షల ఎకరాల్లో ప్రణాళిక

ప్రజాశక్తి - కడప ప్రతినిధి



కడప జిల్లా ఖరీఫ్-2024 యాక్షన్ ప్లాన్ సిద్ధ మైంది. జిల్లా వ్యవ సాయశాఖ 1.85,716 లక్షల ఎకరాల్లో పంటల సాగుకు కసరత్తు చేస్తోంది. పచ్చిరొట్ట ఎరువులు, వేరుశనగ, ఇతర పంటల సబ్సిడీ విత్తన పంపిణీ రిజిస్ట్రేషన్లకు శ్రీకారం చుట్టింది. జిల్లాలోని 210 ఆర్‌బికెల ద్వారా విత్తనం, ఎరువుల పంపిణీ ఏర్పాట్లపై దృష్టి సారించింది. 12.243 క్వింటాళ్ల విత్తనాలను అందుబాటులో ఉంచడానికి అవసరమైన కసరత్తు చేస్తోంది. 5,323 క్వింటాళ్ల పిల్లిపెసర, జనుము, జీలగ వంటి పచ్చి రొట్ట ఎరువులను, 5,323 క్వింటాళ్ల కె6, నారాయణి, కె1812, టిసి జిఎస్ రకాల వేరుశనగ విత్తనాలు అందుబాటులో ఉంచనుంది. 76,992 ఎకరాల్లో వరి, 87,037 ఎకరాలలో వరితో కలిపి ఇతర ముతక ధాన్యాలు, 16,894 ఎకరాల్లో కందులు, మినుములు, పెసలు, నువ్వులు వంటి పప్పుధాన్యాలు ఆయిల్‌సీడ్స్ 22,059 ఎకరాలు, పత్తి 59,492 ఎకరాలు, 232 ఎకరాల్లో సుగర్‌కేన్ సాగు చేయనుంది. 73,583 మెట్రిక్ టన్నుల ఎరువుల ప్రతిపాదనలు అందజేసింది. 22,208 టన్నుల యూరియా, 9,226 టన్నుల డిఎపి, 2,791 టన్నుల ఎంఒపి, 3,997 టన్నుల ఎస్ఎస్‌పి, 36,362 టన్నుల కాంప్లెక్స్ ఎరువులను అందుబాటులో ఉంచడానికి అవసరమైన చర్యలు తీసుకుంది. జిల్లాలో 38,739 మెట్రిక్ టన్నుల ఎరువులు నిల్వ ఉండడం గమనార్హం. వీటిని సాగు అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఇండెంట్ పెట్టనుంది. అనంతరం జిల్లాలోని ఆర్‌బికెల ద్వారా రైతులకు సరాఫరా చేయనుంది.

BEFORE THE HONOURABLE DEBTS RECOVERY TRIBUNAL AT VISAKHAPATNAM
O.A. No. 1160 OF 2023

Between:
M/s. HDFC Bank Ltd., Rep. by its Authorized Officer, Office at D.No. 50-96-5, Plot No. 175, Opp. Old SBH, Near NRI Hospital, Seethammadhara, Visakhapatnam. *****APPLICANT**
And:
1. Lakshmi Marthala, Door No:12-164, Janapadu Road, Piduguralla,,near Vasavi Function Hall, Piduguralla, Andhra Pradesh - 522413.
2. Bhaskara Reddy Martala, Door No:12-164, Janapadu Road, Piduguralla, Near Vasavi Function Hall, Piduguralla, Andhra Pradesh-522413. *****DEFENDANTS**

SUBSTITUTED SERVICE OF SUMMONS TO THE DEFENDANTS D.1 to D. 2 BY WAY OF PAPER PUBLICATION

1. Lakshmi Marthala, Door No:12-164, Janapadu Road, Piduguralla,,near Vasavi Function Hall, Piduguralla, Andhra Pradesh - 522413.
2. Bhaskara Reddy Martala, Door No:12-164, Janapadu Road, Piduguralla, Near Vasavi Function Hall, Piduguralla, Andhra Pradesh-522413.

1. WHEREAS the Applicant Bank has instituted an application U/S 19 of the Recovery of Debts Due to Banks and Financial Institutions Act 1993 against you for the recovery of sum mentioned therein together with current and future interest and other reliefs. You are hereby summoned to appear and file written statement before this Tribunal at 10.30 or at such time immediately thereafter according to the convenience of Tribunal on **05/06/2024**. you are directed to collect the copy of the application and annexure on your appearance before the Tribunal.
2. If you intend to file any documents, you may file the same with a list along with the written statement.
3. You should file your registered address and a memo of appearance when you enter appearance before the Tribunal either in person or by a Pleader/Advocate duly instructed.
4. Take notice that, in default of your appearance on the day mentioned herein before, the proceeding will be heard and determined in your absence.

Given under my hand and the seal of this Tribunal on this the **16th Day of MAY, 2024.**

Signature of the Officer
Authorized to issue summons

FORM NO. 14
[See Regulation 33(2)]
OFFICE OF THE RECOVERY OFFICER-I
DEBTS RECOVERY TRIBUNAL
(Department of Financial Services, Ministry of Finance, Government of India)
31-31-21, Narayana Bhavanam, Saibaba Street, Daba Gardens, Visakhapatnam - 530 020.

DEMAND NOTICE
(NOTICE UNDER SECTIONS 25 TO 28 OF THE RECOVERY OF DEBTS & BANKRUPTCY ACT, 1993 AND RULE 2 OF SECOND SCHEDULE TO THE INCOME TAX ACT, 1961)

RC/945/2018 **23-08-2023**

HDFC Bank Limited, Guntur Branch, Guntur District
Versus
Sri Giridhar Sanku

To
(CD-1) Sri Giridhar Sanku, S/o. Madhan Mohan Rao Sanku, Flat No. 105, 2nd Floor, B Block, Gorantla Main Road, Sri Srinivasa Nilayam, Gorantla, Guntur District - 522007.

1. In View of the Recovery Certificate dated 08-02-2018 issued in OA/1013/2016 passed by the Hon'ble Presiding Officer, Debts Recovery Tribunal Vishakhapatnam an amount of **Rs. 14,12,549.02 Ps (Rupees Fourteen Lakhs Twelve Thousand Five Hundred and Forty Nine and Two Paisa Only)** due against you along with pendentellite and future interest @ 10.50% with compounded monthly rests on the above said amount from **28-11-2016** till realization/date of payment and costs of **Rs. 49,571/- (Rupees Forty Nine Thousand Five Hundred and Seventy One only)** has become due against you (Jointly and severally/Fully/ Limited).
2. You are hereby directed to pay the above sum within 15 days of the receipts of the notice, failing which the recovery shall be made in accordance with the Recovery of Debts Due to Banks and Financial Institutions Act, 1993 and Rules there under.
3. You are hereby ordered to declare on an affidavit the particulars of yours assets on or before the next date of hearing.
4. You are hereby ordered to appear before the undersigned on **31.05-2024 at 10.30 a.m.** for further proceedings.
5. In addition to the sum aforesaid, you will be liable to pay:
(a) Such interest as is payable for the period commencing immediately after this notice of the execution proceedings.
(b) All costs, charges and expenses incurred in respect of the service of this notice and other process that may be taken place for recovering the certificate amount.

(Given under my hand and the seal of the Tribunal, Visakhapatnam on this day 23rd August 2023)

(Avasarala Anil)
Recovery Officer
Debts Recovery Tribunal, Visakhapatnam

Form No. 3
(See Regulation-15 (1)(a)]/16(3)
DEBTS RECOVERY TRIBUNAL VISHAKHAPATNAM
Ground & Amp: 1st Floor, 31-31-21, Sai Baba Street, Narayan Bhawan, Dabagardens, Visakhapatnam - 530020
Case No.: O.A. No. 961 OF 2023
Summons under sub-section (4) of section 19 of the Act, read with sub-rule (2A) of rule 5 of the Debt Recovery Tribunal (Procedure) Rules, 1993.

HDFC Bank Limited
And
Sri. Mundru Venkata Subba Rao

To,
Sri. Mundru Venkata Subba Rao S/o. Sri. Varada Rajulu, H. No. 9-7-40, Pujitha Towers, Main Road, Arundalpet, Narasaraopet – 522 601

SUMMONS BY WAY OF PAPER PUBLICATION

WHEREAS, **OA/961/2023** was listed before Hon'ble Presiding Officer/Registrar on **13.05.2024.**
WHEREAS this Hon'ble Tribunal is pleased to issue summons/ notice on the said Application under section 19(4) of the Act, (OA) filed against you for recovery of debts of **Rs. 43,75,218/-** (application along with copies of documents etc. annexed).
In accordance with sub-section (4) of section 19 of the Act, you, the defendants are directed as under:-
(i) to show cause within thirty days of the service of summons as to why relief prayed for should not be granted; (ii) to disclose particulars of properties or assets other than properties and assets specified by the applicant under serial number 3A of the original application; (iii) you are restrained from dealing with or disposing of secured assets or such other assets and properties disclosed under serial number 3A of the original application, pending hearing and disposal of the application for attachment of properties: (iv) you shall not transfer by way of sale, lease or otherwise, except in the ordinary course of his business any of the assets over which security interest is created and/ or other assets and properties specified or disclosed under serial number 3A of the original application without the prior approval of the Tribunal; (v) you shall be liable to account for the sale proceeds realized by sale of secured assets or other assets and properties in the ordinary course of business and deposit such sale proceeds in the account maintained with the bank or financial institutions holding security interest over such assets.
You are also directed to file the written statement with a copy thereof furnished to the applicant and to appear before Presiding Officer/Registrar on **31.05.2024 at 10:30 A.M.** failing the application shall be heard and decided in your absence.
Given under my hand and the seal of this Tribunal on this date: **25-04-2024.**

Signature of the Officer
Authorized to issue summons

Form No. 3
(See Regulation-15 (1)(a)]/16(3)
DEBTS RECOVERY TRIBUNAL VISHAKHAPATNAM
Ground & Amp: 1st Floor, 31-31-21, Sai Baba Street, Narayan Bhawan, Dabagardens, Visakhapatnam - 530020
Case No.: O.A. No. 254 OF 2023
Summons under sub-section (4) of section 19 of the Act, read with sub-rule (2A) of rule 5 of the Debt Recovery Tribunal (Procedure) Rules, 1993.

HDFC Bank Limited
And
M/s Sri Naga Sai Iron and General Stores and others

To,
D1 Sri Naga Sai Iron & General Stores, Rep By Its Proprietor, Sri. Jillellamudi Nageswara Rao, D.No.18-8-1, Opp. Saikrishna Theater, Atchampet Road, Sattenapalli, Guntur - 522403.
D2 Sri Jillellamudi Nageswara Rao, S/o. Sri Chandraiah, D.No.18-8-1, Opp. Saikrishna Theater, Atchampet Road, Sattenapalli, Guntur District, A.P. - 522403.

SUMMONS BY WAY OF PAPER PUBLICATION

WHEREAS, **OA/254/2023** was listed before Hon'ble Presiding Officer/Registrar on **03.05.2024.**
WHEREAS this Hon'ble Tribunal is pleased to issue summons/ notice on the said Application under section 19(4) of the Act, (OA) filed against you for recovery of debts of **Rs. 75,32,816.98/-** (application along with copies of documents etc. annexed).
In accordance with sub-section (4) of section 19 of the Act, you, the defendants are directed as under:-
(i) to show cause within thirty days of the service of summons as to why relief prayed for should not be granted; (ii) to disclose particulars of properties or assets other than properties and assets specified by the applicant under serial number 3A of the original application; (iii) you are restrained from dealing with or disposing of secured assets or such other assets and properties disclosed under serial number 3A of the original application, pending hearing and disposal of the application for attachment of properties: (iv) you shall not transfer by way of sale, lease or otherwise, except in the ordinary course of his business any of the assets over which security interest is created and/ or other assets and properties specified or disclosed under serial number 3A of the original application without the prior approval of the Tribunal; (v) you shall be liable to account for the sale proceeds realized by sale of secured assets or other assets and properties in the ordinary course of business and deposit such sale proceeds in the account maintained with the bank or financial institutions holding security interest over such assets.
You are also directed to file the written statement with a copy thereof furnished to the applicant and to appear before Presiding Officer/Registrar on **31-05-20224 at 10:30 A.M.** failing the application shall be heard and decided in your absence.
Given under my hand and the seal of this Tribunal on this date: **25-04-2024**

Signature of the Officer
Authorized to issue summons

Form No. 3
(See Regulation-15 (1)(a)]/16(3)
DEBTS RECOVERY TRIBUNAL VISHAKHAPATNAM
Ground & Amp: 1st Floor, 31-31-21, Sai Baba Street, Narayan Bhawan, Dabagardens, Visakhapatnam - 530020
Case No.: O.A. No. 1111 OF 2023
Summons under sub-section (4) of section 19 of the Act, read with sub-rule (2A) of rule 5 of the Debt Recovery Tribunal (Procedure) Rules, 1993.

HDFC Bank Limited
And
M/s. Mutcharla Constructions Pvt Ltd & another

To,
D1 M/s. Muthcarla Constructions Pvt. Ltd. represented by its Managing Director Sri. Mutcharla Srinivasa Rao S/o. Sri. Ragavaiah Veera, D. No. 34-85/1, Near DAV Public School, Chaitanyanagar, Ibrahimpatnam, Vijayawada – 521 456
D2 Sri. Mutcharla Srinivasa Rao S/o. Sri. Ragavaiah Veera, Flat No. 401, A-Block, Sagarika Residency, Opp. KGK Kalyana Mandapam, Dhanalakshmipuram, Chintareddypalem, Nellore – 524 002

SUMMONS BY WAY OF PAPER PUBLICATION

WHEREAS, **OA/1111/2023** was listed before Hon'ble Presiding Officer/Registrar on **03.06.2024.**
WHEREAS this Hon'ble Tribunal is pleased to issue summons/ notice on the said Application under section 19(4) of the Act, (OA) filed against you for recovery of debts of **Rs. 54,12,267.99/-** (application along with copies of documents etc. annexed).
In accordance with sub-section (4) of section 19 of the Act, you, the defendants are directed as under:-
(i) to show cause within thirty days of the service of summons as to why relief prayed for should not be granted; (ii) to disclose particulars of properties or assets other than properties and assets specified by the applicant under serial number 3A of the original application; (iii) you are restrained from dealing with or disposing of secured assets or such other assets and properties disclosed under serial number 3A of the original application, pending hearing and disposal of the application for attachment of properties: (iv) you shall not transfer by way of sale, lease or otherwise, except in the ordinary course of his business any of the assets over which security interest is created and/ or other assets and properties specified or disclosed under serial number 3A of the original application without the prior approval of the Tribunal; (v) you shall be liable to account for the sale proceeds realized by sale of secured assets or other assets and properties in the ordinary course of business and deposit such sale proceeds in the account maintained with the bank or financial institutions holding security interest over such assets.
You are also directed to file the written statement with a copy thereof furnished to the applicant and to appear before Presiding Officer/Registrar on **31-05-2024 at 10:30 A.M.** failing the application shall be heard and decided in your absence.
Given under my hand and the seal of this Tribunal on this date: **25-04-2024.**

Signature of the Officer
Authorized to issue summons

కెన్ ఫిన్ హోమ్స్ లిమిటెడ్
CanFinHomes Ltd (Sponsor: CANARA BANK) HOME LOANS ✦ DEPOSITS Translating Dreams into Reality
CIN No.L85110KA1987PLC008699
డి.నెం.4-1-1, గాయత్రి ప్లాజా, మొదటి అంతస్తు, కొరిటెపాడు మెయిన్ రోడ్, గుంటూరు-522007.
ఫోన్: 0863-2333064, సెల్: 7625079146,
ఇ-మెయిల్: guntur@canfinhomes.com

స్వాధీనత ప్రకటన (రూల్ 8(1)) (స్థిరాస్తి కొరకు)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు 2002లోని క్రింద **కెన్‌ఫిన్ హోమ్స్ లిమిటెడ్** యొక్క అధీకృత అధికారిగా దిగువ సంతకందారునకు సంక్రమించిన అధికారములను వినియోగిస్తూ సదరు నోటీసు అందిన తేది నుండి 60 రోజులలోపు నోటీసులో పేర్కొనబడిన బకాయి **రూ. 29,89,599/- (అక్షరాల ఇరవై తొమ్మిది లక్షల ఎనభై తొమ్మిది వేల ఐదు వందల తొంభై తొమ్మిది రూపాయలు మాత్రమే)** మరియు తిరిగి చెల్లించే వరకు వడ్డీతో సహా నోటీసు అందిన తేది నుండి 60 రోజులలోగా చెల్లించవలసిన **ఋణగ్రహీత: శ్రీమతి ఇందుకూరి మాధురి, భర్త: శ్రీ ఇందుకూరి నాగరాజు మరియు సహ-ఋణగ్రహీత: శ్రీ ఇందుకూరి నాగరాజు, తండ్రి: ఇందుకూరి సుబ్బరాజు** గార్లను కోరుతూ **తేది.05.03.2024**న **డిమాండ్ నోటీసు** జారీచేశారు.

ఋణగ్రహీతలు సొమ్మును తిరిగి చెల్లించుటలో విఫలమైనందున ఋణగ్రహీతలకు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా ప్రకటించునది ఏమనగా సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 నందలి రూల్ 8తో కలిపి చదువుకొనవలసిన సదరు యాక్ట్ యొక్క సెక్షన్ 13(4) క్రింద తనకు సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ దిగువ సంతకందారు **తేది.17.05.2024**న దిగువ వివరించిన ఆస్తిని **స్వాధీనత** తీసుకొన్నారు.

ఋణగ్రహీతలు సెక్యూర్డు ఆస్తుల విమోచనం కొరకు గడువు లభ్యతపై సదరు చట్టంలోని సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (8)లోని నిబంధనలు గమనించవలెను.

సాధారణ ప్రజానీకానికి మరియు ముఖ్యంగా ఋణగ్రహీతలకు ఇందుమూలముగా హెచ్చరించునది ఏమనగా సదరు ఆస్తితో ఎట్టి లావాదేవీలు జరుపరాదు మరియు సదరు ఆస్తికి సంబంధించిన ఎట్టి లావాదేవీలైన **రూ. 29,89,599/- (అక్షరాల ఇరవై తొమ్మిది లక్షల ఎనభై తొమ్మిది వేల ఐదు వందల తొంభై తొమ్మిది రూపాయలు మాత్రమే)** మరియు వడ్డీ **కెన్ ఫిన్ హోమ్స్ లిమిటెడ్** వారి ఛార్జీకి లోబడి ఉంటాయి.

స్థిరాస్తి వివరములు

గుంటూరు జిల్లా, నల్లపాడు సబ్-జిల్లా, గుంటూరు మునిసిపల్ కార్పొరేషన్ ఏరియాలోని నల్లపాడుగ్రామం, గుంటూరు మునిసిపల్ డి.నెం.255-1, సిటీ ప్లానర్ ఇచ్చిన ఎండార్స్‌మెంట్ వైడ్ టిఎస్ఎ నెం.112726/2019-20/జి, ఎఫ్ఎల్ఆర్ నెం.879/2019, తేది. 04-09-2019 ప్రకారం నల్లపాడు గ్రామంలో ఎ.1.75 సెంట్లు, గుంటూరు సిటీలోని డి.నెంలు.255, 256, సమతా నగర్, రెండవ లైన్‌లో, డోర్ నెం.2-14-259/83/27లో ఉన్న 533.33 చ॥గ॥ లేదా 445.93 చ॥మీ॥ల స్థలమునకు **హద్దులు: తూర్పు:** డా కొడాలి రాధాకృష్ణ గారికి చెందిన ఆస్తి-80'-0", **దక్షిణం:** 30 వెడల్పు రోడ్డు-60'-0", **పడమర:** చేబ్రోలు నరేంద్ర గారికి చెందిన ఆస్తి-80'-0", **ఉత్తరం:** కె నాగేశ్వరరావు & ఇతరులకు చెందిన ఆస్తి-60'-0".
పై హద్దుల మధ్య 533.33 చ॥గ॥ లేదా 445.93 చ॥మీ॥ల స్థలంలో అవిభాజ్యపు, అనిర్ధిష్టపు వాటా భూమి 40.30 చ॥గ॥ లేదా 33.69 చ॥మీ॥ల స్థలంతో పాటు డబుల్ బెడ్‌రూమ్, కెఎస్ సాయి స్మరన్ అపార్ట్‌మెంట్‌లోని మూడవ అంతస్తులో గల ఫ్లాట్ నెం.401నకు **హద్దులు: తూర్పు:** లిఫ్ట్ & ఓపెన్ టు స్కై, **దక్షిణం:** ఓపెన్ టు స్కై, **పడమర:** ఓపెన్ టు స్కై, **ఉత్తరం:** కామన్ కారిడార్ & స్టెయిర్‌కేస్.

తేది : 17.05.2024 **సం/- అధీకృత అధికారి**
ప్రదేశం : గుంటూరు **కెన్ ఫిన్ హోమ్స్ లిమిటెడ్**

Form No. 3
(See Regulation-15 (1)(a)]/16(3)
DEBTS RECOVERY TRIBUNAL, VISHAKHAPATNAM
Ground & 1st Floor, 31-31-21, Sai Baba Street, Narayan Bhawan, Dabagardens, Visakhapatnam- 530 020
Case No.: O.A. No. 543 OF 2020
[Summons under sub-section (4) of section 19 of the Act, read with sub-rule (2A) of rule 5 of the Debt Recovery Tribunal (Procedure) Rules, 1993]
ICICI Bank Limited
AND
Kovvuri Gangi Reddy

To,
1. Kovvuri Gangi Reddy, S/o Subba Reddy, H. No.1-126/A, Mulalanka Mupparagudem, Krishna District, Andhra Pradesh- 521 344 and others.
2) M/s. Nexus Feeds Ltd, Represented by Managing Director, Mr. G. Ramakrishna Reddy, S/o Satyanarayana Reddy, R. No. 223/2B, Opp: Saibaba Temple, Seesali- 534 237, West Godavari District.
3) G. Ramakrishna Reddy, S/o Satyanarayana Reddy, R. No. 223/2B, Opp: Saibaba Temple, Seesali- 534 237, West Godavari District.
4) Mr. G. Venkata Reddy, S/o Satyanarayana Reddy, R. No. 223/ 2B, Opp: Saibaba Temple, Seesali- 534 237, West Godavari District.
5) G. Srirama Reddy, S/o Satyanarayana Reddy, R. No. 223/2B, Opp: Saibaba Temple, Seesali- 534 237, West Godavari District.
6) Goluguri Radha, R. No. 223/2B, Opp: Saibaba Temple, Seesali- 534 237, West Godavari District.
7) Venkata Subrahmanyan Voleti, R. No. 223/2B, Opp: Saibaba Temple, Seesali- 534 237, West Godavari District.
8) Mr. Suryanarayana Vankadaru R. No. 223/2B, Opp: Saibaba Temple, Seesali- 534 237, West Godavari District.
9) Pitani Srinivasa Rao, S/o Krishna, D. No. 1-94, Mulaupara Gudem, Pedalanka, Krishna District- 521 344.
10) Bokka Srinivasa Rao, S/o Ramakrishna, D. No. 9-37, Mulalanka, Pedalanka, Krishna District- 521 344
11) Bokka Vinayaka, S/o Satyanarayana, D. No.10-45/1, Mulalanka, Kalidindi, Krishna District - 521 344.
12) Gudala Pavani, W/o Nagaraju, D. No. 9-90/2, Kukkalavaripalem, Kodamanchili, West Godavari- 534 269
13) Jakkamsetti Sṛinu, S/o Venkata Rao, D. No:1/151B, Mulalanka, Mulauppara Gudam, Pedalanka, Krishna District- 521 344
14) J.T.R Satyanarayana Prasad, S/o Radha Krishna Murthy, D. No.10-1-49/2, Old Super Bazar Road, 9th Ward, Chinarangani Palem, Bhimavaram- 534201, West Godavari District.
15) Ketha Manikyala Rao, S/o Satyanarayana, D. No.1-138-1, Mulaupparagudem, Padamatipalem Kalidindi, Krishna District- 521 344.
16) Kilaparthi Nagaraju, S/o Appala Naidu, D. No. 4-8, Padamatipalem, Mulalanka, Kalidindi, Krishna District- 521 344
17) Mamidisetti Prasad, S/o Mahankali, D. No: 9-36, Satyanarayana Nagar, Mulalanka, Mulauppara Gudem, Pedalanka, Krishna District- 52 1344.
18) Namani Anjaneyulu, S/o Trimurthulu, D. No.1-105, Near Vanthena, Ramakrishnapuram, Mulalanka, Kalidindi, Krishna District- 521 344
19) Nekkanti Ramesh, S/o Venkata Rao, D. No.7-11-19, Narsapuram, West Godavari District.
20) Vempalli Srinivas, S/o Dharma Raju, D. No.3-55, Arugolanu, Tadepalligudem, West Godavari- 534 146
21) Arumilli Venkateswara Rao, S/o Satyanarayana, Mulalanka, Peda Lanka, Kalidindi, Krishna District- 521 344
22) Bokka Jadalu, S/o Anjaneyulu, Mulalanka, Pedalanka, Krishna District- 521 344
23) Karni Mohan Rao, S/o Venkanna, D. No. 2-121, Mulalanka, Kalidindi, Krishna District- 521 344
24) Karni Shyam Chinni, S/o Venkanna, D. No. 2-121, Mulalanka, Kalidindi, Krishna District- 521 344
25) Mutyam Vijaya Raju, S/o Bhaskara Rao, D. No.6-30, Kalla, West Godavari
26) Sarela Peddi Raju, S/o Papa Rao, D. No. 2-130, Mulalanka, Kalidindi, Krishna District- 521 344

SUMMONS BY WAY OF PAPER PUBLICATION

WHEREAS, **OA/543/2020** was listed before Hon'ble Presiding Officer/Registrar on **08.08.2024**
WHEREAS this Hon'ble Tribunal is pleased to issue summons/ notice on the said Application under section 19(4) of the Act, (OA) filed against you for recovery of debts of **Rs. 76,74,193/-** application along with copies of documents etc. annexed).
In accordance with sub-section (4) of section 19 of the Act, you, the defendants are directed as under:-
(I) to show cause within thirty days of the service of summons as to why relief prayed for should not be granted
(ii) to disclose particulars of properties or assets other than properties and assets specified by the applicant under serial number 3A of the original application;
(iii) you are restrained from dealing with or disposing of secured assets or such other assets and properties disclosed under serial number 3A of the original application, pending hearing and disposal of the application for attachment of properties:
(iv) you shall not transfer by way of sale, lease or otherwise, except in the ordinary course of his business any of the assets over which security interest is created and/ or other assets and properties specified or disclosed under serial number 3A of the original application without the prior approval of the Tribunal;
(v) you shall be liable to account for the sale proceeds realized by sale of secured assets or other assets and properties in the ordinary course of business and deposit such sale proceeds in the account maintained with the bank or financial institutions holding security interest over such assets.
You are also directed to file the written statement with a copy thereof furnished to the applicant and to appear before Presiding Officer/Registrar on **08.08.2024** at **10:30 A.M.** failing the application shall be heard and decided in your absence.
Given under my hand and the seal of this Tribunal on this date: **23/04/2024.**

Signature of the Officer
Authorized to issue summons

నేనే రాజ్యాంగం

పదేళ్ల పాలనలో నరేంద్ర మోడీ తీరు

- గత ఐదేళ్లుగా లోక్‌సభకు డిప్యూటీ స్పీకర్ లేరు
- పార్లమెంటులో ప్రతిపక్షాలకు దక్కని గౌరవం
- నియమ, నిబంధనలకు పాతర
- పదేళ్లలో ప్రధాని నుంచి ఒక్క పత్రికా సమావేశమూ లేదు
- ఈ తీరు దేశానికి, రాజ్యాంగానికి మంచిది కాదు
- మేధావులు, నిపుణులు, విశ్లేషకుల ఆందోళన



న్యూఢిల్లీ : రాజ్యాంగాన్ని, రిజర్వేషన్లను రద్దు చేసేందుకు కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదనీ, మూడో సారి కేంద్రంలో అధికారంలోకి వస్తే ఇదే జరుగుతుందని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. దేశంలో ప్రస్తుతం జరుగుతున్న లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ప్రతిపక్షాలు తరచూ ఇవే ఆరోపణలను వినిపిస్తున్నాయి. అయితే, మోడీ ఈ పదేళ్ల పాలనను చూస్తే ప్రతిపక్షాల ఆరోపణలు నిజమేనన్న భావన కలుగుతున్నదని మేధావులు, విశ్లేషకులు, ప్రముఖ జర్నలిస్టులు అంటున్నారు. రాజ్యాంగాన్ని ధ్వంసం చేసేందుకు మోడీ చేస్తున్న ముప్పు స్పష్టమైనదేననీ, ఇందులో ఎలాంటి సందేహం అక్కర్లేదని వారు చెప్తున్నారు. తన దశాబ్ద పాలనలో మోడీ తానే రాజ్యాంగం అన్న విధంగా వ్యవహరించారనీ, నిబంధనలకు పాతరేసి పాలన కొనసాగించారని రాజకీయ విమర్శకులు అంటున్నారు. "ఏ ప్రధానమంత్రీ రాజ్యాంగాన్ని ధ్వంసం చేయరు. కానీ, మోడీ తన చర్యలు, అతని మద్దతుదారుల చర్యల ద్వారా కూడా రాజ్యాంగానికి ముప్పును కలిగించారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో ప్రధాని చాలా కీలకం. అయితే, ఈ పదేండ్ల కాలంలో లోక్‌సభలో, ఆ తర్వాత ఉభయ సభల్లో బిజెపి తన మెజారిటీని చూసుకొని ప్రతిపక్షాలను చిన్నచూపు చూసింది" అని వారు అంటున్నారు. నియమ, నిబంధనలను తుంగలో తొక్కటమేగాక.. ప్రతిపక్షాలను చిన్న చూస్తూ రాజ్యాంగాన్ని ప్రమాదంలోకి నెట్టిన సందర్భాలు మోడీ పాలనలో అనేకం చోటు చేసుకున్నాయని వారు గుర్తు చేస్తున్నారు. ప్రధానిగా మోడీ ప్రజలచే ఎన్నుకోబడిన నాయకుడు కాబట్టి ఆయనపై విమర్శలు, దాడులు చేయకూడదనే బిజెపి శ్రేణులు రూపొందించిన సిద్ధాంతం రాజ్యాంగాన్ని అపహాస్యం చేయటమేనని విశ్లేషకులు అంటున్నారు. గత పదేండ్లలో లోక్‌సభ, రాజ్యసభలో ప్రశ్నోత్తరాల సమయంలో మోడీ ఒక్క ప్రశ్నకు కూడా సమాధానం ఇవ్వకపోవటం గమనార్హం. అయితే, రాజ్యాంగం విషయంలో ప్రధాని ఎంత తక్కువ శ్రద్ధ చూపుతున్నారో ఇది స్పష్టం చేస్తున్నదని అంటున్నారు. ప్రశ్నోత్తరాల సమయం పార్లమెంటరీ ప్రజాస్వామ్యం ఆత్మగా పరిగణించబడుతుంది. ప్రతిపక్షాలు ప్రభుత్వాన్ని ఏ ప్రశ్ననైనా లేవనెత్తవచ్చు. ఇక, మే 2014 నుంచి మోడీ ఒక్క విలేకరుల సమావేశంలో కూడా ప్రసంగించకపోవడం గమనార్హం.

భారత పార్లమెంటరీ ప్రజాస్వామ్య చరిత్రలో డిప్యూటీ స్పీకర్ లేకపోవటం 17వ లోక్‌సభకే చెల్లింది. అయితే, ఇదంతా మోడీ ప్రణాళికేనేనని విశ్లేషకులు అంటున్నారు. పార్లమెంటరీ కన్వెన్షన్ ప్రకారం.. డిప్యూటీ స్పీకర్ పదవిని ప్రతిపక్షానికి ఇవ్వాలి. కాబట్టి బిజెపియేతర పార్టీలలో అత్యధిక సంఖ్యాబలం సాధించిన ప్రతిపక్షాలకు, ప్రత్యేకించి కాంగ్రెస్‌కు డిప్యూటీ స్పీకర్ పదవిని ఇవ్వవలసి ఉంటుంది. ఈ కారణంగానే మోడీ డిప్యూటీ స్పీకర్ ఎంపిక విషయంలో అయిష్టతను వ్యక్తం చేసి ఉండొచ్చని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. "గడచిన పదేళ్లలో మోడీ పార్లమెంటును నడుపుతూ రాజ్యాంగ సారాన్ని ఉద్దేశపూర్వకంగా విస్మరించారు. ఎక్కువ చర్చల కోసం తగిన స్టాండింగ్ కమిటీకి బిల్లులను సూచించే రాజ్యాంగపరమైన లేదా పార్లమెంటరీ స్కీమ్ వాస్తవంగా తొలగించబడింది. కొన్ని చర్యలను ఆమోదించే సమయంలో షార్ట్ కట్‌లు ప్రభుత్వంపై, ముఖ్యంగా ప్రధానిపై ఒకటి కంటే ఎక్కువసార్లు ఎదురుదెబ్బ తగిలేలా చేశాయి" అని చెప్తున్నారు.

రైతుల తీవ్ర నిరసనల నేపథ్యంలో మూడు 'నల్ల' చట్టాలు(సాగు చట్టాలు) ప్రతిపక్షాల నిరసనల నడుమ పార్లమెంటులో ఆమోదం పొందాయి. ఇదేవిధంగా, పార్లమెంట్‌లో జరిగిన గందరగోళాన్ని సద్వినియోగం చేసుకొని మోడీ ప్రభుత్వం అనేక బిల్లులను చట్టాలుగా మార్చింది. లోక్‌సభ, రాజ్యసభ నుంచి చాలా మంది ప్రతిపక్ష సభ్యులను ప్రిసైడింగ్ అధికారులు బయటకు పంపిన తర్వాత కొన్ని ఆమోదించబడటం గమనార్హం. " లోక్‌సభ స్పీకర్, రాజ్యసభ చైర్మెన్ కుర్చీలకు ఉన్న గౌరవాన్ని ప్రధాని మోడీ తగ్గించారు. 17వ లోక్‌సభకు అధ్యక్షత వహించిన ఓం బిర్లా 'కుడివైపు' చూసేవారు. ప్రతిపక్ష నాయకులు సరైన గౌరవం దక్కేది కాదు. సభలో ప్రసంగించేందుకు తగిన అవకాశమూ లభించేది కాదు. ఇది ప్రతిపక్షంలో కీలకంగా ఉన్న నేత రాహుల్ గాంధీ విషయంలో అనేకసార్లు జరిగింది. సభలో బిజెపి ఎంపిలు ఆయనను గేలి చేసే విధానం, మాట్లాడనీయకపోవటం, స్పీకర్ అంతగా కట్టడి చేయకపోవటం వంటివి జరిగాయి. బిజెపికి మెజారిటీ లేని రాజ్యసభను తప్పించేందుకు మోడీ మనీ బిల్లుగా పేర్కొంటూ వివాదాస్పద బిల్లును ఎలా ఆమోదింపజేసుకున్నారో పార్లమెంటరీ ఘట్టాన్ని పరిశీలకులు మరచిపోలేదు. తర్వాత అది మనీ బిల్లు కాదని సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది" అని రాజకీయ విశ్లేషకులు గుర్తు చేశారు. అలాగే, బిజెపి రాజ్యాంగాన్ని కూడా మోడీ పట్టించుకోలేదు. 2019లో బిజెపి అధ్యక్షుడు అమిత్ షా స్థానంలో జె.పి నడ్డాను పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మోడీ నియమించారు. అసలు, బిజెపి రాజ్యాంగంలో వర్కింగ్ ప్రెసిడెంట్ అనే నిబంధనే లేకపోవటం గమనార్హం. "పార్లమెంటరీ ప్రజాస్వామ్యం ప్రభుత్వం, ప్రతిపక్షాల మధ్య చర్చల ద్వారా నడుస్తుంది. ప్రధాని ఎప్పుడూ చర్చను కొనసాగించటంలో ఎటువంటి చొరవ తీసుకోలేదని ప్రతిపక్షాల ఆరోపణ. ప్రధాని తన హయాంలో గుజరాత్‌లో అనుసరించిన దారుణ ప్రజాస్వామ్య పద్ధతులను పార్లమెంటుకు తీసుకురావటం బాధాకరం. ప్రత్యర్థులను తాత్కాలికంగా అసెంబ్లీ నుంచి బహిష్కరించటం, వారు లేనప్పుడు హడావుడిగా శాసన సభను ఆమోదించటం మోడీ హయాంలో గుజరాత్ మోడల్. ఈ 'గుజరాత్ మోడల్' ప్రత్యర్థులను ఫైరింగ్ లైన్‌పైకి తెచ్చి రాజ్యాంగాన్ని దెబ్బతీసింది. వారి ఏకైక తప్పు ఏమిటంటే వారు ప్రభుత్వానికి కుడి వైపున లేకపోవటమే" అని రాజకీయ విశ్లేషకులు గుర్తు చేశారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్.. భారత పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి రాజ్యాంగం ఒక ఫూల్‌ప్రూఫ్ డాక్యుమెంట్ అని సూచించారు. అయితే ఇది అధికారంలో ఉన్న వ్యక్తుల స్వభావం, సమగ్రత, వారు పని చేసే విధానంపై ఆధారపడి ఉంటుందన్నారు. రాజ్యాంగ నిర్మాతల భయాలు నిజమయ్యేలా మోడీ తీరు ఉన్నదని మేధావులు ఆందోళనను వ్యక్తం చేస్తున్నారు. బిజెపి, ప్రధాని విధానాలు, తీరుతెన్నులు భారత్ వంటి అతిపెద్ద ప్రజాస్వామ్య దేశానికి ఏ మాత్రమూ శ్రేయస్కరం కావని వారు అంటున్నారు.

దారుణంగా దాడి చేశారు : స్వాతి మాలివాల్

న్యూఢిల్లీ : ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ వ్యక్తిగత సహాయకుడు బిభవ్ కుమార్ తనపై దారుణంగా దాడి చేశారని ఆమ్ ఆద్మీ పార్టీ రాజ్యసభ సభ్యురాలు స్వాతి మాలీవాల్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో తెలిపారు. బిభవ్ తనపై విచక్షణారహితంగా భౌతిక దాడికి పాల్పడ్డాడని, సున్నితమైన శరీర భాగాలపై పలుమార్లు కొట్టాడని ఆప్ ఎంపీ ఆరోపించినట్లు పోలీసులు ఎఫ్ఐఆర్‌లో తెలిపారు. 'సిఎం నివాసంలో కూర్చున్న నా వద్దకు బిభవ్ వచ్చి దాడికి దిగాడు. 7-8 సార్లు చెంపపై కొట్టాడు. ఛాతి, కడుపుపై కాలితో తన్నాడు. నన్ను నేను రక్షించుకునేందుకు అతడిని నా కాళ్లతో బలంగా తోసేశా. పరిగెడుతుంటే నా చొక్క పట్టుకుని వెనక్కి లాగాడు. సున్నితమైన శరీర భాగాలపై పలుమార్లు కొట్టాడు. ఎలాగో తన నుంచి తప్పించుకుని బయటకు వచ్చి పోలీసులకు ఫోన్ చేశా" అని స్వాతి వెల్లడించినట్లు పోలీసులు ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు.

గాజాను సర్వ నాశనం చేస్తున్నారు

- ఇజ్రాయిల్ దాడులపై సౌతాఫ్రికా ఆగ్రహం
- రఫాలో దాడులను తక్షణమే నిలిపివేయించండి
- ఐసిజెపై ఒత్తిడి



హేగ్: గాజాను పూర్తిగా తుడిచిపెట్టేయడమే లక్ష్యంగా ఇజ్రాయిల్ తాజాగా రఫాపై దాడులకు తెగబడిందని దక్షిణాఫ్రికా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. రఫాపై దాడులను తక్షణమే నిలిపివేసేలా అంతర్జాతీయ న్యాయ స్థానం (ఐసిజె) జోక్యం చేసుకోవాలని అది కోరింది. గాజాను పూర్తిగా నాశనం చేసే దిశగా ఇజ్రాయిల్ వేస్తున్న చివరి అడుగే రఫాపై దాడి అని, దక్షిణాఫ్రికా పేర్కొంది. గాజా శరణార్థులకు ఉన్న ఒకే ఒక సహాయక శిబిరంపైనా ఇజ్రాయిల్ అత్యంత క్రూరమైన మిలిటరీ దాడులకు దిగడంపై అత్యవసర విచారణ జరపాలన్న దక్షిణాఫ్రికా అభ్యర్థనను అంతర్జాతీయ న్యాయ స్థానం అంగీకరించి గురువారం విచారణ చేపట్టింది. దక్షిణాఫ్రికా లేవనెత్తిన అంశాలపై 24 గంటల్లో సమాధానమివ్వాలని ఐసిజె ఇజ్రాయిల్‌ను ఆదేశించింది. దక్షిణాఫ్రికా న్యాయవాది అదిలా హాషీమ్ మాట్లాడుతూ, ఇజ్రాయిల్ గాజాలో ఊచకోతకు పాల్పడుతోందని జనవరిలోనే నిర్ధారణ అయిందని అన్నారు. ప్రతి గంటకు సగటున ఇద్దరు మహిళలను, నలుగురు పిల్లలను ఇజ్రాయిల్ సైన్యం పొట్టనపెట్టుకుంటోందని చెప్పారు. ఊచకోతను నివారించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఐసిజె ఇంతకుముందు ఇచ్చిన తీర్పును సైతం ఇజ్రాయిల్ బేఖాతరు చేసిందని ఆమె అన్నారు. మరో వైపు గాజా ప్రజలకు ఆహారం, మంచినీరు, మందులు వంటి అత్యవసరాల సరఫరాలను అందకుండా చేస్తూ మానవ విపత్తును సృష్టిస్తోందని అన్నారు. ఖాన్ యూనిస్‌లోని నాజర్ హాస్పిటల్, గాజా సిటీలోని అల్ షిఫా ఆసుపత్రి చుట్టు పక్కల మృతదేహాలను సామూహిక ఖననం చేయడాన్ని ఆమె ఈ సందర్భంగా కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. మరో లాయర్ తెంబెకా ఎంగచుకాయితోబి ఇజ్రాయిల్ నేతల ప్రకటనలు, రెచ్చగొట్టే వ్యాఖ్యలను బట్టి చూస్తే ఇది ఇజ్రాయిల్ ప్రభుత్వం సాగిస్తున్న ఊచకోత తప్ప మరొకటి కాదని స్పష్టమవుతోందని అన్నారు. ఇజ్రాయిల్ చాలా దుర్మార్గంగా దాడులకు తెగబడిందని అన్నారు.

విమాన ప్రయాణికుల రద్దీ పెరిగింది : ఇక్రా

న్యూఢిల్లీ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో దేశీయంగా విమాన ప్రయాణీకుల రద్దీ 40.7-41.8 కోట్లకు చేరుతుందని రేటింగ్ ఏజెన్సీ ఇక్రా అంచనా వేసింది. అదే సమయంలో విమాన సంస్థల ఆదాయాలు 15-17 శాతం పెరుగుతాయని చెప్పింది. ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) అధీనంలోని విమానాశ్రయాలతోపాటు ఢిల్లీ, హైదరాబాద్, కోచి అంతర్జాతీయ విమానాశ్రయాలను నమూనాగా తీసుకుని ఇక్రా ఈ నివేదిక విడుదల చేసింది.

కరోనా తరువాత పెరిగాయి...

ఇక్రా నివేదిక ప్రకారం... కరోనా కంటే ముందు నమోదైన విమాన ప్రయాణాలతో పోలిస్తే 10 శాతం అధికంగా ఫ్లైట్‌జర్నీ చేస్తున్నారు. మార్చి 2024 తో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో 37.6 కోట్ల మంది విమానాల్లో ప్రయాణించారు. విమానాల రద్దీ ఏటా 8-11 శాతం పెరుగుతోంది. 2023 క్యాలెండర్ ఏడాదిలో అంతర్జాతీయ ప్రయాణికుల రద్దీలో భారత్ వాటా 4.2 శాతంగా ఉంది. 2019లోని 3.8 శాతంతో పోలిస్తే అధికం. 2023లో గ్లోబలగా ప్రయాణికుల రద్దీ 96 శాతం పుంజుకుంది.

అదే భారత్‌లో మాత్రం 106 శాతం రికవరీ అయింది. దేశీయంగా కొత్త మార్గాలు, విమానాశ్రయాల సంఖ్య పెరగడంతో ఇది సాధ్యపడినట్లు ఇక్రా తెలిపింది. ఇక్రా కార్పొరేట్ రేటింగ్స్ వైస్ ప్రెసిడెంట్ వినయ్ కుమార్ మాట్లాడుతూ ... విరామం కోసం, వృత్తి వ్యాపార అవసరాల రీత్యా ప్రయాణాలు అధికంగా చేస్తున్నారని అన్నారు.



ప్రచారాన్ని ఆపడానికి ప్రయత్నిస్తున్న పోలీసులను వారిస్తున్న ఎంఎ బేబీ

ఇండియా ఫోరం అభ్యర్థులను గెలిపించండి

- ఢిల్లీ ప్రజలకు సిపిఎం పిలుపు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్య, లౌకిక, గణతంత్ర లక్షణాన్ని కాపాడేందుకు బిజెపికి వ్యతిరేకంగా ఓటు వేయాలని ఢిల్లీ ప్రజలకు సిపిఎం పిలుపునిచ్చింది. ఈ మేరకు శుక్రవారం నాడిక్కడ పటేల్ చౌక్ ప్రాంతంలో బిజెపిని ఓడించేందుకు ఓటు వేయాలని విజ్ఞప్తి చేస్తూ సిపిఎం ఎన్నికల ప్రచారం నిర్వహించింది. ఈ ప్రచారంలో పొలిట్‌బ్యూరో సభ్యులు ఎంఎ బేబీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఢిల్లీలో ఇండియా ఫోరం అభ్యర్థులకు ఓటు వేసి బిజెపిని ఓడించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రస్తుత బిజెపి ప్రభుత్వంపై తమ ఆగ్రహాన్ని ప్రతిబింబిస్తూ చేస్తున్న ప్రచారానికి ప్రజల్లో మంచి స్పందన వస్తోందన్నారు. అయితే ఢిల్లీ పోలీసులు ఏదో ఒక సాకుతో ప్రచారాన్ని ఆపేందుకు ప్రయత్నిస్తున్నారు. పోలీసుల ఒత్తిడికి తలొగ్గకుండా ప్రచారం కొనసాగించారు. ప్రచారంలో పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు రాజేంద్ర శర్మ, అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బెంగళూరులో డెంగీ విజృంభణ

బెంగళూరు : కర్ణాటకలోని బెంగళూరు మహానగరంలో డెంగ్యూ కేసులు అంతకంతకు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో నగరంలో హై అలర్ట్ ప్రకటించినట్లు బృహత్ బెంగళూరు మహానగర పాలిక సంస్థ కమిషనర్ వికాస్ కిషోర్ వెల్లడించారు. డెంగ్యూ వైరస్ విస్తరించకుండా నివారణ చర్యలు ఇప్పటికే చేపట్టినట్లు తెలిపారు. మే 1వ తేదీ నుంచి మే 13వ తేదీ మధ్య డెంగ్యూ కేసులు ఎక్కువ సంఖ్యలో నమోదయ్యాయని చెప్పారు. ఇటీవల నగరంలో భారీ వర్షాలు కురవడంతో పలు ప్రాంతాల్లో నీరు నిల్వ వల్ల డెంగ్యూ వైరస్ వ్యాపించిందన్నారు. ఈ నెల 16న జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా వైరస్ వ్యాప్తిని అరికట్టేందుకు నగర ప్రజలకు అవగాహన కల్పించే చర్యలు చేపట్టినట్టు తెలిపారు. బెంగళూరు మహానగరంలోనే కాకుండా కర్ణాటక అంతటా డెంగ్యూ కేసులు అధికంగా నమోదవుతున్నాయి. ఈ ఏడాది జనవరి 1 నుంచి ఇప్పటి వరకు 2,877 డెంగ్యూ కేసులు నమోదయ్యాయి. గతేడాది ఇదే సమయంలో 1,725 డెంగ్యూ కేసులు నమోదు అయ్యాయి.

నేత కాదు... నీతి అవసరం

- బిజెపి బలం దిగజారుతోంది
- ఇండియా వేదికకు ఆదరణ పెరుగుతోంది
- మత సమీకరణకు కాషాయ పార్టీ ప్రయత్నిస్తోంది
- రాజ్యాంగం, లౌకిక విలువలకు విఘాతం కలుగుతోంది
- బిజెపిని ఎదుర్కొనే సత్తా ప్రాంతీయ పార్టీలకు ఉంది
- 'ది హిందూ' ఇంటర్వ్యూలో సిపిఎం ప్రధాన కార్యదర్శి ఏచూరి



న్యూఢిల్లీ : ఇండియా వేదికలో నరేంద్ర మోడీకి ప్రత్యామ్నాయ నేత ఎవరన్నది ముఖ్యం కాదని, అనుసరించే ప్రత్యామ్నాయ విధానాలే (నీతి) ముఖ్యమని సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అభిప్రాయపడ్డారు. ఇప్పటి వరకూ జరిగిన సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌లో బిజెపి బలపడలేదని, ప్రజలు ఇండియా వేదికకు చేరువ అవుతున్నారని తెలిపారు. ఈ ఎన్నికల్లో బిజెపి బలం పెరిగే అవకాశమే లేదని, వాస్తవానికి అనేక రాష్ట్రాల్లో బిజెపి బలం తగ్గిపోయిందని చెప్పారు. ప్రధాని మోడీ, ఇతర బిజెపి నాయకులు తమ ఎన్నికల ప్రచారంలో ప్రజా సమస్యలను ఏ మాత్రం ప్రస్తావించడం లేదని విమర్శించారు. మతపరమైన సమీకరణ కోసం బిజెపి ఎత్తుగడలు పన్నుతోందని ఆరోపించారు. నాలుగు దశల పోలింగ్ ముగిసిన నేపథ్యంలో 'ది హిందూ' పత్రికకు ఏచూరి ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే...

ప్రజలు మాకు చేరువ అవుతున్నారు

నాలుగు దశల పోలింగ్ తర్వాత ఎన్నికల ఫలితాలు తమకు అనుకూలంగా ఉంటాయని ప్రతిపక్షాలు అభిప్రాయపడుతున్న మాట నిజమే. దీనికి ఓ ప్రాతిపదిక ఉంది. ఓటర్లు పెద్ద ఎత్తున పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి బిజెపికి అనుకూలంగా ఓటు వేయలేదు. గత రెండు ఎన్నికల్లో బిజెపికి ఓటింగ్ అనుకూలంగా జరిగింది. ఇప్పుడది లేదు. ఇది మొదటి సూచిక. ఇక రెండోది... ఎన్నికల ప్రచార సమయంలో ప్రజలు ఎదుర్కొంటున్న రోజువారీ సమస్యలను పక్కనపెట్టి నరేంద్ర మోడీ, బిజెపి నాయకులు లేవనెత్తిన అంశాలేవీ వాస్తవానికి ప్రజలను ఆకర్షించలేదు. ఉదాహరణకు మీ ఆస్తులు గుంజుకొని ముస్లింలకు ధారాదత్తం చేస్తారని, మీ రిజర్వేషన్లు లాక్కొని ముస్లింలకు ఇస్తారని, హిందూ మహిళల మంగళసూత్రాలు తీసుకొని ముస్లింలకు అప్పగిస్తారని... చేసిన ప్రచారాన్ని ప్రజలు పట్టించుకోవడం లేదు. ధరల పెరుగుదల, జీవనోపాధి, రోజువారీ సమస్యలను గురించే వారు మాట్లాడుతున్నారు. 90% మంది ప్రజలు తమ మనుగడ కోసం అప్పులు చేస్తున్నారని మీరు ఊహించగలరా? కుటుంబ పొదుపు బాగా పడిపోయింది. అదే సమయంలో కుటుంబ అప్పు గరిష్ట స్థాయికి చేరింది. ఇవి మనుగడకు సంబంధించిన నిజమైన సమస్యలు. అయితే వీటిని ప్రధాని ప్రస్తావించలేదు. ప్రజా సమస్యలను ప్రధాని పట్టించుకోకపోవడం ప్రతిపక్షాలకు ఉపయోగపడుతోంది. ప్రచారంలో మేము ప్రస్తావిస్తున్న అంశాలతో ప్రజలు ఇండియా వేదికకు బాగా చేరువవుతున్నారు.

బిజెపి బలం తగ్గుతోంది

అనేక రాష్ట్రాల్లో బిజెపి బలం పడిపోతోంది. దక్షిణ భారతదేశంతో మొదలు పెడదాం. 2019 ఎన్నికల్లో కర్నాటకలోని 28 స్థానాల్లో బిజెపి 25 గెలుచుకుంది. అంటే తన బలాన్ని పూర్తి స్థాయిలో కనబరచింది. ఇప్పుడది తగ్గుతుంది. మహారాష్ట్రలో ఆ పార్టీ కొన్ని సీట్లు నష్టపోతుంది. గుజరాత్‌లో సైతం అదే పరిస్థితి. రాజస్థాన్‌లో కచ్చితంగా ఎదురు దెబ్బలు తగులుతాయి. హర్యానాలో కాంగ్రెస్, ఆప్ కలిసి పోటీ చేస్తుండడంతో ప్రతిపక్షాలు లాభపడతాయి. ఉత్తరప్రదేశ్‌లో సైతం బిజెపి కొంత నష్టపోతుంది. బీహార్‌లో 2019లో గెలుచుకున్న స్థానాలను (2019లో ఆ రాష్ట్రంలోని 40 లోక్‌సభ స్థానాల్లో ఎన్డీఏ 39 సీట్లు గెలుచుకుంది) తిరిగి దక్కించుకునే అవకాశాలు లేవు. ఈశాన్య రాష్ట్రాల్లో కూడా కమలదళం బలం తగ్గిపోతుంది. బెంగాల్‌లో గత ఎన్నికల్లో గరిష్ట స్థాయిలో సీట్లు వచ్చాయి. ఇప్పుడు అంతకుమించి వచ్చే పరిస్థితి లేదు.

వారివన్నీ ప్రగల్భాలే

2004లో వామపక్ష పార్టీలు 61 స్థానాలు గెలుచుకొని కీలక పాత్ర పోషించాయి. ఇప్పుడు కొందరు 2004, 2024 మధ్య పోలిక తెస్తున్నారు. కానీ అలా ఉండదు. కానీ రెండు ఎన్నికల మధ్య ఓ సామీప్యత ఉంది. అప్పుడు షైనింగ్ ఇండియా, ఫీల్‌గుడ్ ఫ్యాక్టర్, ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయికి మీలో ప్రత్యామ్నాయం ఎవరు వంటి అంశాల పైన ఎన్నికలు జరిగాయి. ఇప్పుడు వారు అడుగుతున్న ప్రశ్న ఏమిటంటే మోడీకి ప్రత్యామ్నాయం ఎవరు అని. మేము విశ్వగురువులం అయ్యాము, ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేశాము అని వారు చెప్పుకుంటున్నారు. ఇవన్నీ ప్రగల్భాలే. వారి వాదనలేమిటి, వాస్తవ ఫలితమేమిటి అనేదే ప్రజలు చూస్తారు. 2004లో అయినా, 2024లో అయినా అదే ముఖ్యమైన విషయం.

ప్రత్యామ్నాయ విధానాలే ముఖ్యం

మోడీని ఎదుర్కొనే వారు ప్రతిపక్షంలో ఎవరు ఉన్నారని కొందరు ప్రశ్నించవచ్చు. భారత రాజకీయాల్లో ఇలాంటివి సహజమే. 2004లో కూడా ఇదే సమస్య ఎదురైంది. కానీ మీకు డాక్టర్ మన్మోహన్ సింగ్ రూపంలో ఒక ప్రధాని లభించారు. ఆయన ఓ దశాబ్దం పాటు దేశాన్ని నడిపారు. మేము ఏమంటున్నామంటే మీరు ముందుగా మీ ఎంపీని ఎన్నుకోండి. మెజారిటీ ఎంపీలు నాయకుడిని ఎంచుకుంటారు. మోడీకి ప్రత్యామ్నాయం ఎవరు అనేది ముఖ్యమని నేను అనుకోవడం లేదు. నేను తరచూ హిందీలో ఒక మాట చెబుతుంటాను. దేశానికి నేత (నాయకుడు) కాదు. నీతి (విధానాలు) అవసరం.

మత సమీకరణ పనిచేసినా...

ప్రజల రోజువారీ జీవన పరిస్థితులు, వారి ఇబ్బందులే ఈ ఎన్నికల్లో ప్రధాన అంశాలని నేను భావిస్తాను. అయితే వీటిని బీజేపీ పక్కదారి పట్టించింది. హిందూత్వ ఓటును సంఘటితం చేయడం ద్వారా బలాన్ని పెంచుకోవచ్చునన్న ఆశతో మతపరమైన సమీకరణకు ఆ పార్టీ ప్రయత్నిస్తోంది. సమీకరణ పనిచేస్తుంది. కానీ దాని ప్రభావం జీవనోపాధి సమస్యను పూర్తిగా తొలగించలేదు.

ఆ సవాలును ప్రాంతీయ పార్టీలు ఎదుర్కొంటాయి

బిజెపితో నేరుగా పోటీ పడిన సందర్భాల్లో కాంగ్రెస్ సాధించిన విజయాలు నిరుత్సాహకరంగా ఉన్నాయని కొందరు అంటున్నారు. అయితే ఈ సవాలును ఇండియా వేదికలోని ప్రాంతీయ పార్టీలు ఎదుర్కొంటాయి.

బీహార్‌నే తీసుకోండి. అక్కడి ప్రాంతీయ పార్టీ ఆ పని చేస్తోంది. మహారాష్ట్రలో కూడా అక్కడి పార్టీలు బిజెపితో తలపడుతున్నాయి. కర్నాటక, తెలంగాణ రాష్ట్రాల విషయానికి వస్తే కాంగ్రెస్‌ను కర్నాటక కాంగ్రెస్ లేదా తెలంగాణ కాంగ్రెస్‌గా చూడవచ్చు. కొన్ని రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలు ఏ పాత్ర అయితే పోషిస్తున్నాయో అక్కడ కాంగ్రెస్ ఆ తరహా పాత్ర పోషిస్తోంది. అనేక ప్రాంతాల్లో ప్రాంతీయ పార్టీలు, కాంగ్రెస్, వామపక్షాల కలయిక మంచి ఫలితాన్ని ఇచ్చింది.

లౌకిక విలువలను హరిస్తున్నారు

మనది లౌకిక ప్రజాతంత్ర రిపబ్లిక్ అని మన రాజ్యాంగం చెబుతోంది. అది దాని స్వభావం. కానీ లౌకిక ప్రజాతంత్ర రిపబ్లిక్‌లో ప్రధానమంత్రి, ప్రధాని కార్యాలయం, భారత ప్రభుత్వం ఒక మందిర నిర్మాణంలో పూర్తిగా మమేకమైపోవడం మీరు ఎప్పుడైనా చూశారా? తమకు ఇష్టమైన విశ్వాసాలను అనుసరించేందుకు ప్రజలకు రాజ్యాంగం ప్రాథమిక హక్కు కల్పించింది. ప్రభుత్వం ఒక మతాన్ని గురించి ప్రచారం చేయకూడదు. లేదా ఇతరులపై దానిని రుద్దకూడదు. కానీ మన దేశంలో జరుగుతున్నది అదే. లౌకిక విలువలు పూర్తిగా అణచివేతకు గురవుతున్నాయి. లవ్ జిహాద్, గో సంరక్షణ, ఉమ్మడి పౌరస్మృతిపై బిజెపి పాలిత రాష్ట్రాల్లో ఉన్న చట్టాలు పూర్తిగా లౌకికవాద పునాదులపై దాడికి ఉద్దేశించినవి. ప్రజాస్వామ్యాన్నే తీసుకోండి. చార్జిషీటు దాఖలు చేయకుండా జైళ్లలో ఎన్ని సంవత్సరాలు మగ్గిపోవడం లేదు? అసమ్మతినే జాతి వ్యతిరేకతగా పరిగణిస్తే మీ పౌర స్వేచ్ఛలు, ప్రజాస్వామిక హక్కులు ఏమవుతాయి?

రాజ్యాంగాన్ని నీరుకారుస్తున్నారు

రిజర్వేషన్లను నేరుగా మార్చకపోవచ్చు. కానీ ప్రభుత్వ రంగ సంస్థలను, విద్యను ప్రైవేటీకరించడం ద్వారా రిజర్వేషన్ల ప్రభావం లేకుండా చేస్తున్నారు. ఇక ప్రతిపక్ష నేతలను జైలుకు పంపే ధోరణి పెరిగిపోతోంది. ఎన్నికల్లో గట్టి పోటీ ఇవ్వకుండా ప్రత్యర్థులకు ఆదాయపన్ను నోటీసులు ఇస్తున్నారు. ఇదంతా రాజ్యాంగాన్ని నీరుకార్చడమే తప్ప మరొకటి కాదు.

రాహుల్ వ్యాఖ్యలు దురదృష్టకరం

కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఎన్నడూ లక్ష్యంగా చేసుకోలేదని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ వ్యాఖ్యానించడం దురదృష్టకరం. ఆ రాష్ట్రంలో మాకు ప్రత్యర్థిగా ఉన్న యుడిఎఫ్ ముఖ్యమంత్రిపై వ్యక్తిగత దాడులు చేస్తోంది. ప్రజా సమస్యలు, విధానాలపై పోటీ పడితే అర్థం చేసుకోవచ్చు. మాకు ఎంతటి రాజకీయ ప్రత్యర్థులైనప్పటికీ వారిని ఎందుకు అరెస్ట్ చేయలేదని అడగము.

బెంగాల్ వివాదం రాజకీయపరమైనది

బెంగాల్‌లో వామపక్షాలు-కాంగ్రెస్ కూటమికి, తృణమూల్ కాంగ్రెస్‌కు మధ్య నెలకొన్న వివాదం రాజకీయాలకు సంబంధించింది. బెంగాల్‌లో స్థానిక సంస్థల ఎన్నికలు జరిగిన తీరును చూశాము. ప్రజాస్వామ్యం ఖూనీ అయిన తీరును గమనించాం. ఆ ఎన్నికల్లో పెద్ద ఎత్తున హింస, అవినీతి జరిగాయి. దానికి వ్యతిరేకంగా వామపక్షాలు పోరాడాయి. తృణమూల్‌తో కలిసి పోటీ చేయడం ప్రత్యామ్నాయం కాదు. వామపక్షాలు, కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్ కలిసిన మరుక్షణమే బిజెపి బలపడుతుంది. ఎందుకంటే ప్రభుత్వ వ్యతిరేకత మొత్తం ఆ పార్టీకి లాభిస్తుంది. కాబట్టి బెంగాల్‌లో ఇండియా వేదికలో పార్టీలు కలిస్తే లాభపడేది బిజెపియే.

ఢిల్లీ మద్యం కేసులో నిందితురాలిగా ఆప్

- ఇడి అనుబంధ ఛార్జిషీట్

న్యూఢిల్లీ : ఢిల్లీ మద్యం కేసుకు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఆప్‌ను ఇడి నిందితురాలిగా చేర్చింది. ఈ మేరకు శుక్రవారం ఇడి మరో అనుబంధ ఛార్జిషీట్‌ను రౌస్ అవెన్యూ కోర్టులో దాఖలు చేసింది. ఇందులో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, ఆమ్‌ఆద్మీ పార్టీ ని నిందితులుగా పేర్కొంది.

ఈ కేసులో ఇడి దాఖలు చేసిన ఎనిమిదో ఛార్జ్‌షీట్ ఇది. అయితే, ఈ కేసులో కేజ్రీవాల్‌పైనా, ఆప్‌పైనా ఇడి అభియోగాలు మోపడం ఇదే తొలిసారి. ఈ కేసులో ఇప్పటివరకు 18 మందిని ఇడి అరెస్టు చేసింది.

'ఢిల్లీ మద్యం విధానం రూపకల్పనలో కేజ్రీవాల్ కీలక పాత్ర పోషించారు. ఈ స్కామ్‌లో వివిధ వ్యక్తుల నుంచి అందిన రూ. 100 కోట్ల ముడుపులను ఆమ్ ఆద్మీ పార్టీ 2022 గోవా అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి వినియోగించింది. ఆ సమయంలో కేజ్రీవాల్ బస చేసిన ఒక స్టార్ హోటల్ బిల్లులను ఈ కేసుకు సంబంధించిన నిందితుడు చెల్లించినట్లు మా వద్ద సాక్ష్యాలున్నాయి' అని ఇడి తరుపున అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్.వి.రాజు గురువారం సుప్రీంకోర్టుకు తెలిపారు. ఈ క్రమంలోనే కేజ్రీవాల్, ఆప్‌పై ఇడి తాజాగా ఛార్జిషీట్ దాఖలు చేసింది. త్వరలోనే పార్టీకి చెందిన కొన్ని ఆస్తులను అటాచ్ చేసే అవకాశాలు కన్పిస్తున్నాయి.

అరెస్టు పిటిషన్‌పై తీర్పు రిజర్వ్..

మరోవైపు, తనను ఇడి అరెస్టు చేయడాన్ని, జ్యుడీషియల్ కస్టడీని సవాల్ చేస్తూ కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు శుక్రవారం తీర్పు రిజర్వ్ చేసింది. ఈ కేసులో రెగ్యులర్ బెయిల్ కోసం ట్రయల్ కోర్టుకు వెళ్లొచ్చని కేజ్రీవాల్‌కు సూచించింది. లోక్‌సభ ఎన్నికల ప్రచారం నిమిత్తం కేజ్రీవాల్‌కు జూన్ 1వ తేదీ వరకు మధ్యంతర బెయిల్‌ను సుప్రీంకోర్టు మంజూరుచేసిన సంగతి తెలిసిందే. జూన్ 2వ తేదీన ఆయన తిరిగి జైలుకు వెళ్లాలని స్పష్టంచేసింది.

తనను అరెస్టు చేయడాన్ని సవాల్ చేస్తూ కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాలతో కూడిన ధర్మాసనం విచారణ పూర్తి చేసి, తీర్పును రిజర్వు చేసింది. కేజ్రీవాల్ తరపున సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ, ఇడి తరపున సొలిసిటర్ జనరల్ ఎస్.వి.రాజు బెంచ్ ముందు వాదనలు వినిపించారు. 'వాదనలు విన్నాం. తీర్పును రిజర్వు చేశాం. అప్పీల్‌దారు చట్టానికి అనుగుణంగా బెయిల్ కోసం ట్రయల్ కోర్టుకు వెళ్లొచ్చు" అని ధర్మాసనం పేర్కొంది.

రాహుల్‌ను ఆశీర్వదించండి

- రాయబరేలి గడ్డతో వందేళ్ల అనుబంధం
- లోక్‌సభ తొలి ఎన్నికల ప్రచార సభలో సోనియాగాంధీ



ప్రజలకు అభివాదం చేస్తున్న సోనియా గాంధీ, రాహుల్, ప్రియాంక

రాయబరేలి : ఉత్తరప్రదేశ్‌లోని రాయబరేలి తన కుటుంబం లాంటిదని కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ అన్నారు. నియోజకవర్గం ప్రజలు తనను ఆదరించినట్టే తన కుమారుడు రాహుల్ గాంధీని కూడా అక్కున చేర్చుకోవాలని కోరారు. ప్రజల ఆశలను రాహుల్ ఏమాత్రం వమ్ము చేయరని అన్నారు. 2024 లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా తొలిసారి సోనియాగాంధీ రాయబరేలిలో శుక్రవారం నాడు ప్రసంగించారు.

సోనియాగాంధీతో పాటు ఆయన కుమారుడు, రాయబరేలి కాంగ్రెస్ అభ్యర్థి రాహుల్ గాంధీ, కుమార్తె ప్రియాంకగాంధీ కూడా ఈ బహిరంగ సభలో పాల్గొన్నారు. సోనియా మాట్లాడుతూ రాయబరేలితో తనకు, తన కుటుంబానికి ఉన్న అనుబంధాన్ని ప్రస్తావించారు. 'చాలా కాలం తర్వాత మీ మధ్యకు రాగలిగినందుకు ఎంతో సంతోషంగా ఉంది. ఎంపీగా మీకు సేవలందించే అవకాశం నాకు కలిగించారు. నా జీవితంలో ఎప్పటికీ దీన్ని మరిచిపోలేను. గత వందేళ్లుగా ఈ గడ్డతో మా కుటుంబ అనుబంధం వేళ్లూనుకుని ఉంది. ఈ అనుబంధం గంగాజలంలా స్వచ్ఛమైనది. అవధ్, రాయబరేలిలో రైతుల ఆందోళనతో ఈ అనుబంధం మొదలైంది' అని సోనియాగాంధీ పేర్కొన్నారు. రాయబరేలి ప్రజలు, మాజీ ప్రధాని, కీర్తిశేషులు ఇందిరా గాంధీ ద్వారా తాను నేర్చుకున్న పాఠాలే తన పిల్లలైన రాహుల్ గాంధీ, ప్రియాంకగాంధీకి నేర్పానని చెప్పారు. రాయబరేలి ప్రజలకు ఇందిరాగాంధీ హృదయంలో ప్రత్యేక స్థానం ఉండేదని, ఆమె పనితీరును తాను చాలా దగ్గర నుంచి పరిశీలించానని, ఇక్కడి ప్రజలంటే ఆమెకు ఎనలేని అభిమానం ఉండేదన్నారు. ఇందిరాంగాంధీ నుంచి నేర్చుకున్న పాఠాలనే తాను తన పిల్లలకు చెప్పానని తెలిపారు. అందరినీ గౌరవించడం, బలహీనులను పరిరక్షించడం, ప్రజల హక్కులపై జరుగుతున్న అన్యాయాలను ఎదిరించి పోరాడటం, ఎలాంటి భయాలకు తావీయకుండటం వంటి పాఠాలు వారికి నేర్పానని చెప్పారు.

ఎప్పుడూ ఒంటరినని అనుకోలేదు...

రాయబరేలి ప్రజల ప్రేమ కారణంగా తనకు ఒంటరిగా ఉన్నాననే భావన ఎప్పుడూ కలగలేదని సోనియాగాంధీ అన్నారు. 'ఈరోజు నా కుమారుడిని మీ చేతుల్లో పెడుతున్నాను. అతన్ని ఆదరించండి. నన్ను ఎలా ఆదరించాలో నా కుమారుడిని కూడా గుండెల్లో పెట్టుకోండి. రాహుల్ మీ ఆశలను వమ్ము చేయడు' అంటూ సోనియా భావోద్వేగానికి గురయ్యారు. సోనియాగాంధీ 2004 నుంచి వరుసగా నాలుగు సార్లు ప్రాతినిధ్యం వహించారు. ఈ సారి ఆమె రాజ్యసభకు ఎన్నికయ్యారు.

కాషాయ పార్టీకి కఠిన పరీక్షే

- ఐదో విడతలో యుపిలో 14 స్థానాలకు పోలింగ్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కేంద్రంలో అధికారాన్ని ఉత్తరప్రదేశ్ నిర్ణయిస్తుంది. 2014, 2019 ఎన్నికల్లో యుపిలో బిజెపి ఎక్కువ సీట్లను సొంతం చేసుకుంది. రాష్ట్రంలోని మొత్తం 80 లోక్‌సభ స్థానాలకు గానూ 2014 ఎన్నికల్లో 71 స్థానాలను, 2019లో 62 స్థానాలను బిజెపి కైవసం చేసుకుంది. అంటే 2014 కంటే 2019లో 9 స్థానాలు తగ్గాయి. ఈసారి కూడా బిజెపి, ఇండియా ఫోరం నుంచి గట్టి పోటీ ఎదుర్కొంటుంది. ముఖ్యంగా సమాజ్‌వాదీ పార్టీ మెజారిటీ స్థానాల్లో బిజెపికి బలమైన పోటీ ఇస్తుంది. ఈ దశలో కమలం పార్టీ కఠిన పరీక్షను ఎదుర్కొంటోంది.

మరోవైపు, కాంగ్రెస్ కంచుకోటలైన అమేథీ, రాయ్‌బరేలీ స్థానాలకు ఈ దశలోనే ఎన్నికలు జరగనున్నాయి. ఈ నెల 20న యుపిలో 14 స్థానాలకు జరగనున్న ఐదో దశ ఎన్నికలు కీలకంగా మారాయి. ఈ 14 స్థానాల్లో గత ఎన్నికల్లో బిజెపి ఏకంగా 13 స్థానాలను గెలుచుకుంది. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతోపాటు రాజ్‌నాథ్ సింగ్, స్మృతి ఇరానీ సహా ఐదుగురు కేంద్ర మంత్రులు ఈ దశలో బరిలో ఉన్నారు.

రాహుల్ గాంధీ పోటీ నుంచి తప్పుకొని రాయ్‌బరేలీ నుంచి బరిలో నిలిచారు. అమేథీలో కాంగ్రెస్ తరపున కెఎల్ శర్మ కేంద్ర మంత్రి స్మృతి ఇరానీపై పోటీ చేస్తున్నారు. రాయ్‌బరేలీలో రాహుల్ గాంధీపై బిజెపి అభ్యర్థిగా దినేశ్ ప్రతాప్ సింగ్ పోటీలో ఉన్నారు.

ఐదో దశలో ఎన్నికలు జరుగుతున్న స్థానాల్లో లక్నో నుంచి రాజ్‌నాథ్ సింగ్ మూడోసారి పోటీ చేస్తున్నారు. ఆయనపై ఎస్‌పి అభ్యర్థిగా రవిదాస్ మెహరోత్రా బరిలో ఉన్నారు. మోహన్‌లాల్‌గంజ్ నుంచి మరో కేంద్ర మంత్రి కౌశల్ కిశోర్ పోటీ చేస్తుండగా, ఆయనకు ఎస్‌పి అభ్యర్థిగా ఆర్‌కె చౌదరి గట్టి పోటీ ఇస్తున్నారు. జలౌన్ స్థానం నుంచి కేంద్ర మంత్రి భానుప్రతాప్ సింగ్ వర్మ ఆరోసారి విజయం కోసం ప్రయత్నిస్తున్నారు. ఫతేహ్‌పూర్ నుంచి మరో కేంద్ర మంత్రి సాధ్వీ నిరంజన్ జ్యోతి పోటీ చేస్తుండగా, ఆమెకు ఎస్‌పి కీలక నేత నరేశ్ ఉత్తమ్ పటేల్ బలమైన ప్రత్యర్థిగా బరిలో నిలిచారు.

రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారనే తీవ్ర ఆరోపణలు ఎదుర్కొన్న బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ కుమారుడు కరణ్ భూషణ్ కైసర్‌గంజ్ నుంచి పోటీ చేస్తున్నారు. ఆయనపై ఎస్‌పి అభ్యర్థిగా భగత్‌రామ్ మిశ్రా పోటీ చేస్తున్నారు. కౌశంబి నుంచి బిజెపి సిట్టింగ్ ఎంపి వినోద్ సోంకర్‌పై 25 ఏళ్ల యువకుడు పుష్పేంద్ర సరోజ్ పోటీ చేస్తున్నారు. ఇవేకాక ఝాన్సీ, హమీర్‌పూర్, బాండ, బారాబంకి, ఫైజాబాద్, గోండా స్థానాలకు ఐదో దశలో పోలింగ్ జరగనుంది.

వారొస్తే రామమందిరం కూల్చేస్తారు

- యుపిలో విషం గక్కిన మోడీ
- మత విద్వేషజాఢ్యం మరింత తీవ్రం



లక్నో : సార్వత్రిక ఎన్నికల సమరం కీలక దశకు చేరుకున్న క్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆయన హోదాను సైతం మరిచి మత విద్వేష జాఢ్యాన్ని తీవ్రతరం చేశారు. ఉత్తరప్రదేశ్‌లో శుక్రవారం జరిగిన ఎన్నికల ప్రచారసభల్లో ప్రజలను నిట్టనిలువునా చీల్చేలా మత విద్వేష ప్రేరేపిత ప్రసంగాలను మోడీ దట్టించారు.

లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్, ఎస్పీతో కూడిన విపక్ష ఇండియా ఫోరం గెలిస్తే అయోధ్యలో రామమందిరాన్ని బుల్డోజర్లతో కూల్చివేస్తారని సంచలన వ్యాఖ్యలు చేశారు. బారాబంకి ర్యాలీలో ఆయన మాట్లాడుతూ..'ఇండియా' విజయం సాధిస్తే అయోధ్య రాముడు మళ్లీ టెంట్‌లోకి మారతాడని ఆరోపించారు. బుల్డోజర్లను ఎక్కడ నడపాలో ముఖ్యమంత్రి యోగీ ఆదిత్యనాథ్‌ని చూసి తెలుసుకోవాలని వ్యాఖ్యానించారు. యుపిలోని బిజెపి ప్రభుత్వం ముస్లింలను లక్ష్యం చేసుకొని వారి నివాసాలను బుల్డోజర్లతో కూల్చిసేసిన సంగతి తెలిసిందే. బుజ్జగింపు రాజకీయాలకు కాంగ్రెస్, సమాజ్ వాదీ పార్టీలు బానిసలుగా మారాయని మోడీ ఆరోపించారు. లోకసభ ఎన్నికల్లో బిజెపి హ్యాట్రిక్ విజయం సాధిస్తుందని చెప్పారు.

అణ్వాయుధాల తొలి వినియోగ నిషిద్ధ ఒప్పందానికి అమెరికా నో

న్యూయార్క్: అణ్వాయుధాలను ఏ దేశమూ తొలుత వినియోగించరాదన్న దానిపై చైనా ప్రతిపాదించిన ఒప్పందాన్ని అమెరికా తిరస్కరించింది.. పైగా చైనాకు చిత్తశుద్ధి లేదని ఎదురుదాడి చేసింది. బుధవారం రాత్రి అమెరికన్ విదేశాంగ వ్యవహారాల సెనేట్ కమిటీ ముందు అమెరికా విదేశాంగ శాఖ ఉప మంత్రి బోనీ జెన్కిన్స్ మాట్లాడుతూ, చైనా తన వద్ద న్యూక్లియర్ వార్‌హెడ్స్ 500 దాకా ఉన్నాయని, 2030 నాటికి ఇవి వెయ్యికి చేరుకోవచ్చని చెప్పారు.ఈ అంకెలు అమెరికా ప్రభుత్వం ఊహించి చెప్పినవేనని, వీటిని చైనా ఎన్నడూ ధ్రువీకరించలేదు.

భారత వృద్ధి రేటు 7 శాతం

- అంచనాలను సవరించిన ఐరాస

ఐరాస : భారత ఆర్థిక వృద్ధి రేటు అంచనాలను ఐక్యరాజ్య సమితి సవరిస్తూ దాదాపు 7 శాతానికి పెంచింది. ప్రభుత్వ పెట్టుబడులు, ప్రైవేటు వినిమయం పెరగడమే అందుకు కారణమని తెలిపింది. 2024లో భారత్ 6.9 శాతం, 2025లో 6.6 శాతం వృద్ధిరేటును నమోదు చేస్తుందని ఐరాస అంచనా వేసింది. బహిర్గత డిమాండ్ తక్కువగా ఉంటుందని.. దీనివల్ల సరుకుల ఎగుమతిలో వృద్ధి దెబ్బతింటుందని తెలిపింది. అదే సమయంలో ఔషధ, రసాయన ఎగుమతులు బలంగా పుంజుకుంటాయని పేర్కొంది. జనవరిలో 2024 భారత వృద్ధిరేటును ఐరాస 6.2 శాతంగా పేర్కొంది. దాన్ని ఇప్పుడు 0.7 శాతం పెంచడం విశేషం. 2025 అంచనాలను మాత్రం సవరించలేదు. భారత్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం 2023 నాటికి 5.6 శాతం నుంచి 2024లో 4.5 శాతానికి దిగొస్తుందని ఐరాస నివేదిక అంచనా వేసింది. దక్షిణాసియా ప్రాంతవ్యాప్తంగా ఇదే ధోరణి ఉంటుందని తెలిపింది. ద్రవ్యోల్బణం గరిష్ఠంగా ఇరాన్‌లో 33.6 శాతం, మాల్దీవుల్లో అత్యల్పంగా 2.2 శాతంగా నమోదవుతుందని అంచనా వేసింది. బంగ్లాదేశ్, భారత్‌లో ఆహారపదార్థాల ధరలు కొంత తగ్గినప్పటికీ.. ఇంకా అధిక స్థాయిల్లోనే ఉన్నాయని తెలిపింది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ 2024లో 2.7 శాతం, 2025లో 2.8 శాతం వృద్ధిరేటును నమోదు చేస్తుందని ఐరాస అంచనా వేసింది. 2024 అంచనాలను 0.3 శాతం పెంచడం విశేషం. అమెరికా సహా బ్రెజిల్, భారత్, రష్యా వంటి వర్ధమాన దేశాల్లో బలమైన వృద్ధే అంచనాలను పెంచడానికి దోహదం చేసిందని తెలిపింది. అధిక ద్రవ్యోల్బణంతో ఆఫ్రికా, లాటిన్ అమెరికా, కరీబియన్ దేశాలు తక్కువ వృద్ధిరేటుకు పరిమితం కానున్నాయని ఐరాస వెల్లడించింది.

బంధం మరింత బలోపేతం

- చైనా, రష్యా అంగీకారం
- ఉక్రెయిన్ సమస్యకు రాజకీయ పరిష్కారానికి ప్రణాళిక
- పాలస్తీనా సమస్యకు రెండు దేశాల ఏర్పాటే పరిష్కారం
- సంయుక్త ప్రకటన విడుదల



చైనా పర్యటనలో భాగంగా రష్యా అధ్యక్షుడు వ్లదిమిర్ పుతిన్

బీజింగ్ : చైనా, రష్యా మధ్య సహకార బంధాన్ని మరింత బలోపేతం గావించాలని ఇరు దేశాల అధినేతలు నిర్ణయించుకున్నారు. ఇందుకు సంబంధించి పలు ఒప్పందాలపై చైనా అధ్యక్షుడు సీ జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు వ్లదిమిర్ పుతిన్ గురువారం సంతకాలు చేశారు. ఆ తరువాత వారు ఒక సంయుక్త ప్రకటన విడుదలజేశారు. సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని పటిష్టపరచుకోవడం ద్వారా కొత్త శకాన్ని నెలకొల్పేందుకు ఇరువురు నేతలు ప్రతినబూనారు. ద్వైపాక్షిక సంబంధాలను పెంపొందించుకోవాలనే విషయంలో రష్యా,చైనా నిబద్ధతను ఈ సంయుక్త ప్రకటన చాటిచెబుతోంది. ఉక్రెయిన్ సమస్యకు సరైన రాజకీయ పరిష్కారం చూపాలనే దానిపై ఇరు దేశాలు ఏకీభావంతో ఉన్నాయి. పుతిన్ రెండు రోజుల చైనా పర్యటన శక్రవారంతో ముగిసింది. .ఈ సందర్భంగా జిన్‌పింగ్ మాట్లాడుతూ రష్యా, చైనా మధ్య సంబంధాలు స్థిరమైనవి, రెండు దేశాల ప్రజల ప్రాథమిక ప్రయోజనాలే కాకుండా ప్రాతంతీయ, ప్రపంచ శాంతి, సుస్థిరత, శ్రేయస్సులకు ఎంతగానో తోడ్పడతాయని అన్నారు. చైనా, రష్యా రెండూ ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో శాశ్వత సభ్య దేశాలు, అభివృద్ధి చెందుతున్న ప్రధాన మార్కెట్‌లని జిన్‌పింగ్ పేర్కొన్నారు.

చైనా, రష్యా మధ్య దౌత్య సంబంధాలకు 75 ఏళ్లు. రెండు దేశాలు ఈ సందర్భఆన్ని కొత్త శకం ప్రారంభానికి బిందువుగా తీసుకోవాలని, ద్వైపాక్షిక సహకారాన్ని సుసంపన్నం చేసుకోవాలని జిన్‌పింగ్ పిలుపునిచ్చారు. పుతిన్ మాట్లాడుతూ, చైనాతో ద్వైపాక్షిక సహకారాన్ని విస్తరించడం, ఐక్యరాజ్యసమితి, బ్రిక్స్, షాంఘై కో ఆపరేషన్ ఆర్గనైజేషన్ (షాంఘై సహకార కూటమి) వంటి ఫ్రేమ్‌వర్కులలో సన్నిహితంగా కమ్యూనికేట్ చేసుకోవడం, సహకరించుకోవడం, మరింత న్యాయమైన, సమతుల్యతతో కూడిన అంతర్జాతీయ క్రమాన్ని ఏర్పాటు చేసేందుకు రష్యా సిద్ధంగా ఉందని అన్నారు. వాణిజ్యం, ఆర్థికం, ప్రకృతి పరిరక్షణ, తనిఖీ, మీడియా వంటి రంగాలలో సహకారాన్ని పెంపొందించుకునేందుకు సంబంధించిన ఒప్పందాలపై ఇరువురు నేతలు సంతకాలు చేశారు.

పాలస్తీనా- ఇజ్రాయిల్ వివాదానికి తక్షణమే తగు పరిష్కారాన్ని చూపాల్సిన అవసరముందని పుతిన్, జిన్‌పింగ్ ఇద్దరూ చెప్పారు. రెండు దేశాల ఏర్పాటే ఈ సమస్యకు పరిష్కారమని వారు అభిప్రాయపడ్డారు. అంతర్జాతీయ భద్రతా పరిస్థితిపై రెండు దేశాలు ఆందోళన వ్యక్తం చేశాయి. అణ్వాయుధాలు కలిగిన దేశాల మధ్య ప్రత్యక్ష ఘర్షణను నివారించేందుకు సమగ్ర చర్యలు తీసుకోవాలని, అణ్వాయుధాల తొలి ప్రయోగాన్ని నిషేధిస్తూ అణ్వస్త్ర దేశాలన్నీ ఒక ఒప్పందానికి రావాలని వారు సూచించారు. ప్రపంచ వ్యాప్తంగాను, అంతరిక్షంలో క్షిపణి రక్షణ వ్యవస్థ విస్తరణ, సైనిక ప్రయోజనాలకు కోసం వాటిని వినియోగించడానికి అమెరికా యత్నించడంపై ఇరు దేశాలు ఆందోళన వ్యక్తం చేశాయి. అమెరికా అనుసరిస్తున్న సంఘర్షణ విధానాలకు స్వస్తిపలకాలని, ఇతర దేశాల ఆంతరంగిక వ్యవహారాల్లో జోక్యం మానుకోవాలని ప్రాంతీయ ఉద్రిక్తతలను రెచ్చగొట్టే వైఖరిని విడనాడాలని చైనా, రష్యా పిలుపునిచ్చాయి. చైనా లక్ష్యంగా అమెరికా రూపొందించిన ఆసియా పసిఫిక్ వ్యూహాన్ని, ఆకస్ కూటమి ఏర్పాటును తాము గట్టిగా వ్యతిరేకిస్తున్నామని ఇరువురు నేతలు చెప్పారు.

కాకి ఎంగిలి



కాకులపాలెం ప్రభుత్వ పాఠశాలలో ఐదవ తరగతి చదువుతున్న నిఖిత, లిఖిత స్నేహితులు. నిఖిత ఒకరోజు పాఠశాలకు జామకాయను తీసుకువెళ్ళింది. విరామ సమయంలో ఆ జామకాయ చుట్టూ కాగితాన్ని చుట్టి గట్టిగా కొరికి రెండుముక్కలు చేసింది. ఒక ముక్క తినమని లిఖితకు ఇచ్చింది.

'నేను ఎంగిలి తినను' అంది లిఖిత.

'పరవాలేదులే.. ఇది కాకి ఎంగిలే తిను' అంది నిఖిత. 'కాకి ఎంగిలి అంటే?' అని సందేహం వెలిబుచ్చింది లిఖిత. 'ఏమో నాకూ తెలియదు. మన తరగతి పిల్లలు అనుకుంటూ ఉంటే విన్నాను. సత్యం మాష్టారును అడిగి తెలుసుకుందాం పద' అంది నిఖిత.

ఇద్దరూ కలిసి సత్యం మాష్టారు దగ్గరికి వెళ్లి 'కాకి ఎంగిలి అంటే ఏమిటి మాష్టారు?' అని అడిగారు. 'మంచి ప్రశ్న వేశారు పిల్లలూ 'ఎంగిలి' అంటే 'తినగా వదిలిన పదార్థం'. అలాంటి పదార్థం తినడం వల్ల సూక్ష్మ క్రిములు మన శరీరంలోకి చేరి వ్యాధులు సంక్రమిస్తాయి. 'కుక్క ముట్టిన కుండ మైల కుండ' అంటారు. ఎందుకంటే అది అశుద్ధం తింటుంది. అందువల్ల దాని నోటి చుట్టూ అనేక రోగ కారక క్రిములు ఉంటాయి. ఆహారాన్ని తినేటప్పుడు నాలుకతో నాకుతూ తినడం వల్ల ఆ ఆహారం అంతటికీ సూక్ష్మ క్రిములు వ్యాపిస్తాయి. కుక్క ముట్టుకున్న ఆహారం మనం తింటే రోగాల బారిన పడతాం. అదేవిధంగా 'చిలక్కొట్టు' అంటాం. అంటే చిలుక తిని వదిలేసిన పండు అని అర్థం. ఇది చాలా తియ్యగా ఉంటుంది. ఆ పండును శుభ్రంగా కడుక్కుని తినవచ్చు. ఇక కాకి విషయానికి వస్తే కాకి ఒక్కొక్క మెతుకును ముక్కుతో తీసుకుని తింటుంది. అందువల్ల ఆహారం మొత్తం పాడవదు. కాకి ముట్టుకున్న కొద్దిపాటి ఆహారాన్ని పక్కకు తీసేసి, మిగిలినది మనం తినవచ్చని పెద్దలు చెప్పిన మాట. అలా అప్పటి నుంచి కాకి ఎంగిలి అనే పలుకుబడి వాడుకలోకి వచ్చింది. అంటే ఆ పదార్థం ఎంగిలి కాలేదు, తినవచ్చు అనే సందర్భంలో ఈ పలుకుబడిని ఉపయోగిస్తున్నారు. ఇదర్రా, పిల్లలూ.. కాకి ఎంగిలి అంటే' అన్నారు మాష్టారు. లిఖిత సందేహం తీరింది. నిఖిత ఇచ్చిన జామకాయ ముక్కను తీసుకుని ఎంతో ఇష్టంగా తిన్నది.

- కాశీ విశ్వనాథం పట్రాయుడు,
94945 24445.

చెట్లు


పండ్లను ఇచ్చేవి చెట్లు
కాయలను ఇచ్చేవి చెట్లు
పూలను ఇచ్చేవి చెట్లు
ఔషధాలు చేయటానికి కావాలి చెట్లు
ఇవాల్టి చెట్లు
రేపటికి మెట్లు
పచ్చదనానికి మరో పేరు చెట్లు
నరకకండి చెట్లు
నాటండి మొక్కలు
మనకి బతుకుతెరువు చెట్లు
నీడను ఇచ్చేవి చెట్లు
గృహంలో ద్వారాల చెట్లు
గురువు చేతిలో బెత్తం చెట్లు
మనకు వాయువుని ఇచ్చేవి చెట్లు!



- చెరుకూరి కార్తీక,
9వ తరగతి,
అరవింద మోడల్ స్కూలు,
మంగళగిరి.







బొమ్మలు



కుత్తుం అమృత,
8వ తరగతి,
సత్య సాయి విద్యా విహార్,
రామకృష్ణాపురం,
పలాస మండలం,
శ్రీకాకుళం జిల్లా.



ఫాతిమాన్నీసా,
1వ తరగతి,
అరవింద
హైస్కూలు,
కుంచనపల్లి.



గమనిక

వేసవి సెలవుల్లో పిల్లలకు తోడుగా ప్రతిరోజూ 'వేసవి విడిది' ముస్తాబై వస్తోంది. విద్యార్థినీ విద్యార్థుల రచనలను ఆహ్వానిస్తోంది. కథలు, కవితలు, బొమ్మలు, సెలవుల్లో మీ అనుభవాలు, ప్రయాణ విశేషాలు, ఇతరత్రా కబుర్లు మెయిల్‌కి లేదా
వాట్సాప్ నెం : 8332925496కి పంపండి.
మెయిల్ ఐడీ : chinnaarips@gmail.com
- ఎడిటర్


కన్ను తెరవనివ్వని కర్కశత్వం!

ఎన్ని దశాబ్దాలు గడిచినా, ఎంత పురోభివృద్ధి సాధించినా చాలాచోట్ల లింగ వివక్ష కనిపిస్తూనే ఉంది. చదువుకున్న వారు, చదువుకోని వారు.. అన్న తేడా లేదు. ఇంట్లో మొదటిసారి ఆడపిల్ల పుడితే కలిగే సంతోషం కన్నా, రెండో కాన్పులో ఏ బిడ్డ పుడుతుందో అన్న బెంగ, పైకి చెప్పకున్నా లోలోన మదన పడేవారు ఎంతోమంది. ఈ ఆతృతను, అవసరతను సొమ్ము చేసుకునే వారు ఎంతోమంది గుమ్మంలోనే ఎదురవుతారు. మగబిడ్డ కోసం ఎదురుచూసే కుటుంబాలే ఆదాయ వనరులుగా చేసుకున్న వ్యవస్థలు ఈ మధ్య కాలంలో అనేకం పుట్టుకొచ్చాయి. అలా హర్యానా రాష్ట్రంలో దశాబ్దకాలంగా లింగనిర్ధారణ పరీక్షల బ్లాక్ మార్కెట్ విస్తృతమైంది. ఈ పరీక్షల ఫలితంగా అక్కడ లింగ నిష్పత్తిలో గణనీయమైన మార్పులు వచ్చాయి. ఆందోళన చెందాల్సిన విషయమేమంటే చట్టవిరుద్ధమైన ఈ పనికి పూనుకున్న వారెవరూ దోషులుగా తేలడం లేదు. ఎన్నికల ముంగిట్లో ఉన్న ఆ రాష్ట్రంలో పాలకుల కుయుక్తులకు ప్రాణాలు కోల్పోతున్న ఎందరో ఆడబిడ్డల వ్యథాభరిత గాథ ఇది!

పాతగుడ్డలో చుట్టి, చెత్తకుప్పలో విసిరేసిన ప్రాణం లేని పసికందుల దృశ్యాలు అక్కడ కోకొల్లలు. కుక్కలు ఈడ్చుకెళ్లి, కోతులు ఎత్తుకు పోయే నెత్తుటిబిడ్డల ఆనవాళ్లు అక్కడ తరచూ కనిపిస్తాయి. ఎంత వెదికినా ఆ బిడ్డల ఆచూకీ ఎవరికీ తెలియదు. కావాలని వదిలించుకున్న బిడ్డ పక్కన ఏ ఆనవాళ్లు ఉంచని తల్లిదండ్రులు అక్కడ ఎంతోమంది. అయితే బలవంతం మీదో, బెదిరించో, భయపెట్టో పురిట్లో బిడ్డను పురిట్లోనే చంపేసే కర్కశత్వానికి బలయ్యేది పసిపాపే కాదు, కడుపులో పడ్డప్పటి నుంచి, బిడ్డ ప్రతి శ్వాసకు స్పందించిన ప్రతి తల్లీ అందుకు పెద్ద మూల్యం చెల్లించుకుంటోంది. ఆ తల్లుల మౌన రోదన ఎవరూ కొలవలేనిది.

సోనీ (28) రోహతక్‌లో నివసిస్తోంది. చదువుకోలేదు, ఉపాధి లేదు. ఏవిధమైన ఆసరా లేదు. అప్పటికే ఇద్దరు ఆడబిడ్డలకు తల్లి అయిన సోనీ మూడోసారి కాన్పులో ఎంతో ఒత్తిడి భరించింది. కడుపులో ఉండగానే ఆ బిడ్డను చంపేయమని భర్త, అత్తమామల నుంచి ఒత్తిడి మొదలైంది. దీంతో, ఆమె మానసికంగా, శారీరకంగా కుంగిపోయింది. అయినా అబార్షన్‌కు ఒప్పుకోకుండా పండంటి బిడ్డకు జన్మనిచ్చింది. ఇప్పుడా బిడ్డకు ఆరు నెలలు. 'అప్పటి సంఘటనలు ఇప్పుడు గుర్తొచ్చినా నా శరీరం నీరుకారిపోతుంది. ఆ రోజు నేను గట్టిగా నిలబడకపోతే, బిడ్డను కడుపులోనే చంపేసుకోవాల్సి వచ్చేది. ఏ తల్లికీ ఇంత కష్టం రాకూడదు' అంటూ తన ముద్దులొలికే మూడో చిన్నారిని గట్టిగా హత్తుకుని చెమర్చిన కళ్లతో సోనీ చెబుతున్నప్పుడు ఎందరో తల్లుల ఆవేదన కనిపిస్తుంది.

బిడ్డను దగ్గరకు తీసుకున్న సోనీని నిశితంగా పరిశీలిస్తే, ఆమె కాళ్లు, చేతులు, శరీరంపై అక్కడక్కడా కాలిన గాయాలు కనిపిస్తున్నాయి. 'లింగనిర్ధారణ పరీక్ష చేయించుకోమని నాపై ఒత్తిడి చేశారు. అబార్షన్‌కు ఒప్పుకో అని బలవంతం చేశారు. ఎంతకీ ఒప్పుకోలేదు. వాళ్లు చెప్పిన మాట వినలేదని, ఇస్త్రీపెట్టెతో వాతలు పెట్టారు. ఈ పరిస్థితి నా ఒక్కదానిదే కాదు, ఎంతోమంది తల్లులది' అని ఆనాటి చేదు సంఘటనలను సోనీ గుర్తుచేసుకుంది.



'ఆడపిల్లను రక్షించండి', 'జీవించడం అందరి హక్కు', 'భ్రూణహత్యలు నేరం' అన్న నినాదాలు ఉన్న ప్లకార్డులు ఆ ప్రాంతంలో ఎక్కడ చూసినా కనిపిస్తాయి. గోడల మీద, దుకాణాల మీద, పెద్ద పెద్ద హోర్డింగుల పైన దర్శనమిస్తుంటాయి. ప్రచారానికి పెట్టిన శ్రద్ధ ఆచరణలో లేదు. ఫలితంగా అనాదిగా మగపిల్లవాడి కోసం ఎదురుచూసే ఆ కుటుంబాల్లో చైతన్యం రాలేదు. లింగనిష్పత్తిలో గణనీయమైన మార్పు కనిపిస్తోంది. ప్రతి వెయ్యిమంది అబ్బాయిలకు 914 మంది అమ్మాయిలు ఉన్నట్లు ఈ ఏడాది మార్చిలో వెలువడిన ఓ నివేదికలో తేలింది. మూడేళ్ల కాలంలో ఈ నిష్పత్తి మధ్య వ్యత్యాసం అంతకంతకూ తగ్గుతూ వస్తోంది.

ఇంత దారుణ పరిస్థితుల్లో కూడా అన్యాయంగా బలౌతున్న ఆ ఆడపిల్లల పక్షాన నిలబడేవారే అక్కడ కరువయ్యారు. గడిచిన పదేళ్లలో వెయ్యి కేసులు మాత్రమే నమోదయ్యాయి. మొదట్లో ఏటా వందల సంఖ్యలో నమోదైన కేసులు ఇప్పుడు పదుల సంఖ్యకు పడిపోయాయి. అసలు గర్భిణీల వివరాలు కూడా ప్రభుత్వ నివేదికలకు ఎక్కడం లేదు. అంతలా రహస్య ఒప్పందాలతో కడుపులో బిడ్డను కడుపులోనే చంపేస్తున్నారు.

ఇంటి గుమ్మం దాటకుండానే లింగనిర్ధారణ పరీక్షలు జరిగిపోతున్నాయి. తరువాత జరగాల్సిన మృత్యుహేలను చడీచప్పుడు లేకుండా కానించే ముఠాలు పెరిగిపోయాయి. ఈ దుర్మార్గానికి పాల్పడుతున్న కుటుంబాల్లో పేద, మధ్య తరగతి అన్న తేడా ఉండడం లేదంటున్నారు ఆ ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్న నర్సు. పేరు చెప్పడానికి కూడా ఇష్టపడని ఆమె కొన్ని కఠోర నిజాలు చెబుతున్నారు. లింగనిర్ధారణ పరీక్ష ఖర్చుతో కూడుకున్నది. లక్షల రూపాయలు వెచ్చించడానికి కూడా ప్రజలు వెనుకాడడం లేదు. పేదలు కూడా ఉన్న కాస్త పొలమో, ఇల్లో అమ్మైనా సరే పరీక్షలు చేయించుకుంటున్నారు. ఇద్దరు ఆడబిడ్డల తరువాత కచ్చితంగా మగపిల్లవాడే కనాలన్న బలమైన కోరిక వారిలో ప్రబలంగా ఉంటోంది' అని ఆమె చెబుతున్నారు.

ప్రపంచ ఆరోగ్యసంస్థ నివేదిక ప్రకారం లింగనిష్పత్తి 1000 : 930 నుండి 980 మధ్య ఉండాలి. కానీ హర్యానాలో చాలా జిల్లాలు ఆ దరిదాపుల్లో కూడా లేవు. మహేంద్రగఢ్ (871), గురుగ్రామ్ (871), రోహతక్ (879), కైథాల్ (886), పానిపట్ (887), జింద్ (890), ఫరిదాబాద్ (898) తదితర జిల్లాల్లో ఆడపిల్లల సంఖ్య 900కు కూడా పెరగడం లేదు.


లింగ నిర్ధారణ, చట్టవిరుద్ధమైన అబార్షన్‌లను నిరోధించే లక్ష్యంతో ప్రీ-కాన్సెప్షన్, ప్రీ-నేటల్ డయాగ్నోస్టిక్ టెక్నిక్స్ (పిసిపిఎన్‌డిటి) చట్టం, మెడికల్ టెర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీ (ఎంటిపి) చట్టాలు మన దేశంలో అమల్లో ఉన్నాయి. అయితే ఏ ప్రయోజనాల కోసం చట్టాలు తీసుకొచ్చారో, అవి నెరవేరే ఆచరణ శూన్యంగా కనిపిస్తోంది. దేశంలో ఎంతో అట్టహాసంగా 'బేటీ బచావో బేటీ పడావో' ప్రణాళికను తీసుకొచ్చిన పెద్దలు, ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చే ప్రయత్నాలేమీ చేయలేదు. ఆడపిల్లలు, మహిళల పట్ల పక్షపాత ధోరణితో వ్యవహరించే ఆ పెద్దలు ఆమె వేసుకున్న బట్టలు, తినే ఆహారం, పాటించే ఆచారాలపై నిత్యం ఆంక్షలు, నిర్బంధాలు విధిస్తునే ఉంటారు. అంతటి పాషాణ హృదయాలు ఇప్పుడు మరోసారి ఎన్నికల బరిలో నిల్చున్నాయి. రానున్న రోజుల్లో ఈ దారుణాలు పునరావృతం కాకుండా ఉండాలంటే ప్రజా చైతన్యం రావాలి. పాలకులకు బుద్ధి చెప్పాలి.



ప్రశాంత్ నీల్- ఎన్టీఆర్‌ల కొత్త సినిమా 'డ్రాగన్'?

ప్రశాంత్ నీల్ - ఎన్టీఆర్ కాంబినేషన్‌లో ఓ సినిమా రానున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాను అధికారికంగా ప్రకటించి చాలా నెలలు అవుతోంది. అప్పటి నుంచి దీనిపై ఎలాంటి అప్‌డేట్ లేకపోవడంతో ఫ్యాన్స్ మూవీ టీమ్‌ను ట్యాగ్ చేస్తూ పోస్టులు పెడుతున్నారు. ఈ నేపథ్యంలో ... మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తోన్న ఈ చిత్రానికి 'డ్రాగన్' పేరు ఖరారు చేసినట్లుగా సోషల్ మీడియాలో ట్రెండింగ్ అవుతోంది. ఈ పేరుతో కొన్ని పోస్టర్లు ఎక్స్‌లో దర్శనమిస్తున్నాయి. అక్టోబర్‌లో ఈ భారీ బడ్జెట్ మూవీ పట్టాలెక్కనున్నట్లు సమాచారం. ప్రశాంత్ నీల్ ఈ చిత్రాన్ని కూడా రెండు భాగాలుగా తెరకెక్కించాలని భావిస్తున్నారట. త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన రానుంది.


'కన్నప్ప'లో కాజల్ అగర్వాల్



విష్ణు మంచు డ్రీమ్ ప్రాజెక్ట్ 'కన్నప్ప' నుంచి మరో అప్డేట్ వచ్చింది. ఇందులో కాజల్ అగర్వాల్ ఓ కీలక పాత్రను చేయబోతున్నట్లుగా మేకర్స్ ప్రకటించారు. బాలీవుడ్ స్టార్ అక్షయ్ కుమార్ తన పాత్రకు సంబంధించిన షూటింగ్‌ను ముగించేసుకోవడం, ఆ వెంటనే ప్రభాస్ సెట్‌లోకి రావడం జరిగాయి. తాజాగా వచ్చిన అప్డేట్‌తో మరోసారి నెట్టింట్లో 'కన్నప్ప' ట్యాగ్ టాప్‌లో ట్రెండ్ అవుతోంది. విష్ణు మంచు, కాజల్ కలిసి గతంలో 'మోసగాళ్లు' చిత్రంలో నటించారు. కాజల్ పోషించే కీ రోల్‌లో ఈ పాత్ర 'మగధీర' సినిమాలో మిత్రవిందను మరిపించేలా ఉంటుందని మేకర్స్ చెబుతున్నారు.

ఛాలెంజింగ్ పాత్రలు చేయాలనుంది

కీర్తి సురేష్



'మహానటి' తర్వాత మరింత బాధ్యతగా సినిమాలు చేస్తున్నాను. కొన్ని కథాపాత్రలు నటీనటుల జీవితం, వృత్తిపరమైన ఇమేజ్‌ని మార్చేస్తాయి. ఇకపై మీ జర్నీ ఎలా ఉండాలనేది అవి డిసైడ్ చేస్తాయి. మంచి పాత్రలకు ఉండే బలం అది. 'మహానటి' విషయంలో నాకు అలాంటి అనుభవమే ఎదురైంది. దీని తర్వాత మంచి పాత్రలను ఎంపిక చేసుకుని నటించాలనే భావన కలిగింది." అన్నారు నటి కీర్తి సురేష్. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ, ఈ కామెంట్స్ చేశారు. "నేను చేసే అన్ని సినిమాలు అలాంటి ఫలితాన్ని అందిస్తాయని అనుకోను. షూటింగ్ స్పాట్ నుంచి బయటకు వచ్చిన తర్వాత కూడా ఆ పాత్రలోని ఎమోషనల్ వెంటాడుతుందంటే అది మంచి పాత్ర. అయితే అలాంటి మ్యాజిక్ కొన్నిసార్లే జరుగుతుంది. అలానే ఒకేలాంటి పాత్రలు చేస్తుంటే అభిమానులకు బోర్ కొడుతుంది. అందుకే ఛాలెంజింగ్ పాత్రల్లో నటించాలని అనుకుంటున్నాను" అని చెప్పుకొచ్చారు. 'మహానటి' సినిమాతో ఆమె జాతీయ అవార్డు అందుకున్న విషయం తెలిసిందే! దీని తర్వాత తెలుగు, తమిళ, మలయాళంలో వరస చిత్రాల్లో నటిస్తూ గుర్తింపు తెచ్చుకున్నారు. ఇన్ని సినిమాలు చేస్తున్నా గానీ ఓ విషయంలో సంతృప్తి పడకూడదని ఆమె అంటున్నారు.

24న 'వ్యాన్' విడుదల



షాపింగ్ మాల్ మూవీ హీరో మహేష్ నటిస్తున్న తాజా చిత్రం 'వ్యాన్'. శ్రీ చంద్ర రూప మూవీస్ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు. దాడి లోకేష్ దర్శకత్వం వహిస్తుండగా, నల్లా మాధవరావు నిర్మాత. సంగీతం రఘుత్తందాస్. డిఓపి తమ్ముడి సాయి, ఎడిటర్ ఎంఎన్ఆర్, ఆర్ట్ ఈశ్వర్, కొరియోగ్రాఫర్ పారు వ్యవహరించారు. జబర్దస్త్ ప్రకాష్, కోడి నాగు, మొల్లేటి సూరిబాబు, గణేష్ యానాం, మొసూరి సాయి, చంటి, ఎఫ్ఎం బాబాయ్ తదితరులు తారాగణం. సమాజంలో మధ్య తరగతి మనిషి ఎదుర్కొనే సమస్యలను ఇతివృత్తంగా తీసుకుని ఈ సినిమాను నిర్మించామని మేకర్లు తెలిపారు. అనుక్షణం ఎదురయ్యే సమస్యలను వేగంగా ఎదుర్కొనటం, పరిష్కరించుకునే మార్గాలను తెలియజేసేది ఈ సినిమా కథాంశం అని వివరించారు.

జూన్‌లో 'ఆర్‌సి 16' ప్రారంభం



రామ్‌చరణ్ హీరోగా, దర్శకుడు శంకర్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'గేమ్ ఛేంజర్'. ఇటీవల తాజా షెడ్యూల్ కొనసాగుతోంది. అక్టోబర్ 10న ఈ సినిమా విడుదల చేయబోతున్నారు. ఈ చిత్రం తర్వాత రామ్‌చరణ్ 'ఉప్పెన' ఫేం బుచ్చిబాబు సానా దర్శకత్వంలో 'ఆర్‌సీ 16' వర్కింగ్ టైటిల్‌తో ఓ చిత్రం చేయబోతున్నారు. ఇటీవల పూజా కార్యక్రమాలు జరిగిన విషయం తెలిసిందే. 'ఆర్‌సీ 16' షూటింగ్‌ను జూన్‌లో ప్రారంభించనున్నట్లు సమాచారం. ఇందులో కథానాయికగా జాన్వీ కపూర్ ఎంపికయ్యారు. ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నారు.

రాహుల్, పూరన్ ధనా ధన్..

- **ముంబయిపై 18పరుగుల తేడాతో లక్నో గెలుపు**



ముంబయి: లక్నో సూపర్‌జెయింట్స్ బ్యాటర్లు కెఎల్ రాహుల్(55), నికోలస్ పూరన్(75) ఆఖరి మ్యాచ్‌లో ధనా ధన్ బ్యాటింగ్‌తో చెలరేగారు. దీంతో వాంఖడే వేదికగా జరిగిన ఐపిఎల్ మ్యాచ్‌లో లక్నో జట్టు 18పరుగుల తేడాతో ముంబయిపై విజయం సాధించింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన లక్నో నిర్ణీత 20 ఓవర్లలో 6వికెట్ల నష్టానికి 214పరుగుల భారీస్కోర్ నమోదు చేసింది. ఛేదనలో భాగంగా ముంబయి ఇన్నింగ్స్‌కు వర్షం అడ్డంకిగా నిలిచింది. గంట తర్వాత వర్షం నిలువగా.. అనంతరం ముంబయి జట్టు 20 ఓవర్లలో 6వికెట్ల నష్టానికి 196పరుగులు చేసి ఓటమిపాలైంది. కెప్టెన్ రోహిత్ శర్మ(68), నమన్ ధీర్(67) అర్ధసెంచరీలతో రాణించారు.

అంతకుముందు టాస్ ఓడిన లక్నోకు శుభారంభం దక్కలేదు. ముంబయి పేసర్ నువాన్ తుషార తొలి షాకిచ్చాడు. ఓపెనర్‌గా వచ్చిన దేవ్‌దత్ పడిక్కల్(0)ను ఇన్‌స్వింగర్‌తో గోల్డెన్ డక్‌గా వెనక్కి పంపాడు. దాంతో లక్నో ఒక్క పరుగుకే తొలి వికెట్ కోల్పోయింది. ఆ తర్వాత వచ్చిన మార్కస్ స్టోయినిస్(28) అండగా కేఎల్ రాహుల్(55) ఇన్నింగ్స్ నిర్మించాడు. అర్జున్ టెండూల్కర్ బౌలింగ్‌లో రివ్యూతో బతికిపోయిన స్టోయినిస్.. అన్షుల్ కంబోజ్ ఓవర్లో హ్యాట్రిక్ ఫోర్లు బాదాడు. మరో ఎండ్‌లో రాహుల్ సైతం వేగం పెంచాడు. నాల్గో వికెట్‌కు 109 పరుగులు జోడించి లక్నో జట్టు భారీస్కోర్‌కు దోహదపడ్డారు. చివర్లో ఆయుశ్ బడోని(22నాటౌట్), కృనాల్ పాండ్యా(12నాటౌట్) మెరుపులతో ముగించారు. రొమారియో షెఫర్డ్ వేసిన 20వ ఓవర్లో బదొని రెండు సిక్సర్లు బాదడంతో లక్నో రెండొందలు కొట్టగలిగింది.

పూరన్ 29బంతుల్లోనే...

లక్నో 69 పరుగులకే మూడు వికెట్లు పడిన దశలో క్రీజులోకి వచ్చిన నికోలస్ పూరన్(75) ఆకాశమే హద్దుగా చెలరేగాడు. కెప్టెన్ రాహుల్‌తో కేవలం 29 బంతుల్లోనే 5ఫోర్లు, 8 సిక్సర్ల సాయంతో 75 పరుగులతో రాణించాడు.

స్కోర్‌బోర్డు..

లక్నో సూపర్‌జెయింట్స్ ఇన్నింగ్స్: కెఎల్ రాహుల్ (సి)తుషారా (బి)చావ్లా 55, పడిక్కల్ (ఎల్‌బి)తుషార 0, స్టొయినీస్ (ఎల్‌బి)చావ్లా 28, దీపక్ హుడా (సి)నేహల్ వధేరా (బి)చావ్లా 11, నికోలస్ పూరన్ (సి)సూర్యకుమార్ (బి)తుషార 75, ఆర్షద్ ఖాన్ (సి)నేహల్ వధేరా (బి)తుషారా 0, బడోనీ (నాటౌట్) 22, కృనాల్ పాండ్యా (నాటౌట్) 12, అదనం 11. (20 ఓవర్లలో 6వికెట్ల నష్టానికి) 214పరుగులు. **వికెట్ల పతనం:** 1/1, 2/49, 3/69, 4/178, 5/178, 6/178 **బౌలింగ్:** తుషారా 4-0-28-3, అర్జున్ 2.2-0-22-0, కంబోజ్ 3-0-48-0, చావ్లా 4-0-29-3, వధేరా 3-0-13-0, హార్దిక్ 2-0-27-0, నమన్ ధీర్ 0.4-0-17-0, షెఫర్డ్ 2-0-30-0.

సెమీస్‌కు సాత్విక్-చిరాగ్ జోడి

క్వార్టర్స్‌లో ఓడిన మైస్నం



బ్యాంకాక్: థాయ్‌లాండ్ ఓపెన్ సూపర్-500 బ్యాడ్మింటన్ టోర్నీలో సంచలనాల మైస్నం జోరుకు బ్రేక్ పడింది. శుక్రవారం జరిగిన పురుషుల సింగిల్స్ క్వార్టర్‌ఫైనల్లో మైస్నం 12-21, 5-21తో 8వ సీడ్ విదిత్‌శరణ్ చేతిలో కేవలం 34నిమిషాల్లోనే ఓడారు. తొలిరౌండ్‌లో 8వ సీడ్ హెచ్ఎస్ ప్రణయ్‌కు ఓడించి క్వార్టర్స్‌లోకి దూసుకొచ్చిన మైస్నం ఆ స్థాయి ప్రదర్శనను కనబర్చడంలో విఫలమయ్యాడు. ఇక పురుషుల డబుల్స్‌లో సాత్విక్-చిరాగ్ శెట్టి సెమీస్‌కు చేరారు. క్వార్టర్‌ఫైనల్లో వీరు 21-7, 21-14తో ప్రపంచ 64వ ర్యాంక్ జంట మలేషియాకు చెందిన ఆరిఫ్-రాయ్ కింగ్‌లను ఓడించారు. ఈ మ్యాచ్ కేవలం 38 నిమిషాల్లోనే ముగిసింది. సెమీస్‌లో సాత్విక్-చిరాగ్ జంట కొరియాకు చెందిన టాంగ్ కాయ్-మింగ్ ఛేలూలతో తలపడనున్నారు. మహిళల డబుల్స్ హోరాహోరీ పోరులో నెగ్గి అశ్విని పొన్నప్ప-తానీషా కాస్ట్రో సెమీస్‌కు చేరారు. ఉత్కంఠ పోరులో వీరు 21-15, 21-23, 21-19తో సుమారు 76నిమిషాలపాటు మ్యాచ్ ఆడి నెగ్గారు.

పర్వీన్ హుడాపై 'వాడా' వేటు

కోల్పోయిన పారిస్ ఒలింపిక్స్ బెర్త్



న్యూఢిల్లీ: భారత మహిళా బాక్సర్ పర్వీన్ హుడాపై ప్రపంచ యాంటీ-డోపింగ్ అథారిటీ(వాడా) తాత్కాలిక సస్పెన్షన్ విధించింది. ఏప్రిల్ 2022 నుంచి మార్చి 2023 మధ్య కాలంలో పర్వీన్ హుడా ఎక్కడ ఉన్న విషయం తెలియపర్చడంలో విఫలమైందనందున వాడా ఆమెపై వేటు వేసినట్లు శుక్రవారం ట్విటర్‌లో పేర్కొంది. ప్రతి మూడు నెలలకొకసారి రిజిస్టర్ టెస్టింగ్ పూల్(ఆర్‌టిపి)లో ప్రతి అథ్లెట్ తప్పనిసరిగా ఉన్న ప్రాంతాన్ని అప్‌డేట్ చేయాల్సి ఉండగా.. పర్వీన్ అందులో విఫలం కావడమే ఇందుకు ప్రధాన కారణం. వాడా నిబంధనల ప్రకారం ఓ అథ్లెట్ నివసించే ఇంటి చిరునామా, శిక్షణ సమాచారం, ఏ క్రీడాంశం, పోటీల షెడ్యూల్, వ్యక్తిగత సమాచారమంతా మూడు నెలలకోసారి అప్‌డేట్ చేయాల్సి ఉంది. వీటిలో ఏ ఒక్కటి సరైనది కాదని తేలినా ఆ అథ్లెట్‌పై వాడా నిబంధనల ప్రకారం రెండేళ్లవరకు సస్పెన్షన్ వేటు వేయవచ్చు. ఇక మహిళల 57కిలోల విభాగంలో పర్వీన్ హుడా పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించింది. వాడా సస్పెన్షన్ వేటు వేయడంతో ఆమె ఒలింపిక్స్‌లో పాల్గొనే అవకాశం కోల్పోయినట్లయ్యింది. దీంతో బాక్సింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(బాయ్) మరో బాక్సర్‌ను 57కిలోల విభాగం నుంచి ఎంపిక చేసిన ఒలింపిక్స్‌కు పంపించాల్సి ఉంటుంది. ఇక నిఖత్ జరీన్(ఫ్లై-వెయిట్), ప్రీతి సాయి పహిర్(బాటమ్ వెయిట్)తో పాటు టోక్యో ఒలింపిక్స్ కాంస్య పతక విజేత లౌలీనా బోర్గోహైన్(మిడిల్ వెయిట్) పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించిన ఇతర బాక్సర్లు.

ఐపిఎల్‌లో నేడు

బెంగళూరు × చెన్నై
వేదిక: బెంగళూరు; రా.7.30గం॥లకు

పాయింట్ల పట్టిక

జట్టు	మ్యా	గె	ఓ	ర	పా	నె.ర.
కోల్‌కతా	13	9	3	1	19	1.42
రాజస్తాన్	13	8	5	0	16	0.27
సన్‌రైజర్స్	13	7	5	1	15	0.40
చెన్నై	13	7	6	0	14	0.52
ఢిల్లీ క్యాపిటల్స్	14	7	7	0	14	-0.37
లక్నో	14	7	7	0	14	-0.66
బెంగళూరు	13	6	7	0	12	0.38
గుజరాత్	14	5	7	2	12	-1.32
పంజాబ్‌కింగ్స్	13	5	8	0	10	-0.34
ముంబయి	14	4	10	0	8	-0.31

మ్యా:మ్యాచ్‌లు; గె:గెలుపు; ఓ:ఓటమి; పా:పాయింట్లు; ర: రద్దునె.ర.:నెట్‌రన్‌రేట్

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68